అమ్మా! సాక్షాత్తు
పరమశివుడు నీతో కలిసినప్పుడే
సృష్టి చేయడానికి సమర్థుడు.
అలా కాకపోతే ఆయన చలించడానికి కూడా
అసమర్థుడు. హరిహర బ్రహ్మాదులకు కూడా అందని
నిన్ను స్తోత్రం చెయ్యడానికో నమస్కరించడానికో
పూర్వపుణ్యం లేనివారికి ఎలా సాధ్యమౌతుంది?

వ్యాఖ్యానం:

సంస్కృత సాహిత్యంలో ఒక సంప్రదాయం ఉంది. అదేమిటంటే గ్రంథంలో చెప్పబోయే విషయాన్ని మొదటి శ్లోకంలోనే సూచించడం. ఇది ఒక అద్భుతమైన ప్రక్రియ. ఆది శంకరులు ఒక మహాకవి, ఆయన ఆచార్యులు కాకుండా, అద్వైత మార్గ ప్రవర్తకులు కాకుండా ఒక కవి అయి ఉండి ఉంటే వాల్మీకి, కాళిదాసు, భవభూతి, భారవిలా ఎంతో గొప్ప కవిగా కీర్తి గాంచి ఉండేవారు. కాని వారి అవతార గమ్యం వేరు. అయినా మనం అక్కడక్కడ వారి కవిత్వంలోని రమణీయతనూ ఆస్వాదించాలి. ఈ మొదటి శ్లోకంలో వారు అమ్మవారి గొప్పదనాన్ని అతి రమణీయంగా వర్ణిస్తూనే మిగిలిన గ్రంథం అంతా శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి మహాత్మ్యాన్ని ఇందులో సూచించారు. ఎంత గొప్పదనం ఈ మొదటి శ్లోకంలోనే చెప్పారంటే సంస్కృతంలో వ్యాఖ్యానం వ్రాసిన కామేశ్వర సూరి అనే మహా విద్వాంసుడు ఈ శ్లోకంలో శంకరుల వారు శివ శక్తుల 14 వివిధ విషయాలను సూచించారని చెప్పారు. శివుడు అనే మాటకు మంగళప్రదమైనవాడు, అవిద్యను తొలగించువాడు, జాడ్యమును పోగొట్టువాడు మొదలైన అనేక అర్థాలున్నాయి. శుభమును కలిగించువాడు శివుడు. అమ్మవారు శక్తిస్వరూపిణి. శక్తితో కలిసిన శివుడే సృష్టికి కారణభూతుడు. అమ్మ లేనిదే అయ్య సృష్టించడమే కాదు ఏ చలనమూ లేనివాడు కూడా..

ఆదిశంకరుల **సౌందర్యలహరి** అమృతలహరి - వ్యాఖ్యానం : ఆచార్య పప్పు వేణుగోపాలరావు

ఆదిశంకరుల

సౌందర్యలహరి



అమృతలహరి - వ్యాఖ్యానం

ఆచార్య పప్పు వేణుగోపాలరావు

ఆదిశంకరుల

సౌందర్యలహరి

అమృతలహరి – వ్యాఖ్యానం:

ఆచార్య పప్ప వేణుగోపాలరావు

PAPPUS ACADAMIC & CULTURAL TRUST
CHENNAI - 603108.

Soundaryalahari of Adi Sankara

Summary & Commentary by

Dr. Pappu Venugopala Rao *D.Litt.,*

© Dr. Pappu Venugopala Rao D.Litt.,

Second Publication: ***June, 2023***

For Free Distribution

Cover Concept: ***K.M. Jee Shan***

PAPPUS ACADEMIC & CULTURAL TRUST,
CHENNAI - 603108

Pappu Family:
Bharadwaz, Vandana
Pathanjali, Sruthi

Grand children:
Shivani, Pranav, Sachin, Shriya and Siddhanth

Printed at:

Kala Jyothi Process Pvt., Ltd.,
1-1-60/5, R.T.C. X Roads, Musheerabad,
Hyderabad-500 020.
Ph: 040-27645536, 27612436.

స్మృత్యంజలి

శ్రీమతి రావాడ జయ వేణుగోపాల్

(1950–2023)

ఉ. యాబదిమూడు వర్షములు ఆత్మశరీర మనంబులొక్కటై
లోబడియుంటిమార్ద్రముగ లోలవిలోలవిలాసవీచికన్
రేబవలందు నేకతమ రీతిని ఊపిరికూపిరై సదా –
ఈబతుకిప్పుడే గతిని యేతరి మోతునో సెప్పుమా జయా!

– నీ పప్పు వేణుగోపాల రావు

కాశీబుగ్గ

'కాశీబుగ్గ' అనే క్షేత్రం ఉంది. ఆ చుట్టు ప్రక్కలలో ఎక్కడా మంచినీరు సులభంగా దొరకదు. అటువంటి చోట ఒక అద్భుతమైన జలధార పుడమితల్లి కడుపు చీల్చుకొని ఉప్పొంగింది. అదే 'కాశీబుగ్గ'. అదే రీతిలో ఎక్కడో తెలంగాణ మారుమూల కుగ్రామంలో పలుకులమ్మ కడుపు చీల్చుకొని ఉవ్వెత్తున ఎగసిన కవితా జలధార ఒకటి ఉంది. అదే 'అందెశ్రీ'.

"మాలాంటివారి కవిత్వాలు గ్రంథాలలోంచి పుడుతున్నాయి. అందెశ్రీ కవిత్వం సూటిగా ప్రకృతిలోంచి పెల్లుబుకుతోంది" – అని నేను ఇదివరకు చాలాసార్లు అనుకొన్నాను, అన్నాను. కవిత్వమే కాదు, ఆ బుగ్గలోంచి ఆధ్యాత్మిక విజ్ఞాన స్రవంతి కూడా ఉప్పొంగుతోందని ఇప్పుడు తెలుసుకుంటున్నాను. ఎందుకంటే, అతడు ఆదిశంకరుల సౌందర్యలహరి లోని కవితా సౌందర్య ప్రవాహానికి మాత్రమే కాక, అక్కడి శ్రీ విద్యా ప్రవాహానికి కూడా ఉవ్వెత్తున ఉప్పొంగగలిగాడు. ఆ పొంగులో ఆచార్య పప్పు వేణుగోపాలరావుగారిని పట్టుకోగలిగాడు.

వారి సౌందర్యలహరీ ప్రవచన లహరిలో తలమునకలైన అందెశ్రీ, తనకు అర్థమయ్యేలాగా, తనలాంటి వేలాదిమందికి ఉపయోగపడేలాగ, శంకరుల సౌందర్యలహరి మీద లఘువ్యాఖ్యానం వ్రాసి ఇవ్వమని పప్పువారిని ప్రార్థించాడు. దానికి ఫలితమే మీ చేతిలో ఉన్న ఈ అమృతలహరీ వ్యాఖ్య.

'పప్పు'వారికి పెద్ద పరీక్ష ఎదురైంది. ఎందుకంటే, వారి దగ్గర మహాసముద్రమంత విజ్ఞానం ఉంది. అందెశ్రీ అందించిన బిందె మాత్రం కొంగ ముక్కల్లే సన్నగా బారెడు పొడుగే ఉంది.

ప్రాణశక్తి ఆకాశం అంతా నిండి ఉంటే, దాన్ని జీవుల నాడీ మండలాలలోకి ఎక్కించడం పరమేశ్వరుడికి పెద్ద పరిశ్రమ అని ఉపనిషత్తులు చెబుతున్నాయి. అలాంటి పరిశ్రమే ఇప్పుడు 'పప్పు'వారికి ఎదురైంది. కానీ వారు వేణుగోపాలులు గనుక, గోపాలబాలుడు వేణువు

ఊదినంత సులువుగా ఈ అమృతలహరీ వ్యాఖ్యను ప్రవహింపజేశారు. ఆదిశంకరుల *సౌందర్యలహరి* లో రెండు విభిన్న పార్శ్వాలున్నాయి. శ్రీవిద్యాపార్శ్వమని, అలంకారిక కల్పనాపార్శ్వమని. రెండు పార్శ్వాలలోనూ శంకరులు తమ కవితా వైభవాన్ని పొంగులెత్తించారు. ఏ పొంగూ కొంగ మూతి నాళాలకు లొంగేది కాదు. శ్రీవిద్యా భాగంలో ఆ క్లేశం మరింత ఎక్కువ. అలాంటి చోట్ల 'పప్పు'వారిలాంటి విదగ్ధ శిఖామణి తన పాండిత్య వైభవాన్ని కుదించుకొని, 'ఆడియన్స్ కాంషస్‌నెస్'ని పెంచుకొని, ఎంత చెప్పాలో అంత మాత్రమే చెప్పి ఊరుకొన్నారంటే, వారి సంయమన శక్తిని తక్కువగా అంచనా వేసే వీలు లేదు.

దీనికి ఉదాహరణగా 9, 10 శ్లోకాలలోని షట్చక్ర-నవావరణ సామరస్య ప్రతిపాదనకు వారిచ్చిన వివరణను మనం స్వీకరించవచ్చు. ఇది చాలా జటిలమైన ఘట్టం. వాదాలకు నెలవైన ఘట్టం. అయినా సరే, 'పప్పు'వారు అరటిపండు ఒలిచి పాఠకులకు అందించేశారు.

అక్కడే 11వ శ్లోకంలో వారి శ్రీచక్రనిర్మాణ వివరణ కూడా ఒక కలికితురాయివంటిదే. చక్రమన్నా, యంత్రమన్నా ఒకటే. ఇది రేఖాగణితమయం. ఇది ఊహాజనితమని ఆధునికుల ఆక్షేపణ. అది అనుభవరాహిత్యంవల్ల పొంగెత్తిన దూషణ.

ఒక అయస్కాంత శిలను తీసుకొని, దానిపైన తెల్లటి కాగితం పరచి, దాని మీద సన్నటి ఇనుప రజను చల్లి, ఆ కాగితాన్ని కొంచెం కొంచెం కదిలిస్తే, ఆ ఇనుప రజనంతా క్రింద ఉన్న అయస్కాంత శిలను కేంద్రంగా చేసుకొని, సూర్యకిరణ రేఖలవంటి రేఖలుగా ఏర్పడుతుంది. దీనినిబట్టి, అడుగున ఉన్న శిలలోని అయస్కాంత శక్తి రేఖలు రేఖలుగా ప్రసరిస్తోందని మనకి అర్థమవుతుంది.

అలాగే పరిశుద్ధుడైన సాధకుడు ఒక దేవతా మంత్రాన్ని నిశ్చలంగా ఉపాసన చేస్తూ ఉంటే, అతడి చుట్టూతా శక్తితరంగ రేఖలు చిత్రవిచిత్రంగా విస్తరిస్తూ ఉంటాయి. ఆ రేఖల తీరు తెన్నులను గుర్తించగలిగిన

దివ్యమహర్షులు, ఆ రేఖలనే ఆ దేవతకు సంబంధించిన యంత్రంగా రూపొందించి, "ఈ రకమైన శక్తిప్రవాహమే నువ్వు ఉపాసించే దేవత యొక్క అసలైన శక్తిస్వరూపము" అని బోధిస్తూ, యంత్రాలను మనకందించారు.

అలాంటి యంత్రాలలో శ్రీ చక్రయంత్రరాజం సర్వోన్నతమైనది. రేఖాగణితపరంగా అత్యంత సంక్లిష్టమైనది. ఆధునిక ప్రాశ్చాత్య రేఖాగణితవేత్తలు అనేకమంది ఈ రేఖాయంత్ర నిర్మాణం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేసి ఉన్నారు. గుంటూరులోని ఆచార్య గోపాలకృష్ణవంటివారు కంప్యూటర్ల ద్వారా పరిశోధన చేసి, ఆ రేఖల పంజరంలో అమ్మవారి స్థూలరూపం కూడా దర్శనమిస్తుందని నిరూపించారు.

అటువంటి సంక్లిష్ట చక్ర యంత్ర నిర్మాణాన్ని ప్రకృతి పురుషుల సంగమంగా, శివశక్తుల సంయోగంగా, మన మహర్షులు దర్శించిన తీరును శ్రీ 'పప్పు'వారు వీలైనంత సంగ్రహంగా మనకు అందించారు. నిజానికి ఈ గ్రంథంలోని వంద శ్లోకాలు కూడా మహామంత్రాలే. వాటన్నింటికీ వేర్వేరు యంత్రాలనూ, ఉపాసనా విధానాలనూ, సాంప్రదాయక వ్యాఖ్యాతలు వివరించారు.

యంత్రాలలో రేఖలు మాత్రమేగాక, కొన్ని సందర్భాలలో కొందరు దేవతలు కూడా ఉంటారని తంత్ర గ్రంథాలు బోధిస్తున్నాయి. దీనికి అనుగుణంగానే, మూలగ్రంథంలోని 32వ శ్లోకం దగ్గర శ్రీచక్రంలోని దేవతలను వివరించే సందర్భంలో, ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తులను 'పప్పు'వారు వివరించిన తీరు, ఆయా సందర్భాలలో వ్యాఖ్యాతల మతాంతరాలను ప్రస్తావిస్తూనే విషయాన్ని సరళతరం చేసిన తీరు, ప్రశంసనీయమైనది.

ఇక 42వ శ్లోకం దగ్గర నుంచీ అమ్మవారి యొక్క రూపవర్ణన ఖండం ప్రారంభమైనప్పటికీ, ఈ ఖండం కూడా మంత్రశక్తితో నిండి ఉన్నదే. ఈ ఖండంలోని కవితా సౌందర్యాలు విస్తరించి చెప్పాలంటే, అలంకార

శాస్త్రపు లోతులలోకి పోవాలి. అలా పోతే శంకరుల కవిత్వం అనేకమంది పురాతన సుప్రసిద్ధ కవుల కీర్తులను అవలీలగా మింగివేయగలదు. కానీ, శ్రీమదాదిశంకర మహాకవిని తాత్త్వికుడన్న కీర్తి మింగివేయటంవల్ల, వ్యాఖ్యాతలు ఆయనను కవిగా గుర్తించడం కావాలనే కొంచెం తగ్గించుకొన్నారు. 'పప్పు'వారు కూడా ఆ బాటలోనే నడిచారు.

అయినా 59వ శ్లోక వ్యాఖ్యానం దగ్గర వీరి కవితా పక్షపాతంతో పాటు విమర్శకులను ప్రతిఘటించే సందర్భంలో వీరికిగల సంయమనశక్తి సువ్యక్తమైంది.

ఈ శ్లోకంలో అమ్మవారి ముఖమే ఒక నాలుగు చక్రాల రథంవంటిదనీ, మన్మథుడు దాని మీదికి ఎక్కి (అధిరుహ్య) శివుణ్ణి జయిస్తున్నాడనీ ఉంది. ఇక్కడ కైవల్యశర్మ అనే వ్యాఖ్యాతకు మన్మథుడు అమ్మవారి ముఖం మీదికి ఎక్కాడు (అధిరుహ్య) అనే మాట నచ్చలేదు. అందుకే ఆయన ఆ పదాన్ని 'ఆశ్రిత్య' (ఆశ్రయించి) అని మార్చుకొంటే బాగుంటుందని సూచించే సాహసం చేశాడు.

"మహాకవుల పదప్రయోగాలు పరివర్తనాసహాలు" – అని అలంకారికుల ఆభాణకం. ఈ సామెతను అతిక్రమించి కైవల్య పండితుడు శంకరుల పదప్రయోగానికి పరివర్తన కలిగిస్తాననటం 'పప్పు'వారికి నచ్చలేదు. అయినా ఆయన నాకుమల్లే మోటుగా కాకుండా "ఇలా అభిప్రాయ భేదాలను చెప్పనివ్వటం మన పూర్వీకుల ఉత్తమ సంస్కారం" అని ఊరుకున్నారు.

ఇంతకూ కైవల్య పండితుడి అభిప్రాయం నచ్చకపోవటానికి కారణమేమిటంటే, ఆయన అమ్మవారి స్వరూపాన్ని మానవ మహిళా స్వరూపంగా భావిస్తున్నాడు. అందుకే దాని మీదికి మరో మగవాడు ఎక్కడం ఆయనకు నచ్చటం లేదు.

"అమ్మ" అన్నంత మాత్రాన అమ్మవారిని మానవ కాంతగా భావించడం మహర్షులకు సమ్మతం కాదు. ఒక విరబూచిన మామిడి చెట్టులో

ఎంతమంది అమ్మలున్నారు?! ఈ అమ్మతనానికి మానవ రూపమే అక్కరలేదు; జననేంద్రియాలు అంతకంటే అక్కరలేదు! మాతృత్వాన్ని ఈ విధంగా అర్థం చేసుకోగలిగితే "ఆరుహ్య" అనే పదంలో కొత్త స్వారస్యం ఒకటి కనిపిస్తుంది. ఈ పదం "రుహ" ధాతువులోంచి వచ్చింది. "మొలకెత్తుట" అని దీనికి అర్థం. అమ్మ పునరుజ్జీవనానికి మూలస్థానం గనుక, సృష్టిని మళ్ళీ మొలకెత్తించదలచుకొన్న మన్మథుడు అమ్మ ముఖాన్ని ఆరోహించాడు అనటమే తత్త్వశాస్త్రానికి మరింత సన్నిహితంగా ఉంటుంది.

అందకే 76వ శ్లోక వ్యాఖ్యానంలో పప్పువారు "వర్ణనలో అమ్మ మాతృత్వాన్ని చూసే దృష్టి ఉండాలి. ఇందులో యోగరహస్యాలు, సాముద్రిక లక్షణాలు ఉన్నాయి" అని ప్రకటించారు.

ఈ విధంగా చక్కటి పంటకాలువగా 'పప్పు'వారు ఏర్పరచిన అమృతలహరి వ్యాఖ్యానకుల్య పాఠకుల హృదయాలలో ప్రవేశించి, వారిలో క్రొత్త భావనల సస్యాలను మొలకెత్తించి, వారిని మరింత విస్తారమైన వ్యాఖ్యాన మహానదులలో ఈతలు కొట్టేటట్లుగా చేయగలదనీ, తద్వారా అమ్మవారి తత్త్వసౌందర్యలహరిలో ఓలలాడే భాగ్యాన్ని క్రమక్రమంగా అందించగలదనీ, విశ్వసిస్తున్నాను. అందుకే, దీనిని 'పప్పు' వారి మేధాకేదారపు పొరలలోంచి పొటమరించిన 'కాశీబుగ్గ'గా సంభావిస్తున్నాను.

శ్రీమాత్రే నమః

09-3-2020, మైసూరు.
హోలికాపూర్ణిమ,
వికారినామ సంవత్సరం

కుప్పా వేంకటకృష్ణమూర్తి
విద్యాధికారి అవధూత దత్తపీఠం,
మైసూరు

ప్రథమ ముద్రణ అభినందన

ఓ సాయంసంజవేళ – అహర్పతి – డాల్ఫిన్ నోస్ కొండ కొన వెనుకగా కనుమరుగయిపోతూ బంగరు పొడి జల్లి చీకట్లకు దారి చేస్తున్నాడు. చీకట్లు వెలుగును చూడగలవా? కడలి అలలు చెలియలికట్ట దాటలేక నురుగులు కక్కుతున్నాయి. సుదూర తీరాల నుండి బయలుదేరిన పడమటి గాలి కార్పొరేషన్ ఓపెన్ ప్రాంగణానికి చేరుతోంది. ఎల్.ఇ.డి. దీపాలు ప్లాస్టిక్ వెన్నెలలు కురిపిస్తున్నాయి. రసజ్ఞులతో నిండిపోయిన సిమెంట్ సీట్లు కఠినంగా ఉన్నాయి. ఆ సాయంత్రం ఓ మిత్రునితో అక్కడే ఉన్నాను. షణ్ముఖశర్మ హస్కీ స్వరంలో సౌందర్యలహరి కర్ణపేయంగా వినవస్తోంది. రసానందంలో ముంచివేస్తున్న శంకరుల అద్భుత కవితా భావనా ప్రవాహం – ఊహావిహారం... ఇది ఎప్పటి సంగతి? దశాబ్దన్నర కాలంలో ఎన్నో వసంతాలు – మరెన్నో పూర్ణచంద్రులు చీకట్లలో కలిసిపోయాయి. ఏమిటి ఈ చీకట్లు? అమ్మవారిని అడిగాయట – అమ్మా! మాకు వెలుగు చూడాలని ఉన్నది అని. అవును! అమ్మనే కదా అడగాలి. అమ్మ దయామయి. ఇదిగో నా కురులలో చేరండి – వెలుగుదారిలా ఉన్న నా పాపిటకి రెండు ప్రక్కలా దాగండి. కొద్దిగా ముందుకు చూడండి. అమ్మ నుదుట పొద్దుపొడుపు కనిపిస్తుంది. ఆహా! ఇవి అమ్మనోట శంకరులు పలుకుతున్నారు. అంతే! అప్పటి నుంచి ఆదిశంకరులను – కాళిదాసాదులకు అన్నగానే చూస్తున్నాను. చెప్పాను కదా! దశాబ్దన్నర దొర్లిపోయింది. ఒక అదృష్టపు సాయంత్రం ప్లాజా హోటల్ స్వీట్‌లో వేణుగోపాలుని రూపంలో నా సంకల్పం మూర్తిమంతమైంది. ఆయననే అమృతలహరిని అందించమని అర్థించాం – నేను, అందెశ్రీ. అలా మూడు గంటలు మా మనసులో

అమ్మవారి ఆభరణాల చిరుగంటలు మ్రోగాయి. రెండు నెలల్లో మళ్ళీ అదే సీటు – దాదాపు పది గంటలు పైగా ఆయన మోహనరాగమో – సమ్మోహనరాగమో – నాకు సంగీత జ్ఞానం లేదు కదా – చదివి, పాడి – చెప్పి, వినిపించిన అమృతలహరితో పునీతమైపోయాం. రాత్రి ఒంటిగంటకు ఇంటికి చేరి చీకట్లలో వెలుగు పూయటం దర్శించాను. అమ్మ తెలియని అనాథను, అమ్మఒడిలో నిద్రపోయాను. కలల్లో మేల్కొన్నాను. ఇదిగో – ఇప్పుడు మీ చేతుల్లో పెడుతున్న అమృతలహరి చీకటి నుంచి వెలుగులోకి ప్రయాణం. మీరూ చేయండి – అద్భుత కవితా సౌందర్య ప్రకాశాన్ని దర్శించండి.

శార్వరి ఉగాది, మార్చి–20–2020

ప్రథమ ముద్రణ సందేశం....

అమ్మ అన్న మాట

శ్రీ వైశాఖ మాసం 2018 సంవత్సరం అనుకుంటా...

తెలుగు అధ్యాపకురాలు డా. దీపిక గారు ఒకరోజు ఫోన్ చేసి "మీరు శ్రీ చాగంటి వారి *సౌందర్యలహరి* సప్తాహ ప్రవచనాల్ని విన్నారా?" అని అడిగారు. "వినలేదమ్మా..." అని చెప్పాను. "మీరు తప్పకుండా ఒకసారి వినండి. యూ-ట్యూబ్‌లో దొరుకుతుంది" అని అన్నది. అన్నదే తడవుగా అదే రాత్రి విన్నాను. మొదటిరోజు మొదటి శ్లోకం విన్నాను. విన్నది విన్న క్షణమే నా మనసంతా తన్మయత్వపు రెక్కలు తొడుక్కొని నాకు తెలియని కవితా లోకాలను దర్శనం చేసుకున్న అనుభూతి కలిగింది. రోజుకు ఒక శ్లోకం చొప్పున ఏడు రాత్రులు ఏడు శ్లోకాలు విన్నాను. అది ఆదిశంకరుల కవితా మహత్మ్యమా? లేక శ్రీ చాగంటి వారి అచ్చెరువు గొలిపే పండిత వాగ్ధాటా? అమ్మలనుగన్నయమ్మ అనంతశక్తా? నా అనామకపు కపాలానికి అది అందలేకపోయిందనే అనాలి.

సాహిత్యంలో రామాయణ మహాభారత ఇతిహాసాలు, భాగవతాది మహాపురాణాలు, నా దేశపు కదన కవితాసాగరాలు. ఎందరో మహాకవులు భారతీయ వాఙ్మయంలో కావ్యాల చుట్టూ, కాకపోతే రాజుల చుట్టూ, రాజ్యాల చుట్టూ, కీర్తి శిఖరాల చుట్టూ పరిభ్రమణం చేసినవాళ్లే, పరిభ్రమిస్తున్నవాళ్లే. ఏ కాలమయితేనేమీ, ఏ కవులు రాస్తేనేమి, ఆస్థాన కవిత్వమే ఎక్కువ. అసలైన కవిత్వం చాలా తక్కువ. ఆదిశంకరులు మాత్రం అమ్మను మాత్రమే నమ్ముకొని మహిమాన్విత కవితా పంటలను పండించుకున్నారు. ఆ కవితా ఫలాలను మానవజాతికి పంచాలనుకున్నారు కాబోలు ఎవరి మెప్పుకోసమో, ఏ రాజుల ఆశ్రయం కోసమో, ఏ కీర్తికిరీటాల కోసమో రాసుకున్నది కాదు *సౌందర్యలహరి*. అమ్మ అంటే మన కళ్ళతో తిలకించే బొమ్మ కాదు, విశ్వమంగళ విరాట స్వరూపమే!

ఆదిశంకరుల విరచితమైన ఈ *సౌందర్యలహరి* ని ఆధ్యాత్మిక కావ్యమనాలా, లేక శృంగార కావ్యమనాలా, కాదు కాదు పెంజీకటి కవ్వలి నిగూఢపు నిఘంటువు అనాలా, ఊరేగింపుల కవిత్వమనాలా, ఊపిరై సమస్త ప్రాణికోటిని ప్రవహింప చేస్తున్న ప్రణవమనాలా, గాలికి దూదిపిందెలా రాలిపోయే ప్రాణమనాలా – నాకున్న మిడిమిడి కవితా జ్ఞానానికి అందనిదే.

నా లోలోన ఎన్నో ప్రశ్నలు. నేను విన్నది, నేను కన్నది, నేను చదువుకున్నది కవిత్వమేనా అన్న ఒక సందిగ్ధత. కానీ *సౌందర్యలహరి* భారతదేశపు కవులే కాదు, ప్రపంచ కవులు కూడా అందుకోలేని మర్మగర్భిత కవితా కావ్యం.

ఆదిశంకరులు ఏడో శతాబ్దంలో విరచించిన ఈ కవితా శిల్పం ఈనాటి వరకు వెంట్రుకవాసి మొక్కవోనిదై దిక్కులను, దిగంతాలను వెలిగిస్తూనే ఉంది. ఈ *సౌందర్యలహరి* ని పండిత లోకం ఈ పద్నాలుగు వందల సంవత్సరాలుగా ప్రజలకు చేరువ కానివ్వలేదనే అనిపించింది. ఇప్పుడు ఇది పండితులకే కాదు పామరులను కూడా చేరుకోవాలి అన్న నా సంకల్పం నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. అందరికీ అర్థమయ్యే రీతిలో తెలుగులో ఎవరు రాయగలరు అన్న నా అన్వేషణ. ఎందరినో కలిశాను. ఈ 100 శ్లోకాలలో దాగిన కవితాలోకపు సత్యాలను చెప్పగలరా? సంస్కృత భాష రహస్యములను విప్పగలరా? అన్న మీమాంస.

ఎవరిని కలవాలి? ఎవరికి ఏమి అవసరం ఇప్పుడు? ఏమున్నది అందులో అన్న నిర్లక్ష్యం తప్ప. అన్నీ తెలిసి కాదు. తెలియని తనమే ఎక్కువ. ఇలా రెండు సంవత్సరాలు సందిగ్ధావస్థలో ఉన్న నాకు ***మిసిమి*** పత్రిక నాలో ఉన్న ఆశకు చిరుశ్వాసను అందించినట్లయింది.

భరతనాట్య శాస్త్రం మీద *'రంగప్రవేశం'* అనే ఒక వ్యాసం ***మిసిమి*** (సెప్టెంబర్ – 2019)లో అచ్చయింది. రచయిత శ్రీ ఆచార్య పప్పు వేణుగోపాలరావు అని ఉన్నది. ఈ ఆచార్య పప్పు వేణుగోపాలరావు

ఎవరో, నేను అందుకోగలనా? నా పిచ్చిగానీ ఆయన నన్ను ఎందుకు లెక్కజేస్తారు అనుకున్నాను. అనుకున్న క్షణమే ఆర్.టి.సి. క్రాస్‌రోడ్స్ కళాజ్యోతి ఆఫీసుకు వెళ్ళటం, **మిసిమి** ఎడిటర్ అశ్వినిగారిని కలవటం, *రంగప్రవేశం* అన్న వ్యాసం రాసిన మహానీయుడు ఎవరు? వారు ఎక్కడ ఉంటారు? మనం కలవడానికి ఏమైనా వీలవుతుందా? అన్నదే తడవుగా ఆయన – "మీకేమైనా పిచ్చా, ఆయన ఎవరనుకుంటున్నారు.. మనకు అందే అంత దగ్గరలో లేరు. నేను ఆయనతో రాయించడానికి రెండు సంవత్సరాలు పట్టింది. ఇప్పుడే కలవడానికి ఎలా వీలవుతుంది?" అని అన్నారు.

"సార్! ఆయనది ఈ ఊరు కాదా?" అని అడిగాను అందుకు మరల ప్రశ్నార్థకంగా ఒక చూపు చూసి ఆయన పనిలో ఆయన పడిపోయారు. కాసేపు ఆగిన తర్వాత మళ్ళీ "సార్ ఏం చెప్పకపోతిరెందుకు?" అని అన్నాను.

దానికి ఆయన, "ఆయన ఇక్కడ ఉండరయ్యా.." అన్నారు.

నేను "ఆయన ఉండేది భూమి మీదనే కదా!" అన్నాను.

"ఎందుకు కలవాలనుకుంటున్నారు?" అని అశ్వినిగారు అడిగారు.

ఆయన అమెరికాలో అనక ముందే "నేను టికెట్లు తీస్తాను – అమెరికాకు వెళ్లి కలుద్దామా?" అన్నాను.

"మీరు ఏం చేస్తారు? ఎందుకు మీకు? ఎంత ఖర్చు వస్తుందో తెలుసా మీకు? అని పరిహాసాన్ని ప్రకటించారు.

"నాకెందుకన్నది మీకెందుకు తండ్రీ? ఆ మహనీయుని కలిశాక చెబుతాను కదా!" అని నేను అనగానే ఆయనలో కూడా ఒక చిన్న ఆలోచన మొలకెత్తింది ఎందుకు పట్టుబడుతున్నాడని. చేతిలో ఫోన్ అందుకుని, ఒక నెంబర్ కలిపి, "పప్పువారికి నమస్కారాలు" అన్న వాక్యం పూర్తి కాకముందే నా అంతరాంతరాల్లో అమ్మ ఆశీర్వచనం నన్ను ఆవహించడం మొదలైంది. ఆయన కాసేపు మాట్లాడి, "అయ్యా మీకు

తెలియని ఒక అజ్ఞాత వ్యక్తి మీతో మాట్లాడాలని, మిమ్మల్ని కలవాలని పట్టుబడుతున్నాడు" అని అన్నారు.

"ఎవరు అతను?" అన్న గంభీర వాక్యం అవతలి నుండి. నాలో తెలియని ఆందోళన మళ్ళీ మొదలైంది. అంతలో అశ్వినివారు నా చేతికి ఫోన్ అందించి, "మాట్లాడవయ్యా, మాట్లాడు.." అని అన్నారు.

నేను, "శరణాగతి ప్రభు శరణాగతి. ***మిసిమి*** లో మీరు రాసిన *రంగప్రవేశం* అనే వ్యాసం మహా అద్భుతం సార్!" అన్న తక్షణమే ఆయన "ఎవరు నాయనా నీవు? ఏం చేస్తుంటావు? నన్ను కలవాలన్న నీ తలంపుకు కారణమేమిటి సెలవిస్తావా?" అన్న తరుణాన నా తనువు బరువెక్కింది. నా కోరిక నెరవేరునో, నెరవేరక పోవునో అన్న బరువు అధికమవుతూనే ఉంది. ఆ మహనీయుడు నా నెత్తిన పాలుపోసినంత ఉత్తమమైన వాక్యమేమిటంటే "సెప్టెంబర్ 4న హైదరాబాద్ వస్తున్నాను నాయనా. అప్పుడు మీరు అశ్వనివారితో వచ్చి కలవండి" అని అన్నారు.

సెప్టెంబర్ 4, సాయంత్రం తెలంగాణ టూరిజం హోటల్, పీపుల్స్ ప్లాజా అశ్వినివారు, నేను ఆచార్య పప్పు వేణుగోపాలరావు గారిని కలుసుకున్నాం. చెయ్యెత్తితే అందని రూపం, అందులో తనువంతా స్వర్ణము దాపిన చందం. మౌనమే శరణ్యమన్నట్లుగా వినమ్ర నమస్కారాలు చేసి, ఆ ఇద్దర్నీ చూస్తూ ఒక ప్రక్కన కూర్చున్నాను. అశ్వనివారు ఆచార్యులకు నా పరిచయం చేసిన విధానం – "ఇతను ఆధునిక పోతన, ఇతని పేరు అందెశ్రీ" అని చెప్పారు. నా మనసు ప్రశ్నార్థకంగా వారి స్పందన ఏమిటని తదేకంగా చూస్తూ ఉండిపోయింది. అణువంతైనా స్పందన కనిపించలేదు నాకు. శరాఘాతమే! ఆచార్యులు భాగవతంలోని కథలను పుంఖానుపుంఖాలుగా పద్యాలను గుక్కతిప్పుకోకుండా చెబుతూ రెండు గంటలు గడిచిపోయాక "ఏమండీ అశ్వినివారు కాఫీ ఏమైనా తాగుతారా?" అన్నంతలోనే కాఫీ రావటం, తాగటం ఓ పదిహేను నిమిషాలు గడిచిన తరువాత, ఏమౌతుందో అన్న సందేహం ఇందుకేనా వీళ్ళు నన్ను రమ్మన్నదీ

అనే తలంపు నాలో కలిగింది. అశ్విని వారు కూడా మౌనమే. ఇంక నేను చేసేదేముంది? మౌనం తప్ప.

అప్పుడు ఆచార్యుల వారు చిన్న వాత్సల్యంతో "నీ పేరేమిటి నాయనా!" అని అడిగారు. కనిపించని అసహనంతో "నా పేరు ఎందుకు స్వామి ఇప్పుడు?" అని ఊరుకున్నాను.

"కవిత్వం రాస్తారటగా అశ్విని వారు చెప్పారు. మీ కవిత్వం చెప్పండి" అని మళ్ళీ ఆచార్యుల వారు నా నెత్తిమీద పిడుగు పడ్డట్లుగా "నా కంఠతా ఎన్ని పద్యాలు చెప్పగలనో తెలుసా మీకు?" అని అన్నారు.

"నాకేమి ఎరుక స్వామీ.. చెప్పండి" అని నేను అన్నాను.

"అవధానులకు, సహస్రావధానులకు, మహా అవధానులకు – ఒక్కొక్కరికి ఎన్ని పద్యాలు వస్తాయో నాకు తెలియనిది కాదు. నేను ఒక లక్ష పద్యాలను పుక్కిట పట్టుకున్నాను" అన్నారు. ఆ మాట విన్నాక నేను అచేతనావస్థలోకి విసిరివేయబడ్డాను.

"లేదు లేదు మీరు రాసిన పద్యమో, పాటో, కవితో – ఏదో ఒకటి చెప్పవలసిందే" అని అన్నారు. నేను తప్పించుకోవడానికి "నా కంఠం బాగాలేదు గురువుగారు" అని అన్నాను.

అన్నదే తడవుగా గురువు గారు "మీకు ఇప్పుడు ఇక్కడ ఏమైనా ఆడిషన్ జరుగుతుందా?" అని అచ్చెరువు కలిగించే హెచ్చరిక చేశారు. చేసేది లేక చేతులు కట్టుకొని, మనస్సులో అమ్మకు దండం పెట్టుకుని, రెండు పద్యాలు చదివాను. 'అరే! ఈ పద్యాలు ఎవరు రాసినవి, బాగున్నవే..' అన్న అచ్చెరువు, ఆశీర్వచనం కూడా. కాస్త ఊపిరి పీల్చుకుని, 'అమ్మ పైన ఆన' అన్న నా కవిత్వాన్ని వినిపిస్తూ వారిద్దరినీ గమనిస్తూనే ఉన్నాను. కాళ్ళు చాపి కూర్చున్నవారు చిన్నగా కాళ్ల మలుచుకోవడం సింహం గుహ నుండి బయటకు వచ్చి జూలు విదిలించినట్లుగా నన్ను తదేకంగా చూస్తూ తన నోరారా "నాన్నా" అన్న పిలుపుతో "నిన్ను నేను తమ్ముడూ అని పిలవచ్చునా?" అని అడగడం నన్ను ఆచార్యుని రూపంలో

వాక్కులమ్మ వాత్సల్యం అపారంగా కురిపిస్తుందా అన్నట్లు అనిపించింది. నా శిరస్సు తన పాదాల మీద వాల్చి, "శరణాగతి ప్రభు! శరణాగతి.. ఈ జన్మకు ఇది అమ్మ ఆశీర్వచనంగా స్వీకరిస్తున్నాను" అని అన్నాను. అప్పుడు అశ్విని వారి ముఖం కూడా అరవిందంలా విరబూసింది.

"మిమ్మల్ని కలవాలనుకున్నది ఎందుకో అశ్విని వారికి తెలియదు. నేను ఆ మహనీయుని కలిశాక చెప్తాను అన్నాను, అన్నగా మిమ్మల్ని ఒక వరమడుగుతాను. ఈ తమ్ముణ్ణి ఆశీర్వదిస్తారు కదా'' అని అనిర్వచనీయమైన అర్థింపు.

క్షణ కాలం ఆలోచించకుండా "తప్పకుండా తమ్ముడు" అన్నారు. అప్పుడు నేను "ఆదిశంకరుల *సౌందర్యలహరి* ని మీరు అటు పండితులకు ఇటు నాలాంటి పామరులకు సైతం అర్థమయ్యే మన అమ్మ భాషలో రాస్తే నేను పుస్తకంగా వేస్తాను" అని అన్నాను. దానికి ఆయన "ఇది తమ్ముడు అర్థించిన మాటలా లేదు నాయనా అమ్మ ఆనలా అనిపిస్తుంది తథాస్థు!" అన్నారు. అప్పుడు నా మనసు కల్లు తాగిన కోతిలా, ఒక ఉన్మాదపు ఉద్రేకత తనువంతా ఆవహించి హనుమంతుని అంశ నా అంతరాంతరాల్లో మొలకెత్తడం మొదలైంది.

అప్పుడు ఆచార్యులవారు "అన్న వరమివ్వడం అయిపోయింది. తమ్ముడిని నేను వరమడగనా?" అన్నారు. "అంతటి అదృష్టమా నాకు!" అని అన్నాను నేను.

"నిన్ను చూసినప్పుడు అనామకుడవనే అనుకున్నాను నాయనా! అమ్మ నీ నాలుకపై కొలువుదీరి ఉన్నది కదా!" నా ఒళ్ళు నిలువెల్లా భయంతో కంపించిపోయింది. అప్పుడు ఆచార్యుల వారు చల్లని వాత్సల్యంతో "ఈ కవిత్వంలో నీవు ఎక్కడ సిద్ధి పొందినావో ఆ అమ్మ దగ్గరకు అన్నను తీసుకెళ్తావా? నేను మళ్ళీ అక్టోబర్ 15 నాడు ఊర్లోకి వస్తాను. 16న ఏవో మీటింగులున్నవి. అక్టోబర్ 17 నాడు మనము అమ్మను దర్శించుకోవడానికి వెళదాము" అన్నారు. నేను 'శిరసా నమామి' అని

మళ్లీ ఒక అరగంట మాత్రమే సమయమిచ్చిన ఆచార్యులతో ఆ రోజు రాత్రి మూడు గంటల వరకూ తన కవితా ప్రతిభా పాటవాలలో అశ్విని వారు, నేను పరవశించిపోయాము.

అక్టోబర్ 17న ఉదయం 6 గంటలకు జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుండి నగరపు ఉత్తరాభిముఖంగా బాసరకు మా ప్రయాణం. రెండు – రెండున్నర గంటల్లో ఇందూరుకు (నిజామాబాద్) చేరుకున్నాం. అక్కడ మా ఇందూరు నంది... సాంబన్నను కలుపుకుని, మా ఫిలాసఫీ శంకర్‌ను తీసుకొని నలుగురం బాసర చేరుకున్నాం. అద్భుతమైన దర్శనం. అమ్మ గుడిలో, అక్షర ఒడిలో తరించిపోయాం. 30 రోజుల్లో నూరు శ్లోకాలతో తాత్పర్యం నిక్షిప్తం చేసిన ఆ పెన్‌డ్రైవ్‌ను అమ్మ పాదాల దగ్గర సమర్పించి, అక్షరాభ్యాసాలు చేసే మండపంలో కూర్చున్నాం.

'సిరికింజెప్పడు' అన్న పోతనామాత్యుని పద్యం స్ఫురించేలా ఒక అద్భుత ఆవిష్కరణకు శ్రీకారం. మాకు ఏం జరగబోతోందన్న సంభ్రమాశ్చర్యాలు. అంతలో అగ్రజుడు దిగ్గున లేచి, బయటకు వెళ్లి ఒక పలక, బలపం కొనుక్కొని వచ్చారు. "అమ్మ శ్లోకాలకు అర్థం మాత్రం రాశాను కానీ, వాటికి తాత్పర్యం పరిపూర్ణం కావాలంటే అమ్మ ఆశీర్వచనంతో పాటు నా ఈ 72వ సంవత్సరంలో మళ్లీ మా తమ్ముని చేతుల మీదగా అమ్మ ఒడిలో అక్షరాభ్యాసం చేసుకోబోతున్నాను" అన్న ఆయన మాట వినినంతనే అది అదృష్టం అనాలో! నా అజ్ఞానానికి పరీక్ష అనాలో! శ్రీ వ్యాసపురవాసిని బాసరమ్మ ఆశీర్వచనాలు అనాలో అర్థం కాలేకపోయింది.

అప్పుడు నాలో ఒక ఆలోచన. అమ్మ ఆలయాన్ని దర్శించడం అయింది. అక్షరాలకు గుడి కట్టాలన్న నా సంకల్పం సిద్ధించి నూరు శ్లోకాల పొత్తముగా, నూరు లోకాలకు విత్తనముగా మీ చేతికందినది ఈ *శ్రీ ఆదిశంకరుల సౌందర్యలహరి.*

శార్వరి ఉగాది
3–3–2020

– *అందెశ్రీ*

ప్రథమ ముద్రణ తొలి పలుకు...

సుమాంజలి

30 ఏళ్ళ క్రిందట నాచే 'భజగోవింద శ్లోకాల'కు వ్యాఖ్యానం వ్రాయించారు. శ్రీ రమణయ్య రాజాగారు. ఆదిశంకరుల జీవిత చరిత్ర వ్రాయించారు శ్రీ నోరి రామకృష్ణయ్యగారు. ముందుగా వారిద్దరికి నమస్కారం. నూనూగు మీసాల నూత్న యౌవనంలో శ్రీవిద్యను గురించి చెప్పారు స్వామి ప్రణవానందులవారు. నామిత్రుడు వడుగూరి సూర్యనారాయణమూర్తి తల్లిగారు సీతమ్మగారు కాన్సర్‌తో రేపోమాపో కాలం చేస్తారనగా పంచదశి ఉపదేశించారు. సద్గురు శ్రీ శివానందమూర్తి గారు 'శ్రీవిద్యా రహస్యాల'ను ఏకాంతంలో బోధించారు. తల్లిదండ్రులు విద్యగరపేరు. నా సహధర్మచారిణి జయ పెళ్లికి ముందే మార్గం నిర్దేశించింది.

ఈ నేపథ్యంలో శ్రీచక్రం మీద ఆంగ్లంలో సైన్స్ అఫ్ శ్రీ చక్ర అనే ఒక గ్రంథం వ్రాశాను. మిత్రులు ఖరిడహాల్ వేంకటరావుగారు దానిని తెనిగించారు. తరువాత కొన్ని సంగీతానికి, నృత్యానికి సంబంధించిన గ్రంథాలు ఆంగ్ల భాషలో రచించాను. మళ్ళీ నన్ను తెలుగులో వ్రాయమని అడిగినవారు మిత్రులు ఆశ్వనికుమార్‌గారు. **మిసిమి** మాసపత్రికలో ధారావాహికంగా నృత్యానికి సంబంధించిన వ్యాసాలు వ్రాస్తూ ఉండగా, అమ్మవారి కాలి అందెల సవ్వడి వినిపించింది. ఆ సవ్వడి పేరు అందెశ్రీ. పదునైన కలము, గళము కలిగిన తెలంగాణా కవి. అశ్వనిగారు, అందెశ్రీగారు మాటలలో "మీరు *సౌందర్యలహరి* కి వ్యాఖ్యానం వ్రాస్తే బాగుంటుంది" అన్నారు. అదేదో అమ్మవారే చెప్పించింది అనిపించింది. నెలలో *సౌందర్యలహరి* కి తాత్పర్యం వ్రాసి అందెశ్రీతో కలిసి బాసర వెళ్లి సరస్వతి పాదల దగ్గిరుంచి ఆమె ఆమోదం పొందాను. వ్యాఖ్య

వ్రాయడానికి అర్హత కోసం ఆమె సన్నిధిలో 72వ ఏట మరొకసారి అక్షరాభ్యాసం చేసుకున్నాను. తోడబుట్టినవాడు అంటే అమ్మకు ఇద్దరమూ బిడ్డలమే.. ఆ అమ్మ సమక్షంలో నాకు దగ్గిరుండి అక్షరాభ్యాసం చేయించిననవాడు అందెశ్రీ. ఆ ప్రక్రియ ఘనత మా అందెశ్రీది.

ఒక పని చేసినప్పుడు అమ్మవారు మార్గదర్శనం తానే చేస్తుంది. అది గ్రహించాలి. ఇందులో నా కుటుంబంలో అందరూ పాత్రవహించాలని అమ్మవారి సంకల్పం. నా పెద్ద కుమారుడు భరద్వాజుడు అమెరికాలో ఉంటాడు, నేను *సౌందర్యలహరి* ప్రారంభించిన రోజునే వచ్చాడు, వారం రోజులున్నాడు. తరువాత నేను, నా శ్రీమతి మా చిన్నబ్బాయి పతంజలి ఇంటికి వెళ్లాం, మలేసియా. అక్కడ తాత్పర్యం వ్రాయడం పూర్తయింది. అప్పుడు అందెశ్రీతో బాసర, అక్షరాభ్యాసం. అదొక విశిష్టమైన అనుభూతి. ఒక తమ్ముడు లభించాడు.

వ్యాఖ్యానం వ్రాయడం అంత సులభం కాదు. సులభమైన శైలిలో వ్రాద్దామని నా ప్రతిజ్ఞ, అశ్వినీ, అందెశ్రీల కోరిక. సంస్కృతంలో *సౌందర్యలహరి* కి 36 వ్యాఖ్యానాలు ఉన్నాయి, తెలుగులో అసంఖ్యాకం. ఆంగ్లంలో అనేకం ఉన్నాయి. వాళ్ళు చెప్పనిది నేనేం చెప్పగలను? అదే చెబితే మళ్ళీ ఇంకొక వ్యాఖ్యానం ఎందుకు? విశ్వనాథ సత్యనారాయణగారు రామాయణ కల్పవృక్షం వ్రాస్తూ ఈ ప్రశ్నకి సమాధానం చెప్పారు.

మఱల నిదేల రామాయణం బన్నచో
నీ ప్రపంచక మెల్ల నెల్లవేళఁ
దినుచున్న యన్నమే దినుచున్నదిన్నాళ్ళు
తన రుచి బ్రతుకులు తనవి గాన
చేసిన సంసారమే సేయుచున్నది
తనదైన యనుభూతి తనది గాన
తలచిన రామునే తలచెద నేనును
నా భక్తి రచనలు నావి గాన ....

అయితే ఏదో చెప్పే విధానంలో నలుగురుకి బోధపడాలని, వీలైనంత సులభ శైలిలో చెప్పే ప్రయత్నం. అమ్మవారి పరిపూర్ణమైన కటాక్షం వలన ఈ పుస్తకం ఈ రూపు దాల్చుకుంది. నేను సంస్కృతంలో ఉన్న 36 వ్యాఖ్యానాలు కూలంకషంగా చదివాను. కేంద్ర ప్రభుత్వం వారు 1976లో కొన్ని ముఖ్యమైన సంస్కృత వ్యాఖ్యానాలతో ఎ. కుప్పుస్వామి గారి సంపాదకత్వంలో రెండు సంపుటాల బృహత్ గ్రథం ప్రచురించారు. ఆంగ్లంలో 1948లో అడయార్ థియసోఫికాల్ సొసైటీ వారు పండిట్ సుబ్రహ్మణ్య శాస్త్రి, శ్రీనివాస అయ్యంగార్ అనువాదకులు, వ్యాఖ్యాతలుగా ముద్రించిన *సౌందర్యలహరి* వ్యాఖ్యానం చూశాను. తెలుగులో జి.ఎల్.ఎన్. శాస్త్రిగారు 1999లో ప్రచురించిన వ్యాఖ్య చూశాను. మైసూరు ప్రాచ్య లిఖిత పుస్తక భండారం వారు ప్రచురించిన సంస్కృత, కన్నడ వ్యాఖ్యలు చదివాను. వీరందరి మేధస్సు, తపస్సు నా వ్యాఖ్యానానికి ప్రోత్సాహాన్నిచ్చాయి. కాని నాకు వాక్కునిచ్చినది అమ్మవారే. ఇందులో ఒక్క అక్షరం నాది కాదు. ఆమె చెప్పినదే నేను వ్రాశాను.

దీనికి ముందుమాట ఎవరు వ్రాయాలి? ఈ ప్రశ్నకి అమ్మవారే మా అందెశ్రీకి సమాధానం తెలియజేసింది. అవధూత దత్తపీఠం విద్యాధికారి, వైదికవిద్యా పారంగతులు, వివిదాధ్వరనిర్మల ధర్మకర్మ దీక్షాపరతంత్రులు, శ్రీ కుప్పా వేంకటకృష్ణమూర్తి గారు. వారు దీనికి 'కాశీబుగ్గ' అనేపేర మున్నుడి వ్రాసి నా రచనను సుసంపన్నం చేశారు. రమ్యమైన విశ్లేషణ, సునిశితమైన విద్వత్తు వారి సొమ్ము. వారికి నమస్సుమాంజలులు.

అశ్వనిగారు ***మిసిమి*** సంపాదకులు. ఈ క్రతువులో భాగస్వాములు. వారు పులకించిన మనసుతో పరవశంతో వారి తొలిపలుకు పలికారు. వారికి ప్రేమపూర్వక ధన్యవాదాలు.

ఇంక నా సోదరుడు అందెశ్రీ. చెమర్చిన కనులతో, ఆర్ద్రమైన మనసుతో, తనదైన సహజమైన భావోద్వేగంతో, నా మీద ప్రేమతో,

అమ్మవారి మీద భక్తితో ఈ క్రతువు పరిపూర్ణం చేశానన్న పులకింతతో తాదాత్మ్యమైన మనసుతో వ్రాసిన 'అమ్మ అన్న మాట'. దానికి వెలకట్టలేను. ఇటువంటి సోదరుడిని ఇచ్చిన అమ్మకు నమస్కరించడం తప్ప.

ఈ గ్రంథ రచనకు ముద్రణకు కారకులైన వీరందరికీ అమ్మవారి కటాక్షం తానై లభిస్తుంది.

శార్వరి ఉగాది
మార్చి 25, 2020
చెన్నై.

భవదీయుడు
పప్పు వేణుగోపాలరావు

అమ్మవారి వైభవం –
అమృతలహరి

సదాశివ సమారంభాం - శంకరాచార్య మధ్యమాం
అస్మదాచార్య పర్యంతాం - వందే గురుపరంపరాం

సౌందర్యలహరి అమ్మవారి పై ఆదిశంకరులు వ్రాసిన వంద శ్లోకాల గ్రంథం. ఆది శంకరులు సాక్షాత్తు శంకరుల అవతారం. భూమిపై 32 సంవత్సరములు జీవించి, నాస్తిక వాదులను ఓడించి, ఆస్తికతను, అద్వైతాన్ని పునఃస్థాపన చేసిన అవతార పురుషులు. మన సంప్రదాయంలో ఇద్దరినే జగద్గురువులు అంటాం. ఒకరు శ్రీకృష్ణ పరమాత్మ, ఇంకొకరు ఆదిశంకరులు. ఎందుకు?

శ్రీకృష్ణుడు స్వయముగా భగవద్గీత బోధించాడు. అది ఉపనిషత్తుల సారాంశము, బ్రహ్మ విద్య, యోగ శాస్త్రము అని *భగవద్గీత* లో ప్రతి అధ్యాయం చివర చెప్పబడింది, అందుకే మనం 'కృష్ణం వందే జగద్గురుమ్' అంటాం.

ఇక ఆదిశంకరులు.

కీ.శ. 788–820 మధ్యకాలంలో జీవించారని కొందరి అభిప్రాయం. కాని వారు దేశంలో స్థాపించిన నాలుగు శంకర మఠాల (పూరి, శృంగేరి, బదరి, ద్వారక) గురు పరంపర చూస్తే ఆయన కాలం చాలా ముందుకు పోతుంది. ఆయా మఠాల గురు పరంపర ప్రకారం చూస్తే ఆదిశంకరులు క్రీ.పూ. 509 – 477 మధ్య జీవించి ఉండాలి. కాలాతీతమైన వ్యక్తుల కాలాన్ని గురించిన చర్చ అనవసరం. కేరళలో పూర్ణానది ఒడ్డున ఉన్న కాలడి వారి జన్మ స్థలం. జీవించిన 32 సంవత్సరాల కాలంలో కాశ్మీరం నుంచి కన్యాకుమారి వరకు కనీసం మూడుసార్లు ప్రయాణం చేశారని చారిత్రికుల వక్కణ. మన సంస్కృతిలో ఉపనిషత్తులను, బ్రహ్మ సూత్రాలను,

భగవద్గీత ను, ఈ మూడింటిని కలిపి *ప్రస్థాన త్రయం* అంటారు. వీటికి భాష్యం శంకరులు వ్రాశారు. ఆయన అనేక గ్రంథాలు, స్తోత్రాలు వ్రాశారు. వాటిలో ఒకటి *సౌందర్యలహరి*. దీనిని వారు శ్రీనగర్ (కాశ్మీరు)లో ఉన్న శివాలయంలో వ్రాశారని చెప్తారు.

ఆది శంకరుల సాహిత్యాన్ని సాహిత్యంగా చూస్తే ఆయన సంస్కృత సారస్వతలోకంలో ఏ మహాకవికి తీసిపోని ఒక అనన్యమైన కవి. శివుని ఢమరుకంలోంచి వచ్చిన 14 శబ్దాలే ఈనాడు సంస్కృత భాషలో అక్షరాలు. శివుని అవతారమైన శంకరులకు భాష మీద అధికారం ఉండడంలో ఆశ్చర్యమేముంది!

ఆయన ఒక్కొక్క గ్రంథానికి ఒక్కొక్క ఛందస్సు, భావాన్నిబట్టి ఎంచుకున్నారు. ఉదాహరణకి *గణేశ పంచరత్నం*, *లక్ష్మీనృసింహ కరావలంబ స్తోత్రం*, *భజగోవిందం*లో ఛందస్సు వేరు వేరుగా ఉంటుంది. ఈ సౌందర్యలహరికి వారు ఎంచుకున్న ఛందస్సు శిఖరిణి. పాదానికి 17 అక్షరాలుండే ఈ శ్లోకంలో తెలుగులో వ్రాస్తే 12వ అక్షరం యతి స్థానం. ప్రాస లేదు. శిఖరిణి లక్షణాలు: య, మ, న, స, భ, వ గణాలు, 12వ అక్షరం యతి. శంకరుల రచనలలో *సౌందర్యలహరి* ఒక శిఖరంవంటిది. అమ్మవారు అందరు దేవతలలో శిఖరస్థానంలో ఉన్నది. అమ్మవారి మంత్రానికి 16 అక్షరాలు. దానికి మించి ఒక అక్షరం ఎక్కువ ఉన్న శిఖరిణి వృత్తం ఎంచుకోవడం వారి కవిత్వ పటిమకు తార్కాణం.

సంప్రదాయంగా ఈ వంద శ్లోకాలలో మొదటి 41 ఒక భాగం, రెండవ 59 ఒక భాగం. మొదటి భాగంలో అమ్మవారి శక్తి స్వరూపం, శ్రీ విద్య, శ్రీ చక్రం, యంత్ర, తంత్రం మొదలైన విషయాలుంటాయి. రెండవ భాగంలో ఆమె సౌందర్యాన్ని వర్ణించారు. మొదటి భాగం ఆనందలహరి, రెండవది *సౌందర్యలహరి*. మొదటి భాగం అంతర్ముఖంగా చేసే పూజ, రెండవది బహిర్ముఖంగా చేసుకొనేది, ఇంకోలా చెప్పాలంటే మొదటి భాగం రూపం లేని పూజ, మనసులో చేసుకొనేది, రెండోది

అమ్మవారి స్వరూప సౌందర్య వర్ణన. మామూలుగా చేసుకొనే విగ్రహ పూజ.

హిందూ మతంలో మంత్రం, తంత్రం, యంత్రం అనే మూడు మాటలు అనాదిగా వ్యవహారంలో ఉన్నాయి. అందులో మంత్రం చాలా గొప్పది.

మననాత్ త్రాయత ఇతి మంత్రః

మంత్రం అంటే మననం చేస్తే త్ర అంటే రక్షించేది. కొన్ని బీజాక్షరాలతో కూడి ఉంటుంది. మనకు తెలిసిన మంత్రాలలో ఒకే అక్షరం ఉన్న మంత్రం – ఓం. యంత్రం అంటే శక్తి స్వరూపం. ఇందులో సాధారణంగా వృత్తం, చతురస్రం, త్రికోణం, పద్మ దళాలు ఉంటాయి. ఈ సంకేతాల ద్వారా ఆరాధన చెయ్యడం విగ్రహారాధనకన్న శక్తివంతమైన మార్గం. ఈ యంత్రాన్ని మంత్రాన్ని కలిపి పూజ చేసే విధానం తంత్రం. అమ్మవారిని పూజించే పద్ధతిలో ఉపయోగించే యంత్రం శ్రీ చక్రం, తంత్రం శ్రీ విద్య. అమ్మవారి పూజా విధానంలో ఉపయోగించే మంత్రాలు మూడు. మొదటిది మూడక్షరములుగలది, రెండవది 15 అక్షరములుగలది, మూడవది 16 అక్షరములుగలది. *సౌందర్యలహరి* మొదటిభాగంలో ఉన్న 41 శ్లోకాలలో ఈ రహస్యాలు నిక్షిప్తమై ఉన్నాయి.

సౌందర్యలహరి అమ్మవారి గురుంచి వ్రాయబడిన గ్రంథాలలో ఒక ఉత్కృష్టమైన గ్రంథం. దీనికి సంస్కృత భాషలో 36 వ్యాఖ్యలున్నాయి. శంకరులవారే మొదటి శ్లోకంలో చెప్పినట్టు దీనిని చదవడమో, వినడమో వ్యాఖ్యానం వ్రాయడమో దేనికైనా పూర్వ పుణ్యం ఉండాలి. ఇదేదో తంత్రశాస్త్రమో ఏమో, శ్రీ చక్రం పూజించకుండా ఇంట్లో పెట్టుకుంటే అపరాధమో ఏమో, ఇలాంటి సందేహాలు చాలామందికి ఉన్నాయి. దీనికి కారణం కేవలం అపోహ, అజ్ఞానం, అవిద్య. అమ్మ అమ్మే కదా. సంస్కృతంలో ఓ మాట చెప్తారు.

కుపుత్రో జాయతే క్వచిదపి కుమాతా న భవతి – అని. ఉంటే చెడు పిల్లలుంటారేమోగాని చెడు తల్లి ఉండదు కదా!

అందుకని అనవసరమైన సందేహాలు పెట్టుకోకుండా అమ్మని అమ్మగా పూజించమని చెప్పే గ్రంథం ఇది. ఊరికినే తాత్పర్యం మాత్రమే వ్రాస్తే చాలదని కొంత వివరణ వ్రాస్తున్నాను. భక్తితో, శ్రద్ధతో, వినయంగా అమ్మని మనసులో పెట్టుకుని చదవమని చదువరులను ఈ సౌందర్య – ఆనందలహరిలో మునకలిడమని ఆహ్వానిస్తున్నాను. ఈ వ్యాఖ్యానం తేలికగా కొన్ని విషయాలు అర్థం చేసుకోడానికి ఉపయోగపడాలని ఆశయం. కాళిదాసుకు వ్యాఖ్యానం వ్రాసిన మల్లినాథ సూరి తెలుగు వాడు. ఆయన అన్నట్టు 'నామూలం లిఖ్యతే కించిత్ నాఽనపేక్షితముచ్యతే 'ఉన్నదేదీ వదిలిపెట్టను, లేనిదేదీ చెప్పను. వీలైనంతవరకు మరీ గహనమైన విషయాల జోలికి పోకుండా చేసే ఈ వ్యాఖ్య పేరు అమృతలహరి. *సౌందర్యలహరి* లో 60–63 శ్లోకాలలో ఈ పదం ప్రస్తావించారు శంకరులు. అందుకే ఈ వ్యాఖ్యకు ఈ పేరు. కేవలం నా గురువులు, నా తల్లిదండ్రుల ఆశీస్సుల బలం, అమ్మవారిచ్చిన శ్రీవిద్య ఉపాసన ఈ వ్యాఖ్య వ్రాయడానికి నా అర్హతలు.

ఇందులో గుణములుంటే అవి, ఆదిశంకరుల రచన, అమ్మవారి కరుణ. దొసగులుంటే అది నా అజ్ఞానం.

– *పప్పు వేణుగోపాల రావు*

సౌందర్యలహరి

శివః శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం
న చేదేవం దేవో న ఖలు కుశలః స్పందితుమపి ।
అతస్త్వామ్ ఆరాధ్యాం హరి-హర-విరించాదిభి రపి
ప్రణంతుం స్తోతుం వా కథ-మకృత పుణ్యః ప్రభవతి ॥ 1 ॥

తాత్పర్యం:

అమ్మా! సాక్షాత్తు పరమశివుడు నీతో కలిసినప్పుడే సృష్టి చేయడానికి సమర్థుడు. అలా కాకపోతే ఆయన చలించడానికి కూడా అసమర్థుడు. హరిహర బ్రహ్మాదులకు కూడా అందని నిన్ను స్తోత్రం చెయ్యడానికో నమస్కరించడానికో పూర్వపుణ్యం లేని వారికి ఎలా సాధ్యమౌతుంది?

అమృతలహరి వ్యాఖ్యానం:

సంస్కృత సాహిత్యంలో ఒక సంప్రదాయం ఉంది. అదేమిటంటే గ్రంథంలో చెప్పబోయే విషయాన్ని మొదటి శ్లోకంలోనే సూచించడం. ఇది ఒక అద్భుతమైన ప్రక్రియ. ఆదిశంకరులు ఒక మహాకవి, ఆయన ఆచార్యులు కాకుండా, అద్వైత మార్గ ప్రవర్తకులు కాకుండా, ఒక కవి అయి ఉండి ఉంటే వాల్మీకి, కాళిదాసు, భవభూతి, భారవిలా ఏంతో గొప్ప కవిగా కీర్తిగాంచి ఉండేవారు. కాని వారి అవతార గమ్యం వేరు. అయినా మనం అక్కడక్కడ వారి కవిత్వంలోని రమణీయతనూ ఆస్వాదించాలి. ఈ మొదటి శ్లోకంలో వారు అమ్మవారి గొప్పతనాన్ని అతి రమణీయంగా వర్ణిస్తూనే మిగిలిన గ్రంథంలో అంతా చెప్పబోయే శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి మహాత్మ్యాన్ని ఇందులో సూచించారు. ఎంత గొప్పతనం ఈ మొదటి శ్లోకంలోనే చెప్పారంటే సంస్కృతంలో వ్యాఖ్యానం వ్రాసిన కామేశ్వర సూరి అనే మహా విద్వాంసుడు ఈ శ్లోకంలో శంకరులవారు శివశక్తుల 14 వివిధ విషయాలను సూచించారని చెప్పారు.

శివుడు అనే మాటకు మంగళప్రదమైనవాడు, అవిద్యను తొలగించువాడు, జాడ్యమును పోగొట్టువాడు మొదలైన అనేక అర్థాలున్నాయి. శుభమును కలిగించువాడు శివుడు. అమ్మవారు శక్తిస్వరూపిణి. శక్తితో కలిసిన శివుడే సృష్టికి కారణభూతుడు. అమ్మ లేనిదే అయ్య సృష్టించడమే కాదు ఏ చలనమూ లేనివాడు కూడా. శివునికి స్థాణువు అంటే చలనము లేనివాడనే పేరొకటి ఉంది. అమ్మవారి కరుణ లేనిదే హరి హర బ్రహ్మాదులు కూడా వారి వారి పనులు చేయలేరు అని మొదటి శ్లోకంలో చెప్పడం వల్ల గ్రంథంలో చెప్పబోయే అమ్మవారి ఉత్కృష్టతను, ఉన్నతిని ఇందులో సూచించారు. ఈ శ్లోకంలో త్రిమూర్తులను మాత్రమే చెప్పకుండా శంకరులవారు హరి హర విరించాది అని ఆది అనడం వల్ల మిగిలిన అందరు దేవతలను చేర్చి అందరికీ శక్తిస్వరూపిణి అయిన అమ్మవారి వలననే వారి వారి పనులు చేసుకొనే శక్తి కలుగుతుంది అని సూచించారు. ఇదంతా చెప్పాక అంతటి వారికే అందని నిన్ను స్తోత్రం చెయ్యడానికో నమస్కారం చెయ్యడానికో పుణ్యం చెయ్యని వాళ్లకి ఆ శక్తి ఎలా కలుగుతుంది, అమ్మా! నీ శక్తి నీ కరుణ ఉంటేగాని ఆ శక్తి కలుగదు అందువలన జగజ్జననీ! ఆ శక్తిని కలిగించు, నాకు ప్రసాదించు అని శంకరులు ఇందులో అమ్మవారిని ప్రార్థిస్తున్నారు.

తనీయాంసుం పాంసుం తవ చరణ పంకేరుహ-భవం
విరించిః సంచిన్వన్ విరచయతి లోకా-నవికలమ్ ।
వహత్యేనం శౌరిః కథమపి సహస్రేణ శిరసాం
హరః సంక్షుద్-యైనం భజతి భసితోద్ధూళనవిధిమ్ ॥ 2 ॥

తాత్పర్యం:

అమ్మా! నీ పాదకమలముల ధూళికణములను పొంది బ్రహ్మ నిరాఘాటముగా సృష్టి చేస్తున్నాడు. అలాగే విష్ణువు ఆదిశేషువుగా తన వెయ్యి శిరస్సులతో భూమిని ఏదో విధంగా మోస్తున్నాడు. శివుడు ఈ ధూళినే చక్కగా విభూతిగా ధరిస్తున్నాడు.

వ్యాఖ్యానం:

శంకరులవారు రెండవ శ్లోకంలో అమ్మవారి పాద ధూళి రేణువులను వాటి వైభవాన్ని వర్ణిస్తున్నారు. పైకి ఇంత సరళంగా కనిపించే ఈ శ్లోకంలో ఆదిశంకరులు ఎన్నో అనూహ్యమైన విషయాలు పొందుపరిచారు. కవిత్వం అంటే శబ్దార్థాలు, టీకలు కాదు, శబ్దార్థాలకు అతీతమైన ఒక రమణీయమైన భావన. బ్రహ్మ లోకాలను సృష్టిస్తాడు. దానికి ముడి పదార్థం అమ్మవారి పాద ధూళి రేణువులు. ఏటమ్‌ని సంస్కృతంలో పరమాణువు అంటారు. కణం అన్నా సుమారుగా అదే అర్థం. ఈ కణాలను దర్శించిన ఋషి పేరు కాణాదుడు. శంకరులవారు అనేక నాస్తిక మతాలను భగవంతుని అస్తిత్వాన్ని ప్రశ్నించే వారిని జయించి అద్వైతాన్ని పునఃస్థాపన చేశారు. కాని వారి వారి వాదాలలోని మంచిని సమ్మిళితం చేశారు. అందులో సాంఖ్య, వైశేషిక, న్యాయవాదులూ ఉన్నారు. వారి మతం ప్రకారం ఈ ప్రపంచం పరమాణువులతో నిర్మించబడింది. ఆ మాట శంకరులు ఈ శ్లోకం మొదటి రెండు పాదాలలో ఎంత రమణీయంగా చెప్పారో చూడండి. బ్రహ్మ ఈ భువనాన్ని, 14 లోకాలను, గ్రహమండలాన్ని అమ్మవారి పాదధూళి రేణువులతో సృజిస్తాడు. ఈ 14 లోకాలలో మనం ఉండేది మొదటిది పైన దీనితో కలిపి ఏడు, క్రింద మరో ఏడు. పైనున్నవి భూ, భువర్, సువర్, మహర్, జన, తపస్, సత్యలోకాలు, క్రింద అతల, వితల, సుతల, రసాతల, మహాతల , తలాతల, పాతాళ లోకాలున్నాయి. అందువలన బ్రహ్మ సృష్టికర్త.

వీటన్నిటిని తన వేయిపడగలతో విష్ణువు ఆదిశేషువు రూపంలో ఎదోలా మోస్తున్నాడు. ఇక్కడ శంకరులు విష్ణువు అనకుండా శౌరి అన్న పదం ప్రయోగించారు. కొందరు దీనికి బలరాముడని వ్యాఖ్య చేశారు. అది సరి కాదు. శంకరులు విష్ణు సహస్రనామానికి వ్యాఖ్యానం వ్రాశారు. అందులో శౌరి అన్నది ఒక పేరు, 'శౌరిః శూరజనేశ్వరః' అని విష్ణు సహస్రనామం. ఎదోలా భరించడం అని శంకరులెందుకు వాడారంటే

భారం అధికమైనది కాని అమ్మవారి పాదరేణువులు ఇచ్చిన శక్తితో విష్ణువు దానిని భరిస్తున్నా అప్పుడప్పుడు అటు ఇటు అవచ్చు. అందుకే సూర్యుడు ఒకసారి మకర సంక్రమణం, ఒకసారి కర్కాటక సంక్రమణ చేస్తాడు! అందుచేతనే విష్ణువు స్థితికారుడు.

ఇంక శివుడు లయకారుడు. లయం అంటే లీనం చేయడం, వినాశనం కాదు. తనలోకి అమ్మవారి పాదధూళి రేణువుల రూపంలో తీసుకొని భస్మంగా దానిని తనపై అలుముకొని తిరిగి సృష్టి చెయ్యడానికి ఇస్తాడు.

ఇందులో శంకరులు బ్రహ్మకు విరించి అని విష్ణువుకు శౌరి అని శివునికి హర అనే పదాలు ఉపయోగించడం గమనించదగినది.

విశేషముగా రచించువాడు విరించి – అందుకే శంకరులు బ్రహ్మలోకాలను సృష్టించడం 'అవికలం'గా చేస్తాడు అంటారు. అంటే ఏ మాత్రము వికలం కాకుండా సృష్టిస్తాడు అని అర్థం. శివుడు హరుడు, హర అంటే హరించువాడు. నాశనం చేయువాడు కాదు.

సృష్టి స్థితి లయలకు అమ్మవారి పాద ధూళి రేణువులే కారణం అని శంకరులు ఇందులో అతి రమ్యంగా వర్ణించారు. ఇదే పాదపద్మపరాగ మహిమ మూడవ శ్లోకంలోనూ చెప్పారు.

అవిద్యానా–మంత–స్తిమిర–మిహిర ద్వీపనగరీ
జడానాం చైతన్య–స్తబక మకరంద స్రుతిఝరీ ।
దరిద్రాణాం చింతామణి గుణనికా జన్మజలధౌ
నిమగ్నానాం దంష్ట్రా మురరిపు వరాహస్య భవతి ॥ 3 ॥

తాత్పర్యం:

తల్లీ ! నీ పాదధూళి రేణువులు అజ్ఞాన అంధకారంలో ఉన్నవారికి జ్ఞానమనే సూర్యకాంతి. మూఢులకు బుద్ధి వికసింపజేసే పూలయందున్న తేనెవంటిది. దరిద్రులకు కోరికలు తీర్చే చింతామణి. సంసార సాగరంలో మునిగియున్నవారిని ఉద్ధరించే వరాహమూర్తి కోరవంటిది.

వ్యాఖ్యానం:

అమ్మవారి పాద ధూళి రేణువులవల్ల త్రిమూర్తులు వారి వారి కార్యములు సృష్టి, స్థితి, లయ చేయగలుగుతున్నారు. అది దేవతలకు. మరి మానవులకో? వారామెను చూడగలరు, పాద ధూళిని స్వయముగా అనుభవించగలరు. మానవులకదెట్లు లభించును? కేవలము నిరంతరమూ అచంచలమైన మనసుతో ఆమెపై ఏకాగ్ర బుద్ధితో భక్తి కలిగినపుడే అది సాధ్యము. మానవులను లౌకికమైన అనేక ఆకర్షణలు లోబరచుకొని మాయామోహితులను చేస్తాయి, సంసార బంధాలలో పడవేస్తాయి, అజ్ఞానం, సోమరితనం, దరిద్రం, మోహం ఇటువంటివి ఆవరించి ఉంటాయి. వీటిని అధిగమించడానికి అమ్మవారి పాద ధూళియే శరణు.

శంకరులవారి కవిత్వము ఈ శ్లోకంలో అద్భుతమైన అలంకారాలతో, సమాసాలతో నడుస్తుంది. ఆమె పాద ధూళి రేణువులు అవిద్యకు 'అంతః తిమిర మిహిరద్వీప నగరీ' అంటారు. అంటే అవిద్య అనే లోపల ఉండే చీకటిని పారద్రోలే సూర్యకాంతి. అవిద్య అంటే విద్య లేకపోడం కాదు, జ్ఞానం లేకపోడం. అజ్ఞానం. ఏమిటి తేడా విద్య లేకపోడానికి, జ్ఞానం లేకపోడానికి, అంటే – చదువు లేకపోడం కాదు, ధర్మమూ, తత్త్వము తెలియకపోడం అవిద్య. ఈ అజ్ఞానం హృదయాన్ని, మనసును, తమస్సు అంటే చీకటితో నింపుతుంది. ధర్మం కనపడదు. అమ్మ పాద ధూళి అనే సూర్యకాంతి ప్రసరించినప్పుడే ఆ అజ్ఞానం తొలగిపోతుంది. ఇది బయటి చీకటి కాదు, మనలో ఉన్న చీకటి, తమస్సు. ఊరికినే సూర్యకాంతి అనకుండా శంకరులు ఇక్కడ 'మిహిరద్వీపనగరీ' అనే సమాసం ప్రయోగించారు, అంటే రోజూ మనం సూర్యోదయం చూస్తూ ఉంటాము, ఆ సూర్యుడుదయించే పట్టణం అమ్మ పాద ధూళి. ఒకటో రెండో సూర్యకిరణాలు కాదు, పూర్తిగా సూర్యుడుదయించే పట్టణం ఆమె పాద ధూళి రేణువులు. అంతటి కాంతి ఎంతటి చీకటినైనా అవలీలగా పటాపంచలు చేస్తుంది.

ఆమె పాద ధూళి జడులకు చైతన్యాన్ని కలిగించే తేనెల ప్రవాహం. జడులు అంటే తెలియనివారు కాదు, సోమరులు, మంద బుద్ధులు, తెలుసుకోవాలనే ప్రయత్నం చేయనివారు. వాళ్ళలో చైతన్యం కావాలి అది ఎలా వస్తుంది అంటే ఆమె పాద ధూళి సోకితే వస్తుంది. శంకరులు ఇక్కడ ఒక అద్భుతమైన సమాసంతో ఒక చిత్రాన్ని చూపిస్తారు. జడులకు అమ్మవారి పాద ధూళి 'చైతన్య స్తబక మకరంద స్రుతి ఝరీ' అంటారు. చైతన్యం అనే పుష్పగుచ్ఛం నుంచి ప్రవహించే మకరంద ప్రవాహము. ఒకటో రెండో తేనె బిందువులు కాదు తేనె ప్రవాహం.

మూడవ పాదంలో అమ్మవారి పాద ధూళి దరిద్రులకు 'చింతామణి గుణనికా' అంటే కోరికలను తీర్చి సంపదలను కలిగించే చింతామణుల మాలట. అమ్మవారి సహస్రనామంలో 1053 నామాలున్నాయి. ఒక్కొక్క పేరు ఒక చింతామణి. ఎంతటి దరిద్రాన్నయిన పోగొట్టగలిగే శక్తి ఒక్క చింతామణికే ఉంటుంది, మరి సహస్రనామ పారాయణ చేస్తే!

నాలగవది సంసార సాగరం. శంకరులు దానిని ఈ శ్లోకంలో 'జన్మజలధి' అంటారు. మానవుడు ఏం చేస్తాడు, సంసారంలో ఇంకా ఇంకా లోతు లోతుకి మునిగిపోతూ ఉంటాడు. అందుకే శంకరాచార్యుల వారు 'నిమగ్న' అనే పదం ప్రయోగిస్తారు. ఈ జన్మ జలధిలో నిమగ్నమైనవానికి అంటే సంసార సాగరంలో పూర్తిగా మునిగిపోయినవానికి అమ్మవారి పాదధూళి వరాహావతారంలో విష్ణుమూర్తి భూమిని పైకి తీసిన కోరవంటిదట! అంటే ఎదో నావో ఎదో ఎవరిదో చేతి సహాయమో కాదు, ఆదివరాహమూర్తి కోర. అది ప్రళయకాలంలో భూమినే ఉద్ధరించిన కోర. ఒక సంసార సాగరంలో మునిగిన వానిని పైకి తీయడం ఎంత పని!

అమ్మవారి పాద ధూళి అవిద్యకు సూర్యోదయ ప్రాంతపు ప్రకాశం. జడులకు చైతన్యాన్నిచ్చే మకరంద ప్రవాహం. దరిద్రులకు చింతామణుల మాల. సంసార సాగరంలో మునిగినవానికి ఆది వరాహమూర్తి కోర!

ఆదిశంకరుల కవిత్వంలో అద్భుతమైన ఒక లక్షణం 'ధ్వని'ని ఎలా పొందుపరిచారో చూడండి. అవిద్య పోతే ధర్మాన్ని ఆచరింపగలరు, జడత్వం పోతే కామాన్ని పొందగలరు, దరిద్రం పొతే అర్థం కలుగుతుంది, సంసార సాగరాన్ని దాటగలిగితే మోక్షం వస్తుంది. అంటే ఈ నాలుగు ధర్మము– అర్థము– కామము – మోక్షము పురుషార్థాలు. పురుషార్థాలను ప్రసాదించేది అమ్మవారి పాద ధూళి!

అందులో మొదట ధర్మాచరణం చెప్పి చివర మోక్షం చెప్పారు, మధ్యలో అర్థ కామాలను చెప్పారు. ధర్మమూ– మోక్షము నది ఒడ్డులులాంటివి, అర్థ కామాలు ఆ ఒడ్డులు దాటి ప్రవహించకూడదు. ఎంత చక్కని కవిత్వ పాటవం! ఎంత మహనీయమైనది అమ్మవారి పాద ధూళి మహిమ!

ఈ కవిత్వపు మాధుర్యం శంకరుల భక్తిభావ తరంగిత అంతరంగంలోంచి జాలువారిన అమ్మవారి పాద ధూళి మహిమ.

త్వదన్యః పాణిభ్యా-మభయవరదో దైవతగణః
త్వమేకా నైవాసి ప్రకటిత-వరాభీత్యభినయా ।
భయాత్ త్రాతుం దాతుం ఫలమపి చ వాంఛాసమధికం
శరణ్యే లోకానాం తవ హి చరణావేవ నిపుణౌ ॥ 4 ॥

తాత్పర్యం:

తల్లీ! దేవతలందరూ భక్తులకై వారివారి రెండు చేతులతో ఒకదానితో అభయ ముద్ర ఇంకొక దానితో వరద ముద్ర ధరిస్తున్నారు. నీవు మాత్రము అలా చెయ్యడం లేదు. ఎందుకంటే నిన్ను శరణు కోరిన వారిని భయాన్నుంచి రక్షించడానికి, వారి కోరికలు తీర్చడానికి నీ పాదములే నైపుణ్యం కలిగి ఉన్నాయి కదా!

వ్యాఖ్యానం:

ఈ శ్లోకంలోనూ అమ్మవారి చరణములే వాటి మహిమయే వర్ణించబడింది. మిగిలిన దేవతలందరూ ఒక చేతితో అభయ ముద్రను

మరొక చేతితో వరద ముద్రను ధరించి ఉంటారు. ఈ హస్తముద్రల లక్షణం ఏమిటంటే అభయ ముద్రలో చేతివ్రేళ్ళు పైకి, వరద ముద్రలో క్రిందికి ఉంటాయి. ఎప్పుడూ ఎడమ చేతితో వరదముద్రను, కుడిచేతితో అభయ ముద్రను చూపిస్తారు. ఇది ఆగమశాస్త్ర లక్షణం. అభయం ఇచ్చే చెయ్యి పైన, వరం ఇచ్చే చెయ్యి కింద ఉంటాయి. అది అందరు దేవతల విషయంలో. అమ్మవారికి నాలుగు చేతులు. ఈ నాలిగింటిలో ధనస్సు, బాణము, అంకుశము, పాశము ఉంటాయి. అందువలన మిగిలిన దేవతలందరూ రెండు చేతులతో అభయ- వరద ముద్రలు పట్టి ఉంటారు. శంకరులు ఈ శ్లోకంలో దానికి ఒక చమత్కారం కారణంగా చెప్తున్నారు. అమ్మా! జగజ్జననీ! నువ్వలా చేతులతో అభయ వరదముద్రలు చూపించక్కరలేదు. నీ చరణములే ఆశ్రితులకు భక్తులకు భయాన్నుంచి రక్షించడానికి, కోరిన ఫలములనివ్వడానికి చాలు. నీవే, నీ చరణములే శరణు పొందడానికి లోకములో సమర్థములు.

హరిస్త్వామారధ్య ప్రణత-జన-సౌభాగ్య-జననీం
పురా నారీ భూత్వా పురరిపుమపి క్షోభ మనయత్ ।
స్మరో-పి త్వాం నత్వా రతినయన-లేహ్యేన వపుషా
మునీనామప్యంతః ప్రభవతి హి మోహాయ మహతామ్ ॥ 5 ॥

తాత్పర్యం:

నీకు నమస్కరించే వారికి సౌభాగ్యమిచ్చే జననీ! నిన్ను ఆరాధించి విష్ణువు పూర్వం స్త్రీరూపం పొంది, త్రిపురాంతకుడైన శివునే మోహింపజేశాడు. నీకు నమస్కరించి మన్మథుడు రతి కళ్ళకు ఆస్వాదయోగ్యమైన రూపాన్ని పొంది, జితేంద్రియులైన ఋషులనే మోహంలో పడవేయగలుగుతున్నాడు.

వ్యాఖ్యానం:

ఈ శ్లోకమున అమ్మవారు తననారాధించినవారికి ఎంతటి శక్తులనిస్తుందో శంకరులు ఒకవంక చెప్తూనే మరొక వంక అమ్మవారు

జ్ఞానులను సయితము ఏ విధంగా మోహానికి, మాయకు లోను చేస్తుందో వివరించారు. అమృత మథనం అప్పుడు అమ్మవారిని ఆరాధించి విష్ణువు మోహినీ రూపం దాల్చి సాక్షాత్తు శివుడినే మోహింపజేశాడు. ఈ మన్మథుని ఇంతకు ముందు శివుడు భస్మం చేశాడు, కాని అమ్మవారిని ఆరాధించడంవల్ల ఒక్క రతికి మాత్రమే కనిపించే శరీరంగలవానిగా అమ్మవారు మన్మథుడికి వరం ఇచ్చింది. ఇప్పుడాయన ఏం చేస్తున్నాడు? వేలకొద్ది సంవత్సరాలు తపస్సు చేసిన, ఇంద్రియాలను జయించిన మునులను కూడా మోహంలో పడవేయగలుగుతున్నాడు. ఇదంతా దేనివలన? ఆదిశంకరులు దీనికి సమాధానం మొదటి పాదంలోనే చెప్పారు. ఆమె 'ప్రణత జన సౌభాగ్య జనని', అంటే తనను ఆరాధించినవారికి సౌభాగ్యాన్ని ఇచ్చే తల్లి. ఎంతటి సౌభాగ్యం ఇస్తుందో చూడండి. తన భర్తనే వంచించే శక్తి కూడా ఇవ్వగలదు. ఆమెను ఆరాధించిననవారికి పొందలేనిదంటూ ఏమీ లేదు, అంతటి సౌభాగ్యాన్ని ఇవ్వగలిగినది జగజ్జనని. వేల సంవత్సరాలు తపస్సు చేసిన జితేంద్రియులైన మునలను ఎందుకు మోహంలో పడవేయ్యాలి, ఆ శక్తి మన్మథుడికి ఎందుకు ఇవ్వాలి? అక్కడున్నది రహస్యం. వేల సంవత్సరాలు తపస్సు చేసినవారయినా కామ క్రోధాలను జయించాలి. అందుకని జ్ఞానులను కూడా అమ్మవారు మాయలో పడవేసి నిగ్గుతేల్చిన తరువాతే వారికి ఆయా శక్తులు లభిస్తాయి.

ఇక్కడ మూడు పదాలకు అర్థం చెప్పుకోవాలి. మన్మథుడు అంటే మనస్సును మథించేవాడు. రతి అంటే ఆసక్తి. వీళ్ళిద్దరూ కలిసి లోకులను మోహావిష్టులను చేస్తారు. అది అమ్మవారి మాయ. మాయ అనే పదం సంస్కృతంలో రెండు పదాలు, ఒకటి 'మా' అంటే వద్దు, కాదు అని అర్థం, రెండోది, 'యా' అంటే ఏదయితే అని, రెండూ కలిపితే ఏది కాదో అది అవుననుకోవడం మాయ. ఈ మాయను దాటడానికి ఆమె కరుణ కావాలి, ఆమెను ఆరాధించినవారికి ఎంతటి శక్తులైనా ఆమె ఇస్తుంది. ఈ శ్లోకంలో మరొక విశేషం ఏమంటే, విష్ణువు మన్మథునికి తండ్రి. వాళ్ళిద్దరూ శివుని మోహింపజేసినవారే.

జగజ్జనని అయిన ఆమె తనను ఆరాధించినవాళ్లకి అంతులేని శక్తులనిస్తుందని తాత్పర్యం.

ధనుః పౌష్పం మౌర్వీ మధుకరమయీ పంచ విశిఖాః
వసంతః సామంతో మలయమరుదా యోధనరథః ।
తథాప్యేకః సర్వం హిమగిరిసుతే కామపి కృపాం
అపాంగాత్తే లబ్ధ్వా జగదిద-మనంగో విజయతే ॥ 6 ॥

తాత్పర్యం:

అమ్మా పార్వతీ! మన్మథుడు చూస్తే శరీరం లేనివాడు, పూల ధనుస్సు, అల్లెత్రాడు తుమ్మెదలు, బాణాలూ అయిదే, మలయమారుతం రథం, అల్పాయుష్కుడైన వసంతుడు చెలికాడు, అయినా నీ కృపాకటాక్ష వీక్షణల వలనే ఈ జగత్తునే జయిస్తున్నాడు.

వ్యాఖ్యానం:

ఐదవ శ్లోకంలో మన్మథుని ప్రాభవం కొంత చెప్పి శంకరులు ఈ శ్లోకంలో ఆయన సాధన సామగ్రి గురించి చెప్తున్నారు. మన్మథుని ధనుస్సు పుష్పాలతో కూడినది. ఏమాత్రం ధృఢంగా ఉంటుంది! పోనీ అల్లెత్రాడు చూద్దామా అంటే అది తుమ్మెదల వరుస. తేనె త్రాగి మత్తెక్కిన తుమ్మెదలెంత క్రమశిక్షణగలిగి ఒక వరుసలో ఎంతసేపుంటాయి! పోనీ ఈయనకి ఇన్ని లోకాలను మోహంలో పడవేయడానికి ఎన్ని బాణాలున్నాయి అంటే ఐదే. ఈ ప్రక్రియలో ఈయనికి సహాయం చేసేవాళ్ళెందరున్నారంటే, ఒక్కడు, వసంతుడు, ఏడాదికి రెండు నెలలు అతని జీవితం. అయితే మన్మథుడి రథం ఎంత ధృఢమయినదంటే అది మలయమారుతం. ఎప్పుడొస్తుందో తెలియదు, ఎంతసేపుంటుందో తెలియదు, ఏ దిశలో వెళుతుందో తెలియదు. స్వయంగా యోధుడు మన్మథుడెంతటి వాడంటే పాపం ఆయనకి శరీరం లేదు, అనంగుడు అంటే కాళ్లు చేతులు, చెవులు కళ్ళు ఇలా ఏ అంగాలూ లేనివాడు. మరే శక్తి వలన క్షణం నిలువని ఈ సాధన సామగ్రితో ఈ జగత్తును జయిస్తున్నాడు!

శంకరులు చాలా అద్వితీయమైన కవిత్వం మహత్వంగలవారు. ఆయన కారణం ఏం చెప్తున్నారో చూడండి. 'కామపి కృపాం అపాంగాత్తే లబ్ధ్వా' అంటారు. ఎదో నీ కృప, నీ కనుగొనల చూపు వలన పొందాడు మన్మథుడు, అదే ఈయన శక్తి. అంతవరకు మరో మహాకవి అయినా చెప్పగలడేమో, ఇక్కడ శంకరులవారు అమ్మవారిని 'హిమగిరిసుతే' అన్నారు. మంచుకొండ కూతురు. ఆవిడే ఆయనకు కొండంత అండ! ఆయన లోకంలో పర్వతరాజు. అన్నిటికన్నా ఎత్తైన కొండ ఆయన కూతురు ఈమె. ఆమె వాత్సల్యం ఈయన మీద ఉండబట్టే జగత్తులను జయిస్తున్నాడు.

శంకరుల కవిత్వంలో మరో రెండు మాటలు చూడండి. మన్మథుడి బాణాలు పంచ అంటే అయిదు. పంచత్వం అంటే చావు, ఈ బాణాలకి ఎక్కువ జీవితం లేదు. అయిదూ పుష్పాలే, అరవిందం, అశోకం, మామిడి పువ్వు, నవమల్లిక, నీలోత్పలం, నల్ల కలువ. దేనికీ జీవితం ఎక్కువలేదు. అయితే ఇక్కడ 'పంచ విశిఖాః' అంటారు. సృష్టిలో ఒక్కొక్క ప్రాణికి ఒక్కొక్క ఇంద్రియ చాపల్యం ఉంటుంది, లేడికి శ్రవణేంద్రియం, వేటగాని సంగీతానికి లొంగిపోతుంది. ఏనుగుకి స్పర్శేంద్రియం, ఆడ ఏనుగు స్పర్శకి లొంగిపోతుంది. దీపాన్ని చూసి పండనుకుంటుంది మిడత. ఎరను చూసి ఆ వాసనకి చాపల్యం వల్ల చేపలు మరణిస్తాయి. తుమ్మెద పద్మంలో మధువు తాగడానికి వెళ్లి సూర్యాస్తమయం తరువాత అందులో ఉండిపోయి మరణిస్తుంది. ఒక్కొక్క ప్రాణికి ఏదోఒక ఇంద్రియ చాపల్యం ఉంటుంది, మానవుడు బుద్ధిజీవి, మేధస్సుగలవాడు, తపస్సంపన్నుడు, అన్నీ తెలుసుననుకునే మూర్ఖుడు. అందుచేత ఏ ఒక ఇంద్రియానికి చాపల్యం కలిగినా వినాశం పొందుతాడు. ఇందులో మన్మథుని ప్రయత్న ఒకింత ఉంటే చాలు. మరి ఈ చాపల్యాన్ని ఎలా జయించాలి, ఏ అమ్మ కటాక్షం వల్ల మన్మథునికీ శక్తి కలిగింది, ఆ అమ్మవారే ఈ చాపల్యాల నుంచి రక్షించగలదు. ఇంకో విశేషం చూడండి. ఈ మన్మథుడికి కామదేవుడు అని పేరు. తన మూడవ కంటితో కాముని భస్మం చేసి

జయించాడు గనుక శివుడు కామేశ్వరుడు. అమ్మవారు కామేశ్వరి. కాని ఆ కాముడిని తన కటాక్షంతో మళ్ళీ రూపం ఇచ్చి జగత్తును మోహింపజేసే శక్తిని ఇచ్చిన అమ్మవారు కామాక్షి!

క్వణత్కాంచీ-దామా కరి కలభ కుంభ స్తననతా
పరిక్షీణా మధ్యే పరిణత శరచ్చంద్ర వదనా।
ధనుర్బాణాన్ పాశం సృణిమపి దధానా కరతలైః
పురస్తా దాస్తాం నః పురమథితు రాహో పురుషికా ॥ 7 ॥

తాత్పర్యం:

చిరుమువ్వల ఒడ్యాణపు చప్పుడు, మదించిన ఏనుగుల కుంభస్థలంవంటి స్తనములుగలిగి వాటి భారం చేత కొంచెం వంగినట్టున్న నడుముగలిగి, నాలుగు చేతులలో ధనుస్సు బాణములు, పాశము అంకుశము ధరించి, త్రిపురహరుడయిన శంకరుని అహంకార స్వరూపిణి అయిన అమ్మవారు మా ఎదురుగా సాక్షాత్కరించుగాక.

వ్యాఖ్యానం:

ఆదిశంకరులు శంకరుని అవతారము. వారి అవతార గమ్యం అద్వైత మత స్థాపనం. కాని వారు రచించినన్ని స్తోత్రాలు ఏ ఆచార్యులూ, ఏ కవీ వ్రాయలేదు. జ్ఞానము లేని భక్తి గొప్పదే కాని భక్తి లేని జ్ఞానము అన్నివేళలా పనికిరాదు. వారే వ్రాసిన వివేక చూడామణిలో 'మోక్ష సాధన సామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ', మోక్ష సాధనకి ఉన్న మార్గాలలో భక్తి గొప్పదంటారు. ఇంతవరకు చెప్పిన శ్లోకాలలో అమ్మవారి వైభవాన్ని వర్ణించిన శంకరులు ఈ శ్లోకంలో అమ్మవారిని ధ్యానించాలంటే ఏ రూపం మనకి ఎదురుగా ఉండాలో చెప్తున్నారు.

త్రిపురహరుడైన శివుని అహంకార స్వరూపిణి అయిన అమ్మవారు మన ఎదురుగా ఉండాలి అంటారు. ఈ శ్లోకంలో 'అహోపురుషికా' అన్న పదం చాలా గొప్పది, ఈ అమ్మవారి స్వరూపాన్ని, శక్తిని పొందగలిగిన శివుడు నేను కదా పురుషుడిని అని అహంకార కలిగి ఉంటాడట.

ఇంకోలా చెప్పాలంటే శివుని అహంకార స్వరూపిణి జగన్మాత. ఇక్కడ అహంకారం అన్న పదానికి కూడా విచిత్రమైన మరో అర్థం చెప్పుకోవచ్చు. శివుని ఢమరుకంలోంచే అక్షరాలన్నీ ఉద్భవించాయి. అందులో మొదటి అక్షరం అ – చివరి అక్షరం హ, అహంకారం అంటే అన్ని అక్షరాల స్వరూపం, అమ్మవారిని సర్వవర్ణాత్మికే అని పూజిస్తాం కదా!

అమ్మవారి స్వరూపవర్ణన; 1. మొలనున్న వడ్యాణపు చిరుమువ్వల సవ్వడి, భక్తుని అనుగ్రహించి అమ్మే భక్తునికై వస్తూ ఉంటే ఆ మువ్వల సవ్వడి కలుగుతుంది, ఆమె కూర్చుని ఉంటే రాదు కదా!

2. గున్నేనుగుల కుంభస్తనములవంటి పాలిండ్లు. అనాది నుంచి కవులందరూ స్త్రీని వర్ణించేటప్పుడు స్తన వర్ణన చేశారు. ఎందుకంటే అది మాతృభావన. లోకం తెలియని శిశువుకు మొదటి ఆహారం తల్లి పాలు. అవి ఎంత సమృద్ధిగా ఉంటే పిల్లలకి అంత ఆహారం. ఆమె జగన్మాత. లోకమంతా ఆమె సంతానమే. అందులోనూ శంకరుల చమత్కారం ఏనుగుగున్నలన్న పదం వాడడం, గణేశుని తలపిస్తుంది.

3. సన్నని నడుము. నడుము ఎలా ఉండాలో ఎందరో కవులు వర్ణించారు, ఉందో లేదో అన్నట్టు ఉండాలట. సన్నని నడుము ఆరోగ్యానికి, సౌభాగ్యానికి సంకేతము. జ్యోతిషశాస్త్రము సాముద్రికము మొదలైన శాస్త్రాలలో సన్నని నడుము మాతృత్వానికీ ఆలవాలమని చెప్తారు.

4. తరువాత అమ్మ వారి ముఖం శరత్కాలపు పున్నమ చంద్రునిలా ఉండాలంటారు. ఆమెకు 16 కళలు, ఆమె మంత్రానికి పదహారు అక్షరాలు.

5. అమ్మవారి ఆయుధాలు నాలుగు చేతులలో నాలుగు, ధనుస్సు, బాణము, పాశము, అంకుశము. ఇవి ఒక్కొక్కటి ఒక లక్షణానికి సంకేతము. ధనుస్సు మన మనస్సు, బాణములు మన ఇంద్రియములు, పాశము అంకుశము మన రాగ ద్వేషాలు. ఇవన్నీ ఆమెకు సమర్పిస్తే ముక్తికి అడ్డేముంటుంది. అటువంటి అమ్మవారు 'పురస్తాదాస్తాం నః' మాముందు సాక్షాత్కరించుగాక. అంటారు శంకరులు.

సౌందర్యలహరిలో మొదటి 41 శ్లోకాలలో అమ్మవారి వైభవమేగాని సౌందర్య వర్ణన ఉండదు. ఈ శ్లోకం పైకి సౌందర్య వర్ణనగా కనిపించే వైభవ వర్ణనం. ఉపాసన రెండు విధాలు, సగుణం, నిర్గుణం. అంటే మూర్తిని ధ్యానించడం లేదా ఆకారం లేని అమ్మవారిని ధ్యానించడం. మూర్తి ధ్యానం తొలిమెట్టు. అందుకుపయోగపడే శ్లోకం ఇది.

సుధాసింధోర్మధ్యే సురవిటపివాటీ పరివృతే
మణిద్వీపే నీపోపవనవతి చింతామణి గృహే ।
శివాకారే మంచే పరమశివ పర్యంక నిలయామ్
భజంతి త్వాం ధన్యాః కతిచన చిదానంద-లహరీమ్ ॥ 8 ॥

తాత్పర్యం:

అమ్మా! సుధా సాగర మధ్యంలో కల్పవృక్ష వాటికలో మణిద్వీపంలో కదంబ వనంలో చింతామణి గృహంలో శివాకారంలో ఉన్న శయ్యపై పరమశివుని తొడపై కూర్చున్న నీవు జ్ఞానానంద తరంగానివి, నిన్ను ఏ కొందరో ధన్యులు మాత్రమే సేవించి తరిస్తున్నారు.

వ్యాఖ్యానం:

ఆణిముత్యాల్లాంటి పదాలు, అన్నీ శుభప్రదమైనవే, సుధాసింధు, సురవిటపి, మణిద్వీపం చింతామణి, శివాకారం, పరమశివుడు, చిదానంద-లహరీ... ఆదిశంకరులు భక్తిపారవశ్యంలో అనుభవించిన శ్లోకం ఇది. అమ్మవారి పూజ రెండు విధాలు, మనసులో చేసుకునేది, అంతర్ముఖమైన పూజ. దీనికి సమయాచారమని పేరు. రెండవది బహిర్ముఖమైనది, దీనికి కౌళాచారమని పేరు. ఇందులో సమయాచారం అంటే అంతర్ముఖ పూజ శంకరులు చెప్తున్నారు. అమ్మవారి యంత్రానికి శ్రీచక్రమని పేరు. 11వ శ్లోకంలో దాని వివరణ చెప్పే ముందు మనకి కొంచెం కొంచెంగా కుండలిని, శ్రీ చక్రం మన శరీరంలోని చక్రాలు పరిచయం చేస్తున్నారు శంకరులు, ఈ శ్లోకానికి ఎందరెందరో ఒకరికి

మించి ఒకరు వ్యాఖ్యలు వ్రాశారు వారి–వారి దృక్కోణాల నుంచి. కామేశ్వర సూరి అనే వ్యాఖ్యాత ఈ శ్లోకంలో 'సురవిటపి వాటీ' అనే దానికి కల్పవృక్షాల వనం అనే సామాన్యమైన అర్థం చెప్పకుండా శ్రీశైలం మొదలైన భక్తుల కోర్కెలు తీర్చే పుణ్య క్షేత్రాలని, 'మణిద్వీపం' అంటే ధ్యానానికి ఉపయోగపడే అనేక ఏకాంత ప్రదేశాలని, 'సుధా సింధు' అంటే హిమాలయాలని, 'శివాకారే మంచే' అంటే కైలాస పర్వతం అని, 'చిదానందలహరీం' అన్నది ఈ గ్రంథం పేరులో ఉన్న ఆనందలహరి అని ఇలా వ్యాఖ్యానించారు.

అమృత సముద్రం మధ్యలో కోరికలు అడగకుండానే తీర్చే కల్పవృక్షాల వనంలో, మణిద్వీపంలో, కదంబవనవాసినిగా అమ్మవారు చింతామణి గృహంలో ఉంది. శ్రీవిద్యా సంప్రదాయంలో శ్రీ చక్రం అంటే శివుడు, శక్తి వీరిద్దరి కలయిక. 'శ్రీచక్రం శివయోర్వపుః' ఇక్కడ శివయోః అన్నది ద్వివచనం శివశక్తుల శరీరమే శ్రీ చక్రం. అలా ఉన్న అమ్మవారు చిదానందలహరి. జ్ఞానము ఆనందముల తరంగం. అలాంటి అమ్మవారిని ఏ కొందరో ధ్యానించగలుగుతారు అని శంకరులు చెప్తున్నారు. ఎవరా కొందరు, అంటే లౌకికమైన వాంఛలకతీతులై, కర్మ త్యాగం చేసి, విరాగులై, అమ్మవారియందు లీనమయే స్థితికి చేరుకున్నవారు వారు.

మహీం మూలాధారే కమపి మణిపూరే హుతవహం
స్థితం స్వధిష్ఠానే హృది మరుతఽ మాకాశఽ ముపరి ।
మనోఽ పి భ్రూమధ్యే సకలమపి భిత్వా కులపథం
సహస్రారే పద్మే సహరహసి పత్యా విహరసే ॥ 9 ॥

తాత్పర్యం:

జగజ్జననీ! నీవు మూలాధారంలో ఉండే భూతత్త్వాన్ని, మణిపూరంలో జలతత్త్వాన్ని, స్వాధిష్ఠానంలో అగ్నితత్త్వాన్ని, హృదయంలోని అనాహతంలో వాయుతత్త్వాన్ని, విశుద్ధి చక్రంలో ఆకాశతత్త్వాన్ని, కనుబొమ్మల మధ్యనున్న

ఆజ్ఞాచక్రంలో మనస్తత్త్వాన్ని అలా అన్ని తత్త్వాలను ఛేదించి, సహస్రదళ పద్మమైన సహస్రారంలో రహస్యంగా ఏకాంతంగా శివునితో గూడి విహరిస్తున్నావు.

ముందుగా మన శరీరంలో ఆరు చక్రాలు:				
చక్రం బొమ్మ	పేరు	స్థానం	దళాల సంఖ్య	రంగు
	మూలాధార చక్రం	వెన్నెముక క్రింది భాగము	4 దళాలు	ఎరుపు
	స్వాధిష్ఠాన చక్రం	జననేంద్రియ స్థానం	6 దళాలు	కాషాయం
	మణిపూర చక్రం	నాభిస్థానం	10 దళాలు	పసుపు
	అనాహత చక్రం	హృదయం	12	ఆకుపచ్చ
	విశుద్ధ చక్రం	గొంతు	16	నీలం
	ఆజ్ఞా చక్రం	కనుబొమల మధ్య స్థానం	2	ఇండిగో/ఊదా
	సహస్రార చక్రం	కపాలం పైభాగం	1000	అనేక వర్ణాలు

వ్యాఖ్యానం:

ఈ శ్లోకం ఒక సముద్రమంత గంభీరమైనది, లోతైనది, వెతికినకొద్దీ రత్నభండారాలను ఇచ్చేది. ఇందులో యోగశాస్త్రం, వేదాంతం, కుండలినీ శక్తి, శరీరంలో ఉన్న ఆరు చక్రాలు, వాటితో శ్రీచాక్రానికి శ్రీవిద్యకు ఉన్న సంబంధం ఇలా ఎన్నో విషయాలు శంకరులు పొందుపరిచారు. తరచి చూసినా తెరచి చూసినా ఇది ఒక గ్రంథం. విషయం జటిలంగా కనిపించినా, అమ్మవారిని మనసులో పెట్టుకుని తేలికైన మాటలతో బరువైన విషయాన్ని గ్రహించడానికి ప్రయత్నిద్దాం.

కుండలిని: ఇది యోగాశాస్త్రములో సాధన చేత సాధించగలిగే శక్తి. మన శరీరములో వెన్నెముక మూల భాగమునందు మొదలుకొని పూర్తి వెన్నెముకనంటి యుండు మూడు నాడులను మేలుకొలుపుట వలన కలుగు శక్తి. ఈ నాడులు ఇడ– పింగళ– సుషుమ్న. ఇడ వెన్నెముకకు ఎడమవైపు, పింగళ కుడివైపు ఉంటాయి. వీటి మధ్యనుండేది సుషుమ్న. ఇడ చంద్రుని తత్త్వము, పింగళ సూర్య తత్త్వము, సుషుమ్న అగ్ని తత్త్వము.

పైన చెప్పిన 6+1 చక్రములుగాని, ఈ మూడు నాడులుగాని విధ్యుత్తువలె పైకి కనిపించవు, అతి శక్తివంతమైనవి. వాటిని కలిపి పనిచేసే సాధన అనంతమైన ఉపాసన, సాధన. దాని పేరు కుండలినీ. యోగాసాధనలోనో, అమ్మవారి ఉపాసనలోనో, కుండలినీ శక్తి పాదరసమువలె ఒక్కొక్క చక్రమును దాటి సహస్రారమునకు చేరుతుంది.

సూక్ష్మ ప్రపంచము అంటే పిండాండమున దీనికి కుండలినీ అని పేరు. స్థూల ప్రపంచమున అంటే బ్రహ్మాండమున ఈ సాధనయే మహా త్రిపుర సుందరీ అమ్మవారు. ఇంత తెలుసుకున్న తరువాతనే ఈ శ్లోకము అర్థమవుతుంది. ప్రాణాయామం ద్వారా యోగసాధన ద్వారా కుండలిని మేలుకుంటుంది. ఇది సర్పములా ముందు మూలాధారంలో భూతత్త్వాన్ని, స్వాధిష్ఠానంలో అగ్ని తత్త్వాన్ని, మణిపూరంలో జలతత్త్వాన్ని, అనాహతంలో వాయుతత్త్వాన్ని, విశుద్ధంలో ఆకాశతత్త్వాన్ని, చివరిగా ఆరవ చక్రంలో కనుబొమ్మల మధ్య ఉండే ఆజ్ఞా చక్రంలో మనస్తత్త్వాన్ని చేదించుకుని వేయి రేకుల దళం సహస్రారంలో బ్రహ్మరంధ్రంలో చేరుతుంది. ఇదే శ్రీవిద్య సాధన. అమ్మవారే ఈ ఒక్కొక్క చక్రాన్ని ఛేదించుకుంటూ సాధకుని సాధన వలన సహస్రారంలో చేరి శివునితో కలిసి విహరిస్తుంది అంటారు శంకరులవారు.

యోగశాస్త్రం తెలిసినవారు మానవ శరీరంలో 72 వేల నాడులుంటాయంటారు. వాటిని నియంత్రించేవి ఈ 3 నాడులు, ఇడ– పింగళ – సుషుమ్న. సాధారణ మానవులకు ఈ నాడుల శక్తి తెలియక

వ్యర్థమౌతుంది. తెలిసిన సాధకులకు శక్తి, అంటే అమ్మవారి శక్తి లభ్యమౌతుంది.

సుధాధారాసారై-శ్చరణయుగలాంత-ర్విగలితైః
ప్రపంచం సిఞ్చన్తీ పునరపి రసామ్నాయ-మహసః ।
అవాప్య స్వాం భూమిం భుజగనిభ-మధ్యుష్ట-వలయం
స్వమాత్మానం కృత్వా స్వపిషి కులకుండే కుహరిణి ॥ 10 ॥

తాత్పర్యం:

తల్లీ! నీ పదకమలముల మధ్యనుంచి అమృతపు ధార శరీరమునగల నాడీమండలమును తడుపుచున్నది. తిరిగి నీవు చంద్రుని అమృత కాంతుల నుండి దిగి భూమియైన మూలాధారాన్నిజేరి, నిన్ను నీవు చుట్టజుట్టిన సర్పమువలె జేసుకొని ఆధార చక్రమున సూక్ష్మరంధ్రమున కుండలినీ శక్తివై నిద్రింతువు.

వ్యాఖ్యానం:

ఈ 9–10 రెండు శ్లోకములు కలిపి చదివితే అది కుండలినీ రహస్య సోపానం, అంటే పైకి నిచ్చెనలా ఎక్కే విధానం, తిరిగి క్రిందకి దిగే విధానంతో పూర్తి కుండలినీ విద్యను తెలిపే శ్లోక ద్వయం. శంకరులు ఈ శ్లోకంలో ప్రపంచం అన్నది ప్రపంచం అని ఒక అర్థం, పంచ భూతాలతో నిర్మించబడిన, 72 వేల నాడులు ఉన్న ఈ భౌతిక శరీరం అని ఇంకో అర్థం. ఆరోహణలో అమ్మవారు సహస్రారం చేరినపుడు ఆమె పాదముల నుండి ప్రవహించు అమృత ధారలు సాధకుని దేహంలో అన్ని నాడులను తడిపి బ్రహ్మానందాన్ని కలిగిస్తుంది. అలా అన్ని లోకాలను, సాధకుని అమృత ధారలతో తడుపుతుంది అమ్మవారు.

యోగశాస్త్రంలో శిరస్సు చంద్రమండలం అని చెప్తారు. శివునికి, అమ్మవారికి శిరసున చంద్రవంక ఉండడం గమనించదగిన విషయం. చంద్రమండలమే శ్రీచక్రం అని శ్రీ విద్య చెపుతుంది. ఎందుకంటే శ్రీ విద్య మంత్రానికి 16 అక్షరాలు, చంద్రునికి 16 కళలు. సౌందర్యలహరికి

వ్యాఖ్యానం వ్రాసిన మహా విద్వాంసులు లక్ష్మీధర పండితులు ఇది సుభగోదయ వ్యాఖ్యానంలో నిరూపించబడిన మహా రహస్యం అని పేర్కొన్నారు. అందుచేత శిరస్సులో ఉన్న సహస్రార చక్రంలో బిందువులో ఉన్న అమ్మవారి పదకమలాల నుండి స్రవించే అమృత ప్రవాహం సాధకుని నాడీ మండలాన్ని పరిశుద్ధం చేస్తుంది అన్నది సారాంశం. తరువాత అమ్మవారు సహస్రారం నుండి మూలాధారానికి దిగి సర్పంలా చుట్టుకుని కుండలినీ శక్తిగా నిద్రిస్తుంది. అంతటికీ కారణం అమ్మవారి పాద సరోజముల నుండి ప్రవహించే అమృత ధార. ఆదిశంకరులంటారు, అన్నం ఎదురుగ పెట్టుకుని భిక్షాటనానికి వెళ్లినట్టు మనలో ఉన్న ఈ శక్తి స్వరూపాన్ని తెలియక బయట వెదకడం అవివేకం అంటారు.

చతుర్భిః శ్రీకంఠైః శివయువతిభిః పంచభిరపి
ప్రభిన్నాభిః శంభోర్నవభిరపి మూలప్రకృతిభిః ।
చతుశ్చత్వారింశద్-వసుదల-కలాశ్చ్-త్రివలయ-
త్రిరేఖాభిః సార్ధం తవ శరణకోణాః పరిణతాః ॥ 11 ॥

శివునికి సంబంధించిన, శీర్షము మీదికిగల, నాలుగు త్రికోణములు, తలక్రిందులుగానుండు అమ్మవారి ఐదు త్రికోణములు, 9 మూలప్రకృతులుగలవి అయి అవి ఒకదానినొకటి ఖండించగా ఏర్పడిన నలభైనాలుగు త్రికోణములు, వాటి బయట ఎనిమిది పద్మపు రేకులు, దానిపై పదహారు పద్మపు రేకులు, దానిపై మూడు ఒక దానిలో ఒకటి అంతర్గతమైన వృత్తములు, వాటిపై మూడు రేఖలుగల చతుర్భుజముతో నీ నిలయమైన శ్రీ చక్రము అలరారుచున్నది.

వ్యాఖ్యానం:

ఆదిశంకరుల వారి కవిత్వానికి వారి గణితశాస్త్రాది శాస్త్రాల పరిజ్ఞానం ఒక శిఖరిణి వృత్తంలో వారీ విషయాలను ఎలా పొందుపరచారో చూస్తే అద్భుతమైన వారి మేధస్సు బోధపడుతుంది. ఇది శ్రీచక్రం లేదా శ్రీయంత్రం యొక్క భౌతికమైన రూపాన్ని తెలిపే వివరణ శ్లోకం.

శ్రీచక్రం ఒక యంత్రం, దీన్ని యంత్రాలన్నిటిలోకి గొప్పదని యంత్ర రాజం అని అంటారు. దీనిలో తొమ్మిది ఆవరణలు ఉంటాయి. నవ ఆవరణలు.

1. బిందువు – శ్రీ చక్రం మధ్యలో ఉంటుంది. దీనికి సర్వానందమయ చక్రం అని పేరు.

2. త్రికోణం – బిందువు దీని మధ్యలో ఉంటుంది. దీనికి సర్వసిద్ధిప్రద చక్రం అని పేరు.

3. 8 కోణాలున్న చక్రం – సర్వరోగహర చక్రం అని పేరు.

4. 10 కోణాలున్న ఒక చక్రం – సర్వ రక్షాకర చక్రం అని పేరు.

5. మరొక 10 కోణాల చక్రం – సర్వార్థ సాధక చక్రం.

6. 14 కోణాలున్న చక్రం – ఇది సర్వ సౌభాగ్యదాయక చక్రం.

7. 8 పద్మ దళాలున్న చక్రం – ఇది సర్వ సంక్షోభణ చక్రం.

8. 16 పద్మ దళాలున్న చక్రం – దీనికి సర్వాశా పరిపూరక చక్రం అని పేరు.

9. మూడు వృతాలు ఒకదానిలో ఒకటి ఉండి దాని బయట మూడు చతురస్రాలు ఒకదానిలో ఒకటి ఉండే చక్రం – దీనికి త్రైలోక్య మోహన చక్రం అని పేరు. ఇదంతా ఈ శ్లోకంలో శంకరులు పొందుపరిచారు. అదీ గణితశాస్త్రం ఆధారంగా!

నాలుగు శివత్రికోణాలు, 5 అమ్మవారి త్రికోణాలు ఒకదానితో ఒకటి ఖండించినపుడు 43 త్రాకోణాలు ఏర్పడతాయి. ఇది శ్రీచక్రం మధ్యభాగం, వీటి మధ్యలో బిందువు అమ్మవారి స్థానం. ఈ త్రికోణాల బయట 8 పద్మదళాల ఆవరణ, దాని బయట 16 పద్మదళాల ఆవరణ ఉంటాయి. వాటి బయట 3 వృత్తాలు 3 చతురస్రాలు ఉంటాయి. రహస్యం ఎక్కడుందంటే లెక్క చూస్తే పైన చెప్పిన త్రికోణాలు, 1+8+10+10+14=43, ఆదిశంకరులు శ్లోకంలో 'చతుశ్చత్వారింశత్' అంటే 44 అన్నారు. మధ్యలో ఉన్న బిందువు కూడా ఒక త్రికోణం అన్నది రహస్యం. ఇప్పుడు 44 లెక్క

సరిపోతుంది. ప్రకృతీ పురుషుల శివ శక్తుల సంయోగము శ్రీచక్రం. శ్రీచక్రాన్ని రేకులో చూపించినట్టే మేరువుగా ఒక ఆవరణపై మరొక ఆవరణ వచ్చేటట్టు చూపిస్తారు. ఆయా చిత్రాలను ఈ ప్రక్కన చూడండి.

శ్రీచక్రం



శ్రీచక్రం – మేరువు

త్వదీయం సౌందర్యం తుహినగిరికన్యే తులయితుం
కవీంద్రాః కల్పంతే కథమపి విరించి–ప్రభృతయః ।
యదాలోకౌత్సుక్యా–దమరలలనా యాంతి మనసా
తపోభిర్దుష్ప్రాపామపి గిరిశ–సాయుజ్య–పదవీమ్ ॥ 12 ॥

తాత్పర్యం:

తల్లీ హిమగిరి పుత్రీ! నీ సౌందర్యాన్ని వర్ణించడానికి బ్రహ్మాదులైన కవులకు కూడా ఎంత ప్రయత్నించినా సమర్థులు కాలేకపోతున్నారు. దేవతా స్త్రీలు నీ సౌందర్యం చూడాలనే కుతూహలంవలన, తపస్సు చేత కూడా పొందరాని శివ సాయుజ్యాన్ని మనసా పొందుతున్నారు.

వ్యాఖ్యానం:

అమ్మవారి సౌందర్యం వర్ణించడానికి ఎవరికి సాధ్యం. లోకంలో ఏదైనా వర్ణించాలంటే దానికి సరిపోయిన పోలికలున్న దానితో సామ్యం చూపించి ఇలా ఉంది అని చెప్పాలి. అమ్మవారు తుహినగిరి కన్య. హిమవంతుని కుమార్తె. బ్రహ్మాది దేవతలు కూడా ఆమెను వర్ణించలేరట. బ్రహ్మ అంటే వేదములు విరచించినవాడు, సరస్వతి భర్త, వాచస్పతి. లోకంలో ఆయన సృష్టించిన అందాన్నే కవులు వర్ణిస్తారు. మరి ఆయనే వర్ణించలేని సౌందర్యాన్ని ఎవరు వర్ణించగలరు? బ్రహ్మ సృష్టిలో అందమైనవారు అప్సరసలు, వాళ్ళు కూడా ఆమె సౌందర్యాన్ని తెలుసుకోడానికి అది తెలిసిన శివుడిని ధ్యానించి ఆయన సాయుజ్యం పొందుతున్నారట. ధ్యానం – సాయుజ్యం అనే రెండు అద్వితీయమైన అద్వైత మార్గాలు ఆదిశంకరులు ఈ శ్లోకం ద్వారా చెప్తున్నారు, అమ్మవారి

సౌందర్యం ప్రాతిపదికగా. తపస్సు చేతనో మరే దీక్షాదుల చేతనో చేరరాని శివసాయుజ్యం మనస్సుతో అంటే ధ్యానయోగంతో అప్సరసలు పొందుతున్నారు, ఎందుకు అంటే అమ్మవారి సౌందర్యాన్ని చూడాలనే ఉత్సుకతవలన!

నరం వర్షీయాంసం నయనవిరసం నర్మసు జడం
తవాపాంగాలోకే పతిత-మనుధావంతి శతశః ।
గలద్వేణీబంధాః కుచకలశ-విస్రస్త-సిచయా
హటాత్ త్రుట్యత్కాంచ్యో విగలిత-దుకూలా యువతయః ॥ 13 ॥

తాత్పర్యం:

అమ్మా! నీ కటాక్ష వీక్షణలకు పాత్రుడైనవాడు, ముసలి అయినా, కురూపి అయినా, శృంగారంలో మూఢుడైనా, అటువంటివాని వెనుక, వందలకొలది యువతులు, జుట్టు ముడి వీడిపోయినా, కలశములవంటి కుచములపై పైట కొంగు జారినా, పోకముడి వీడినా సరే, బట్టలు జారిపోతున్నా కూడా లెక్కచేయక పరుగెడుతారు.

వ్యాఖ్యానం:

ఇది చాలా విచిత్రమైన శ్లోకం. ఇలాంటి శ్లోకం ఎందుకు ఇక్కడ అని అనిపించే శ్లోకం. ఇందులో ఆది శంకరులు ఏం చెప్తున్నారు అని మనకి పైకి అనిపిస్తుందోఅది వేరు, లోపల దాగి ఉన్న అర్థం వేరు. పైకి ఒక సాధకుడు ఎంత ముసలివాడు అయినా కురూపి అయినా యోగ్యుడు యౌవనం లేనివాడైనా ఆయన వెంట స్త్రీలు కామంతో పరుగులు పెడతారు అని అర్థం. అంతరార్థం జాగ్రత్తగా వెతకాలి. అమ్మవారు శక్తిస్వరూపిణి, అంటే ఆమెను నిష్ఠతో పూజించేవాడికి ఆమె ప్రసన్నమై శక్తులు ఇస్తుంది. ఆ సాధకుడికి తనకి తెలియని శక్తులు వస్తాయి. అతను ఆకర్షణగలిగి, వాక్శుద్ధి గలిగి, తేజస్సుగలిగి దానితో ఇతరులను పురుషులైనా స్త్రీలైనా ఆకర్షిస్తాడు. ఈ శక్తి అతనికి తనకు తానుగా తెలియకుండా వస్తుంది. ఒక నీరసమైన వ్యక్తికి ఒక బలవంతుడిని ఓడించే శక్తి వచ్చినట్టు.

ఈ శక్తి తనకు ఉంది అని తెలియగానే ఏమవుతుంది, మొదట తనని తాను గొప్పవాడు అనుకుంటాడు. మన్మథుడు అనుకుంటాడు, ఈ శక్తి అనే మాయలో పడి ఉన్న శక్తి పోగొట్టుకుంటాడు. అమ్మవారు ఒక్కొక్క వరంతో పాటు ఒక్కొక్క కలవరం ఇస్తుంది. ఆమె ఇచ్చిన శక్తిని నిగ్రహించుకుని ముందుకు వెళ్ళే సాధకుడు ముందుకి వెళతాడు, లేనివాడు మోహంలో పడి కొట్టుకుపోతాడు. శ్రీ చక్రంలో రెండవ చక్రం సర్వాశా పరిపూరక చక్రం, ఇది దాటితే మూడవది సర్వ సంక్షోభణ చక్రం, ఆశలకి లొంగిపోతే జరిగేది సర్వ సంక్షోభణం.

కొందరు పండితులు మరొక అర్థం చెప్తారు ఈ శ్లోకానికి. సాధకుడు ఒక మెట్టు ఎక్కిన తరువాత వాని వెంట స్త్రీలు కాదు, ముక్తి కాంత తానుగా వరిస్తుందని, వెంటబడుతుందని అంటారు.

ఈ శ్లోకాన్ని ఇటువంటి పైకి శృంగారంగా కనిపించే శ్లోకాలను ఆ దృష్టితో చూడాలి.

క్షితౌ షట్పంచాశద్-ద్విసమధిక-పంచాశ-దుదకే
హుతాశే ద్వాషష్టి-శ్చతురధిక-పంచాశ-దనిలే।
దివి ద్విః షట్ త్రింశన్ మనసి చ చతుఃషష్టిరితి యే
మయూఖా-స్తేషా-మప్యుపరి తవ పాదాంబుజ-యుగమ్ ॥ 14 ॥

తాత్పర్యం:

తల్లీ! పృధ్వీ తత్త్వానికి చెందిన మూలాధారంలో యాభైఆరు కిరణాలు, జలతత్త్వమైన మణిపూరంలో యాభైరెండు, అగ్నితత్త్వానికి చెందిన స్వాధిష్టానంలో అరవైరెండు, వాయుతత్త్వానికి చెందిన అనాహతంలో యాభైనాలుగు, ఆకాశతత్త్వానికి చెందిన విశుద్ధి చక్రంలో డెబ్భై రెండు, మనస్తత్త్వానికి చెందిన ఆజ్ఞాచక్రంలో అరవై నాలుగు సంఖ్యలలో నీ కిరణాలున్నాయి, కాని నీ పాదాంబుజాల కాంతి వీటన్నిటిని అధిగమించినది కదా!

వ్యాఖ్యానం:

ఈ శ్లోకం ఒక శాస్త్ర రహస్యంతో కూడినది. దీనికి లక్ష్మీధర పండితులు తన వ్యాఖ్యానంలో 6 చక్రాలను రెండు రెండుగ కలిపి ఒక్కొక జంటకు ఒక్కొక్క రహస్యాన్ని చెప్పారు.

మూలాధారం – స్వాధిష్ఠానం ఒక ఖండం – దీనికి అగ్ని స్థానం – రుద్రగ్రంధి

మణిపూరక అనాహతాలు ఒక ఖండం, దీనికి సూర్యుడు స్థానం – విష్ణు గ్రంధి

విశుద్ధి ఆజ్ఞా చక్రాలు ఒక ఖండం – చంద్రుడు స్థానం – బ్రహ్మ గ్రంధి

ఒక్కొక్క ఖండానికి ఆయా దేవతలు, అగ్ని, సూర్యుడు, చంద్రుడు తేజస్సును ఇస్తారు. సౌభాగ్య వర్ధిని అనే వ్యాఖ్యానంలో పై శ్లోకంలో పేర్కొన్న ఒక్కొక్క చక్రంలో ఉండే కిరణాలు అంటే మూలాధారంలో ఉండే 56 కిరణాలు, మణిపూరంలో ఉండే 52 కిరణాలు ఇలా మొత్తం 360 కిరణాల పేర్లు వివరించారు. వృత్తంలో 360 డిగ్రీలులా శరీరంలో ఈ 6 చక్రాలలో ఉన్న 360 కిరణాలు వీటిని మించిన అంటే అగ్ని సూర్య చంద్రుల కాంతికి మించిన కాంతి అమ్మవారి పాదాల నుండి ప్రసరించే కాంతి అని ఆదిశంకరుల వర్ణన. ఇది కూడా 11వ శ్లోకంలాగే గణిత శాస్త్రమున్న శ్లోకం.

శరజ్జ్యోత్స్నా శుద్ధాం శశియుత-జటాజూట-మకుటాం
వర-త్రాస-త్రాణ-స్ఫటికఘుటికా-పుస్తక-కరామ్ ।
సకృన్న త్వా నత్వా కథమివ సతాం సన్నిదధతే
మధు-క్షీర-ద్రాక్షా-మధురిమ-ధురీణాః ఫణితయః ॥ 15 ॥

తాత్పర్యం:

జననీ! శరత్కాలపు వెన్నెలవలె శుద్ధమై, చంద్రవంకగలిగిన జడల కిరీటముతోను, నాలుగు చేతులలో వరద ముద్ర, అభయ ముద్ర, స్ఫటికమాల, పుస్తకం ధరించే నీకు ఒకమారు భక్తితో నమస్కరించెడి బుద్ధిమంతులకు తేనె, పాలు, ద్రాక్ష రసమువంటి మాధుర్యముగల మాటతీరు రాకుండా ఎలా ఉంటుంది?

వ్యాఖ్యానం:

ఈ శ్లోకము దీని తరువాతి 6 శ్లోకముల అమ్మవారిని ధ్యానించే పద్ధతి చెప్పేవి. ఈ శ్లోకం దీని తరువాత రెండు శ్లోకాలు 'సారస్వత ప్రయోగం' అంటారు. అంటే మంచి కవిత్వం, వాక్కు రావడానికి విద్వత్తు కలగడానికి ఈ మూడు శ్లోకాలు నిలయం. ఇందులో మొదటి శ్లోకం ఇది.

మొదట అమ్మవారి వర్ణన. ఆమె శరత్కాలపు వెన్నెలవలె స్వచ్ఛంగా ఉంది. శరత్కాలం అంటే శారద రాత్రులు. శారద అంటే సరస్వతి, వాక్కుల తల్లి. వాక్కు ఎలా ఉండాలి, స్వచ్ఛంగా ఉండాలి. తరువాత చంద్రవం కగలిగిన జటాజూటం అంటే చంద్రుడు సౌమ్యుడు, మాట ఎలా ఉండాలి, సౌమ్యంగా ఉండాలి. జటాజూట మకుటం అంటే సరిగా బంధింపబడిన కవిత్వం ఉండాలి. పటుత్త్వం ఉండాలి. అమ్మవారి నాలుగు చేతుల్లో ఏమేమి ఉన్నాయి, వరద ముద్ర, అభయ ముద్ర, స్ఫటిక అక్షమాల, పుస్తకం ఉన్నాయి. పుస్తకం విద్యను తెలియజేస్తుంది, ఆమె వాగ్దేవి. అక్షమాల అంటే అ నుంచి క్ష వరకుగల అక్షరమాల, ఆమె అక్షరరూపిణి. మిగిలిన రెండు చేతులు వరం ఇచ్చేదొకటి, అభయం ఇచ్చేదొకటి. అటువంటి వాక్కుల తల్లికి, ఏం చేస్తే ఆమె ఆశీస్సులు ఉంటాయి, వంగి ఒకసారైనా నమస్కరిస్తే చాలట. అపుడామె ఎలాంటి పద చాతుర్యం ఇస్తుందో శంకరులు చెప్తారు, ఆమె 'మధు–క్షీర–ద్రాక్షా–మధురిమ' తేనె, పాలు, ద్రాక్షరసం వంటి తీయని పలుకులను ఇస్తుంది అంటారు. ఇది కవులకో పండితులకో మాత్రమే కాదు అందరికీ అవసరం అయిన మాట తీరు. కాళిదాసాదులకు నాలుకపై బీజాక్షరాలు వ్రాసిన పలుకుల తల్లి అమ్మవారు. ఈ శ్లోకం రోజూ సరిగా ఉచ్చారణ లోపం లేకుండా చదివితే అన్ని విద్యలు కరతలామలకం అవుతాయనడంలో సందేహం లేదు.

కవీంద్రాణాం చేతః కమలవన-బాలాతప-రుచిం
భజంతే యే సంతః కతిచిదరుణామేవ భవతీమ్ ।
విరించి-ప్రేయస్యా-స్తరుణతర-శృంగార లహరీ-
గభీరాభి-ర్వాగ్భిః ర్విదధతి సతాం రంజనమమీ ॥ 16 ॥

తాత్పర్యం:

అమ్మా! ఏ మహానుభావులు నిన్ను అరుణగా పూజిస్తారో, ఆ కవుల చిత్తములనే కమల వనానికి నీ వీక్షణలు బాలసూర్యుని కిరణాలు సోకినట్లు అయి, వారి వాగ్వైభవం, బ్రహ్మ ప్రేయసి అయిన సరస్వతి శృంగార లహరిలా ప్రవహించి, సహృదయులను రంజింపజేస్తుంది.

వ్యాఖ్యానం:

15వ శ్లోకంలో శరజ్జ్యోత్స్న – శరత్కాలపు వెన్నెలలా సౌమ్యంగా తెల్లని కాంతితో సాత్త్వికంగా ఉండే పద పటుత్వం కావాలంటే అమ్మవారిని ఎలా ధ్యానించాలో చెప్పి, ఈ శ్లోకంలో శృంగారలహరివంటి వాగ్వైభవం కలగాలంటే అమ్మవారిని ఏ రూపంలో ధ్యానించాలో చెప్తున్నారు ఆదిశంకరులు. 32 ఏళ్ల వయసు వరకే జీవించి తనదైన అనుభవాన్ని వాక్పటుత్వాన్ని మనకి అందిస్తున్నారు. ఆయన రచనలలో ఆధ్యాత్మికం, శృంగారం, నిర్దిష్టమైన పదునైన వాగ్వైఖరి చోటుచేసుకున్నాయి. ఆయా విద్యలు ఎలా లభిస్తాయో వారే ఆ రహస్యాన్ని 15-16-17 శ్లోకాలలో చెప్తున్నారు.

ఈ శ్లోకంలో అమ్మవారిని అరుణ రూపంలో ధ్యానించాలి, అలా ధ్యానిస్తే ఆమె కవీంద్రుల మనసనే కమలవనంలో లేత సూర్యుని కిరణాలలా ప్రసరించి, వాటిని వికసింపచేసి, వారికి శృంగార రసబంధురమైన వాక్ప్రవాహాన్ని ఇస్తుంది. అంతేనా? కాదు. అలా ధ్యానించిన వారి కవిత్వం మంచి యౌవనంలో ఉన్న సరస్వతి యొక్క శృంగార ప్రవాహం అంటారు శంకరులు. అది ప్రవహించి ఆగదు, ఆ ధ్యానం చేసిన వారిని వారినే సరస్వతీ రూపులుగా చేస్తుంది. అంటే

ఏఏ కవులు అరుణ రూపంలో ఉన్న అమ్మవారిని ధ్యానిస్తారో ఆయా కవులు పుంభావ సరస్వతులు అంటే పురుషరూపం పొందిన సర్వతులై విలసిల్లుతారు. అంతటి సారస్వత ప్రభావంగల శ్లోకం ఇది. మంచి వాక్కు కావాలనుకునే వారికి సౌమ్యమైన వాక్కు అయితే 15వ శ్లోకంలో చెప్పిన శరత్కాలపు వెన్నెలవంటి అమ్మవారిని, శృంగార బంధురమైన గంభీరమైన వాక్కు కావాలంటే అరుణ రూపంలో అమ్మవారిని ధ్యానించాలి.

సవిత్రీభి–ర్వాచాం శశి–మణి శిలా–భంగ రుచిభి–

ర్వశిన్యాద్యాభి–స్త్వాం సహ జనని సంచింతయతి యః ।

స కర్తా కావ్యానాం భవతి మహతాం భంగిరుచిభి–

ర్వచోభి–ర్వాగ్దేవీ–వదన–కమలామోద మధురైః ॥ 17 ॥

తాత్పర్యం:

ఓ జననీ ఎవడు వాక్కును సృజించువారును, చంద్రకాంతమణి శకలములలా ప్రకాశిస్తూ ఉండే వశిని మొదలగు వాగ్దేవతలతో బాటు నిన్ను ధ్యానిస్తాడో అటువంటివాడు వాగ్దేవి ముఖ కమలానికి ఆమోదమైన మాధుర్యం కలిగిన మహాకవుల రచనల వంటి కావ్యాలకు కర్త అవుతాడు.

వ్యాఖ్యానం:

ఇది కూడా సారస్వత ప్రయోగమే. ఇందులో అమ్మవారిని ఎలా ధ్యానిస్తే ఏం జరుగుతుందో ఆ రహస్యం వివరిస్తున్నారు ఆదిశంకరులు. సంస్కృతం – తెలుగు భాషలో 50 అక్షరాలున్నాయి. అవి 8 వర్గాలు

1. అచ్చులు 16 – మొదటి వర్గం – దీనికి అధిదేవత వశిని అనే వాగ్దేవత

2. క వర్గం 5 అక్షరాలు – అధిదేవత కామేశ్వరి అనే వాగ్దేవత

3. చ వర్గం 5 అక్షరాలు – మోదిని వాగ్దేవత

4. ట వర్గం 5 అక్షరాలు – విమల వాగ్దేవత

5. త వర్గం 5 అక్షరాలు – అరుణ వాగ్దేవత

6. ప వర్గం 5 అక్షరాలు – జయిని వాగ్దేవత

7. య వర్గం 4 అక్షరాలు – సర్వేశ్వరి వాగ్దేవత

8. శ వర్గం 5 అక్షరాలు –కౌళిని వాగ్దేవత

వశిన్యాది వాగ్దేవతలుగా అమ్మవారిని ధ్యానించమని ఈ శ్లోకం చెపుతుంది. అమ్మవారు సర్వ వర్ణాత్మిక. అ నుంచి క్ష వరకుగల అక్షరాల తల్లి. ఈ వాగ్దేవతలు 8 మందీ వాక్కును సృష్టించేవారు, మాటకు మాతలు. చంద్రకాంత శిల ముక్కలవలె కనులు చెదిరేటంత తెల్లని సాత్త్వికమైన కాంతి కలిగినవారు. అమ్మవారు మాతృకా వర్ణరూపిణి. అలా ఎవరు అమ్మవారిని ధ్యానిస్తారో వారి మాటల పరిమళం ఎలా ఉంటుందట – అమ్మవారి ముఖకమల సౌభాగ్యం గలిగి ఉంటుంది, ఆ కవులు వాల్మీకి కాళిదాసులవలె రచనలు చేయగలుగుతారు అని ఆదిశంకరులు స్వయంగా తానను భవించిన సత్యాన్ని మనకు అందిస్తున్నారు.

ఈ మూడు శ్లోకాలు మూడు లోకాలను జయించే వాక్శక్తిని ఇచ్చేవి.

తనుచ్ఛాయాభిస్తే తరుణ–తరణి–శ్రీసరణిభి–
ర్దివం సర్వా–ముర్వీ–మరుణిమనిమగ్నాం స్మరతి యః ।
భవంత్యస్య త్రస్య–ద్వనహరిణ–శాలీన–నయనాః
సహోర్వశ్యా వశ్యాః కతి కతి న గీర్వాణ–గణికాః ॥ 18 ॥

తాత్పర్యం:

ఎవడు ఉదయభానుని కిరణాల సంపద వంటి నీ శరీర కాంతిలోనే భూమి ఆకాశాలు మునిగి ఉన్నవిగా తెలుసుకొని నిన్ను ధ్యానిస్తాడో వానికి బెదురుతున్న లేడి కనులు కలిగిన ఊర్వశి వంటి దేవ వేశ్యలతో సహా ఎందరెందరో వశమౌతారు.

వ్యాఖ్యానం:

పైన చెప్పిన మూడు శ్లోకాలలో సారస్వత ప్రయోగం అంటే వాక్పటుత్వం, కవిత్వం, అమ్మవారి కరుణ వల్ల వాగ్దేవతల అనుగ్రహం ఎలా వస్తాయో చెప్పారు. ఈ శ్లోకం 13వ శ్లోకంలా వశీకరణ శక్తికి సంబంధించిన శ్లోకం. సంస్కృత భాషలో అనేక వ్యాఖ్యానాలలో లక్ష్మీధరుడు,

ఆనందగిరి మొదలైనవారు ఈ శ్లోకానికి ఇలాగే వ్యాఖ్య వ్రాశారు. అమ్మవారి అరుణిమయే ఈ సమస్త జగత్తును ఆవరించి ఉన్నది, భూమి ఆకాశాములలో నిండి ఉన్నది అని తెలుసుకున్న సాధకుడు అమ్మవారిని అరుణిమగా ధ్యానిస్తే ఆ సాధకునికి ఊర్వశితో సహా ఏ అప్సరసలవంటివారైనా బెదురుతున్న లేడి చూపులుగలవారై వశమవుతారట. అప్సరసలు అనిమేషులు అంటే కనురెప్ప వేయనివాళ్ళు. వాళ్ళు బెదురుచున్న లేడి చూపులుగలవారవుతారట. ఇందులో విశేషం ఏమిటంటే అమ్మవారి అరుణిమ రూపం కరుణాసముద్రం. ఆ రూపంలో ఆమెను ధ్యానం చేసిన వానికి లోకంలో అప్సరసలు సహితం అందంగా కనిపించరు. ఆయనకి వాళ్ళు వశం అవుతారుగాని ఆయన వారి సౌందర్యాన్ని కన్నెత్తి అయినా చూడని స్థితికి చేరుకుంటాడు. 13వ శ్లోకంలోలా ఇది వశీకరణ శ్లోకం. అమ్మవారు సర్వవశంకరి. అంటే సాధకుడు అమ్మవారి కృపవలన సర్వము తన వశంలో పెట్టుకునే ఇంద్రియ నిగ్రహాన్ని పొందుతాడు.

పైన 3 శ్లోకాలలో విద్వత్తునిచ్చి విద్యనిచ్చి విజ్ఞానాన్నిచ్చి దానిని నిలుపుకోగలిగే నిగ్రహాన్ని ఈ శ్లోకంలో చెపుతున్నారు ఆదిశంకరులు. శబ్దార్థాలు చూసి మోసపోకూడదు, దాని వెనుక ఉన్న ధ్వనిని చూడాలి. ఆదిశంకరులు స్వయముగా శంకరుల అవతారం గనుక ఇంతటి గాంభీర్యం ఉంటుంది శబ్దార్థాల వెనుక.

ముఖం బిందుం కృత్వా కుచయుగమధ-స్తస్య తదధో
హరార్ధం ధ్యాయేద్యో హరమహిషి తే మన్మథకలామ్ ।
స సద్యః సంక్షోభం నయతి వనితా ఇత్యతిలఘు
త్రిలోకీమప్యాశు భ్రమయతి రవీందు-స్తనయుగామ్ ॥ 19 ॥

తాత్పర్యం:

హరుని పట్టపురాణీ! బిందువును ముఖంగాను దాని క్రింద కుచములను, దాని క్రింద హరుని సగభాగమైన త్రికోణమును ఏ సాధకుడు నీ కామకళగా ధ్యానిస్తాడో అతను స్త్రీలకు కామవికారాన్ని కలిగిస్తాడు.

ఇది చాలా చిన్న విషయం, ఎందుకంటే అతను వెంటనే సూర్య చంద్రులే స్తనములుగాగల త్రిలోకాలను కూడా మోహింపగల సమర్ధుడౌతాడు.

వ్యాఖ్యానం:

ఈ శ్లోకం కూడా వశీకరణ శ్లోకమే. ఏ సాధకుడు అమ్మవారి కామకళా రూపాన్ని ధ్యానిస్తాడో అతనికి మామూలు స్త్రీలను వశీకరణం చేసుకోడం ఏమంత గొప్ప విషయం కాదు. ఆ సాధకుడు మొత్తం ముల్లోకాలను మోహింపజేస్తాడు అంటారు ఆదిశంకరులు. తంత్ర శాస్త్రంలో వామాచారం, దక్షిణాచారం అని రెండు మార్గాలున్నాయి. వామాచారులు శ్లోకంలో చెప్పిన పదాలను, అంటే ముఖాన్ని, కుచాలను, యోనిని పూజిస్తారు. అది క్షుద్రపూజ అని విద్వాంసుల అభిప్రాయం. అమ్మవారిని ధ్యానించేటప్పుడు ఆమెలో భూ, భువః, సువః అనే మూడు లోకాలను, లేదా పాతాళం, భూమి, స్వర్గం అనే ముల్లోకాలనుగా అమ్మవారి స్వరూపంగా ధ్యానిస్తే ఆ సాధకుడు మామూలు స్త్రీ వశీకరణ కాదు, మొత్తం ముల్లోకాలనే వశీకరణం చేసుకుంటాడు అని చెపుతున్నారు ఆదిశంకరులు. అమ్మవారు త్రైలోక్య మోహన చక్రస్వామిని. ఆ దృష్టితో చూడాలి ఈ శ్లోకాన్ని, ఇటువంటి బాహ్యామైన ఇంద్రియ లోలమైన వశీకరణ గురించి చెప్పే శ్లోకాలను.

కిరంతీ-మంగేభ్యః కిరణ-నికురుంబామృతరసం
హృది త్వా మాధత్తే హిమకరశిలా-మూర్తిమివ యః ।
స సర్పాణాం దర్పం శమయతి శకుంతాధిప ఇవ
జ్వరప్లుష్టాన్ దృష్ట్యా సుఖయతి సుధాధారసిరయా ॥ 20 ॥

తాత్పర్యం:

ఏ సాధకుడు నీ దేహము నుండి అమృతమును స్రవింపజేయు చంద్రకాంత శిలామూర్తిగా నిన్ను ధ్యానిస్తాడో, ఆ సాధకుడు గరుత్మంతునిలా పాముల దర్పాన్ని అణచగలడు. జ్వరంతో బాధపడుతున్నవారిని అమృతధారవంటి నాడిలా చూసినంతనే సుఖం కలిగించగలడు.

వ్యాఖ్యానం:

15-16-17 శ్లోకాలలో విద్వత్తు, రచనా పాటవం, సరస్వతీ కటాక్షం, 18-19 శ్లోకాలలో వశీకరణం అమ్మవారి అనుగ్రహంతో సాధకుడు పొందుతాడని చెప్పి, ఈ శ్లోకంలో విద్య కలిగి, జ్ఞానము కలిగి, ఇంద్రియ నిగ్రహం కలిగిన సాధకునికి అమ్మవారు ఇంకా ఎన్నో శక్తులను ప్రసాదిస్తుంది అని చెప్తున్నారు. ఆమె శక్తి, ఆమె ఇచ్చే శక్తులకు అంతేది? సాధకుడు అమ్మవారిని అమృతమును స్రవింపజేయు చంద్రకాంత శిలామూర్తిగా ధ్యానిస్తే అమ్మవారు అతనికి విషపూరితమైన పాము కరిచిన వానికి ప్రాణరక్షణ చేసే గరుత్మంతుడి శక్తిని ఇస్తుందట. జ్వరంతో బాధపడుతున్నవారికి చూస్తేనే సుఖం కలిగే శక్తిని ప్రసాదిస్తుందట. ఇక్కడ పాము పాము కాదు, జ్వరం జ్వరం కాదు. ఈ సర్పం సంసారమనే విషవలయం నుంచి అమృతధారలు కలిగించి రక్షించే శక్తి, భవ రోగాల నుండి ఉపశమనం కలిగించే శక్తిని ప్రసాదిస్తుంది.

జ్ఞానము, నిగ్రహము ముందు చెప్పి, ఇప్పుడు పరోపకారము చెప్తున్నారు ఆదిశంకరులు. ఏ శక్తి అయినా సహకరించేదిగా ఉపకరించేదిగా ఉండాలి, స్వార్థం కోసం ధనార్జన కోసం, స్త్రీలను వశపరచుకోడం చేస్తే అదే శక్తి ఆ సాధకుని భ్రష్టుని చేస్తుంది, అందుకే సర్పం అన్న మాట వాడారు. నహుషుడు ఇంద్రుడయినప్పుడు సప్తర్షులను తన పల్లకీ మోయమన్నాడట. వాళ్ళు మెల్లిగా వెళుతూ ఉంటె కొంచెం తొందరగా వెళ్ళమని సంస్కృతంలో 'సర్ప సర్ప' అన్నాడట. సప్తర్షులు ఆయనను సర్పం అవమని శపించారు. శక్తి దుర్వినియోగం చేస్తే భ్రష్టులవడం పురాణాలలో అనేక కథలలో చూస్తాం. ఈ శ్లోకం నిగ్రహానికి అనుగ్రహానికి సంకేతం.

తటిల్లేఖా-తన్వీం తపన శశి వైశ్వానర మయీం
నిషణ్ణాం షణ్ణామప్యుపరి కమలానాం తవ కలాం ।
మహాపద్మాటవ్యాం మృదిత-మలమాయేన మనసా
మహాంతః పశ్యంతో దధతి పరమాహ్లాద-లహరీమ్ ॥ 21 ॥

తాత్పర్యం:

జగజ్జననీ! మెరుపుతీగవంటి సన్నని ప్రకాశవంతమైనదియు, చంద్ర, సూర్య, అగ్ని మయమైనదియు, ఆరు కమలాలకు (షట్ చక్రాలకు) పైన ఉన్న పద్మముల వనంలో అంటే సహస్రారంలో ఉన్న నీ కళను (సాదాఖ్య కళ– శివునితో కూడినది) మాయా మోహాలకు అతీతమైన మనస్సుతో చూచిన మహాభాగులు పరమానంద లహరిలో ఓలలాడుచున్నారు.

వ్యాఖ్యానం:

ఈ శ్లోకము దీని తరువాతి శ్లోకము అమ్మవారిని అంతర్దృష్టితో ధ్యానిస్తే కలిగే ఆనందాన్ని చెపుతాయి.

14వ శ్లోకంలో చెప్పిన విషయాన్ని ఇక్కడ ఒకసారి గుర్తు చేసుకుందాం

మూలాధారం – స్వాధిష్టానం ఒక ఖండం – దీనికి అగ్ని స్థానం – రుద్రగ్రంధి

మణిపూరక అనాహతాలు ఒక ఖండం, దీనికి సూర్యుడు స్థానం – విష్ణు గ్రంధి

విశుద్ధి ఆజ్ఞా చక్రాలు ఒక ఖండం – చంద్రుడు స్థానం – బ్రహ్మ గ్రంధి

మూడు ముడులు, ఒకటి బ్రహ్మ ముడి, రెండోది విష్ణు గ్రంధి, మూడోది రుద్ర ముడి. ఒక్కొక్క దానిలో రెండు చొప్పున 3×2=6 చక్రాలు. వరుసగా చంద్రుడు, సూర్యుడు, అగ్ని ఉంటాయి. ఈ ఆరు కమలాలను దాటిన తరువాత ఒక పద్మ వనం ఉంది అదే సహస్రారం, వేయి రేకుల పద్మం. అదే బిందు స్థానం. అక్కడే అమ్మవారు శివునితో కలిసి ఉంటుంది. 15–19 శ్లోకాలలో విద్య, నిగ్రహము చెప్పి ఈ శ్లోకంలో నిగ్రహం కలిగి విద్య వలన జ్ఞానము పొంది, మాయా మోహాలకు అతీతులైనవారు అమ్మవారిని ఆ బిందువులో చూడగలుగుతారని చెబుతున్నారు. అమ్మవారు అక్కడ మెరుపు తీగవలె, అగ్ని సూర్యచంద్రులతో కలసి సాదాఖ్య అనే కళతో ఉంటుంది. ఆమెను చూడడానికి అర్హులైనవారు, ఇంద్రియాలకు అతీతులై, నిరామయులై, ఏ కోరికలు లేనివారైనవారు. శరీరం మీద, బంధాల మీద, బాహ్య ప్రపంచం మీద ధ్యాస లేని అట్టి యోగులకు అమ్మ ఆ విధంగా కనిపిస్తుంది, అదీ ఎంతసేపు – మెరుపుతీగవలె, అంతసేపు.

వారేమి అనుభవిస్తారు ఆ సాదాఖ్య కళలో అమ్మవారిని చూసి అంటే శంకరులంటారు వారు పరమానందలహరిని అనుభావిస్తారట.

భవాని త్వం దాసే మయి వితర దృష్టిం సకరుణాం
ఇతి స్తోతుం వాంఛన్ కథయతి భవాని త్వమితి యః ।
తదైవ త్వం తస్మై దిశసి నిజసాయుజ్య-పదవీం
ముకుంద-బ్రహ్మేంద్ర స్ఫుట మకుట నీరాజితపదామ్ ॥ 22 ॥

తాత్పర్యం:

అమ్మా భవానీ! 'నీ దాసుడనైన నాపై నీ కరుణ కటాక్షాలు చూపించు' అని కోరుకుందామని ప్రార్థిద్దామని 'భవానీ నువ్వు' అని అనేలోపునే వారికి హరి, బ్రహ్మ, ఇంద్రాదుల కిరీటములతో హారతి పట్టే నీ పద సాయుజ్యాన్ని ప్రసాదిస్తావు.

వ్యాఖ్యానం:

అమ్మవారి కటాక్షం ఎలాంటిదో చెప్పే శ్లోకం ఇది. భక్తిలో భక్తుడు నాలుగు దశలు పొందుతాడు,

1. సాలోక్యం – అమ్మవారిని చూడగలగడం
2. సామీప్యం – అమ్మవారికి చేరువైన భావన కలగడం
3. సారూప్యం – అమ్మవారి రూపమే తాననుకోవడం
4. సాయుజ్యం – అమ్మవారిలో లీనమైపోవడం.

అమ్మవారెంతటి కరుణగలదంటే భక్తుడు, అమ్మా! నేను నీ దాసుడిని, నాపై నువ్వు కరుణ చూపు అని అడుగుదామని 'అమ్మా నువ్వు' అని ఇంకా వాక్యం పూర్తి కాక ముందే అమ్మవారు బ్రహ్మేంద్రాదులచే నమస్కరింపబడి, వారి కిరీటమణుల కాంతులచే ప్రకాశిస్తున్న, ఆమె పాదాలలో లీనమయ్యే సాయుజ్యాన్ని ప్రసాదిస్తుందట. ఇంకా పూర్తిగా కోరనేలేదు, ఆమె అడిగినదానికంటే ఎక్కువే ఇస్తుంది. ఎందుచేత. పై శ్లోకంలో తటిల్లత అంటే మెరుపుతీగ అని వర్ణించారు గదా, ఆ గుణమే ఆమె కరుణలోనూ ఉంది. కోరేలోపునే కోరికలు కోరినదానికంటే ఎక్కువగా ఇచ్చే తల్లి.

త్వయా హృత్వా వామం వపు-రపరితృప్తేన మనసా
శరీరార్ధం శంభో-రపరమపి శంకే హృతమభూత్ ।
యదేతత్ త్వద్రూపం సకలమరుణాభం త్రినయనం
కుచాభ్యామానమ్రం కుటిల-శశిచూడాల-మకుటమ్ ॥ 23 ॥

తాత్పర్యం:

తల్లీ! నీ రూపమంతా అరుణకాంతితో ఉన్నది, మూడు కన్నులు కలిగి ఉన్నది, స్తనభారం వల్ల కొంచెం వంగి ఉన్నది, తలపై నెలవంక ఉన్నది, ఇవన్నీ చూస్తూ ఉంటే నువ్వు శివుని ఎడమభాగం గ్రహించినా సంతృప్తి పొందక మిగిలిన భాగాన్ని కూడా ఆక్రమించేవేమో అని సందేహం కలుగుతోంది.

వ్యాఖ్యానం:

ఆదిశంకరుల వారి కవిత్వానికి ఒక చక్కని రసమయమైన ఉదాహరణ ఈ శ్లోకం. అమ్మవారు అరుణ కాంతిలో ఉంటుంది, అయ్యవారు తెలుపు. ఆమె ఎడమ భాగం, ఈయన కుడి భాగం, కాని అమ్మవారిని చూస్తే మొత్తం అంతా అరుణంగా ఉంటుంది, మూడు కన్నులుంటాయి, తలపై నెలవంక ఉంటుంది, స్తనభారం వల్ల కొంచెం వంగి ఉంటుంది. మరి ఈ అర్థనారీశ్వర తత్త్వంలో శివుడెక్కడ? ఆదిశంకరులు చమత్కరిస్తున్నారు, అమ్మా! నువ్వు ఎడమ భాగంతో సరిపెట్టుకోకుండా మొత్తం అపహరించినట్టున్నావు అన్నారు. ఇందులో రహస్యం ఏమిటంటే మొదటి శ్లోకంలో చెప్పినట్టు శక్తి లేనిదే శివుడు లేడు. అసలు వారిద్దరా.. ఒకరా అంటే ఇద్దరూ ఒకరే అని సమాధానం. ఇది శంకరులవారికి కలిగిన శంక. ఉత్తర కౌళం అని ఒక శాక్తేయ మతం ఉన్నది. అందులో శివునికి వేరే అస్తిత్త్వం లేదు. అంతా శక్తిమయమే. ఈ శ్లోకంలో మన సంప్రదాయంలో స్త్రీకి ఉన్న ఉన్నతమైన స్థానం సూచించారు శంకరులు. కేరళ దేశంలో జన్మించినవారు, అక్కడ మాతృస్వామ్యమే సంప్రదాయం. శక్తి, అమ్మవారి మతమూ అదే కదా –

జగత్సూతే ధాతా హరిరవతి రుద్రః క్షపయతే
తిరస్కుర్వ-న్నేతత్ స్వమపి వపు-రీశ-స్తిరయతి ।
సదా పూర్వః సర్వం తదిద మనుగృహ్ణాతి చ శివ-
స్తవాజ్ఞా మాలంబ్య క్షణచలితయో ర్భ్రూలతికయోః ॥ 24 ॥

తాత్పర్యం:

అమ్మా! బ్రహ్మ జగత్తును సృష్టిస్తున్నాడు, విష్ణువు పాలిస్తున్నాడు, రుద్రుడు నశింపజేస్తున్నాడు. ఈశ్వరుడు ఈ మూడింటిని తనయందు అంతర్ధానము చేస్తున్నాడు. మరల సదాశివుడు నీ కనుబొమ్మల కదలిక మాత్రం చేత నీ ఆజ్ఞచే మళ్ళీ ఇవన్నీ సృజిస్తున్నాడు.

వ్యాఖ్యానం:

ఇది యొక విచిత్రమైన శ్లోకము, పైకి సులభముగా కనిపించి లోపల అంతరార్థమును నిక్షేపించినారు ఆదిశంకరులు. ఈ సృష్టి, స్థితి, ప్రళయము, తిరోధానము, అనుగ్రహము అనునవి ఐదు పనులు. అమ్మవారు పంచకృత్య పారాయణ. బ్రహ్మచే సృష్టి చేయించి, విష్ణువుచే దాని స్థితిని ఏర్పరచి, రుద్రునిచే అది లయము గావించి, తిరోధానము అనగా తనయందు లీనమగునట్లు చేసి, తిరిగి అమ్మవారి అనుగ్రహముచే ఈ నాలుగు తిరిగి ప్రారంభమై జరుగుతాయి. ఇందులో శంకరులు లయకారునిగా రుద్ర శబ్దం ఉపయోగిస్తారు. తిరిగి తిరోధానం అయ్యాక తనలో లీనం చేసుకునే శివునికి 'సదా శివ' అన్న పదం ఉపయోగిస్తారు. సృష్టి స్థితి ప్రళయం అయిపోయినా ఎప్పుడూ ఉండేవాడు లయకారుడు 'సదా' అన్న శబ్దం చేత మనకు అర్థం అవుతుంది, ఆయన శివుడు అనలేదు, సదాశివుడు అన్నారు శంకరులు. ఎలా తిరిగి ఈ సృష్టి చక్రం తిరుగుతుంది అంటే శంకరులు అమ్మవారి కనుబొమ్మల కదలిక మాత్రం చేత ఆమె ఆజ్ఞ చేత అని చెప్తారు, అక్కడ ఒక సుందర లలిత మధురమైన పదం 'భ్రూలతికయోః' భ్రూ అంటే కనుబొమలు, అవెలా ఉన్నాయి.. లతికవలె అంటే లేత తీగలవలె వాటిని కదిల్చినంతనే అది ఆమె ఆజ్ఞగా గ్రహించి,

అమ్మ అనుగ్రహంగా గ్రహించి తిరిగి సృష్టి చక్రం ప్రారంభించడానికి సదాశివుడు తనలో లీనమైనవాటిని పునః వదిలిపెడతాడు.

పై శ్లోకంలో అమ్మవారే శివుని మిగిలిన అర్థభాగాన్ని హరించారని చమత్కరించిన శంకరులు, ఇక్కడ ఆ సదాశివుని పదప్రయోగంతో వారుభయుల ఏకత్వాన్ని గుర్తుచేస్తున్నారు.

త్రయాణాం దేవానాం త్రిగుణ-జనితానాం తవ శివే
భవేత్ పూజా పూజా తవ చరణయో-ర్యా విరచితా।
తథా హి త్వత్పాదోద్వహన-మణిపీఠస్య నికటే
స్థితా హ్యేతే-శశ్వన్ముకులిత కరోత్తంస-మకుటాః ॥ 25 ॥

తాత్పర్యం:

మూడు గుణాల నుంచి జన్మించిన త్రిమూర్తులకు నీ పాదాలకు చేసే పూజయే పూజ. అది యుక్తమైనదే.. ఎందుకంటే నీ పాదములచే అలంకరించబడిన మణిపీఠము దగ్గర ఎల్లవేళల ముకుళితహస్తాలే కిరీటంగా త్రిమూర్తులుంటారుగనుక.

వ్యాఖ్యానం:

ఈ శ్లోకంలో అమ్మవారిని పూజిస్తే వేరుగా బ్రహ్మ, విష్ణు, శివులను పూజించనవసరం లేదు అంటారు ఆది శంకరులు. ఎందుకంటే వారు, అమ్మవారు వేరు కాదు అని భావం. ఏది తెలుసుకుంటే అన్నీ తెలిసినట్లవుతుందో, అది తెలిసిన తరువాత వేరువేరుగా ఒక్కొకటి తెలుసుకోవలసిన అవసరం ఉండదు కదా. త్రిమూర్తులు అమ్మవారి రూపమే, ఆమె చెప్పిన పనులు చేసేవారే, ఆమె నుండి ఉద్భవించినవారే, గుణాతీతమైన అమ్మవారి త్రిగుణాల నుండి త్రిమూర్తులు ఉద్భవించారు. అందరు దేవతలకు మూలమైన తల్లిని ప్రార్థిస్తే అందరిని పూజించినట్టే కదా. అమ్మవారి పద పద్మాల వద్ద ముకుళించిన చేతులు తలపై నుంచి నమస్కరించే త్రిమూర్తులకు ఆమెకు చేసిన పూజయే పూజ, వేరే పూజ అవసరం లేదని భావం.

విరించిః పంచత్వం వ్రజతి హరిరాప్నోతి విరతిం
వినాశం కీనాశో భజతి ధనదో యాతి నిధనమ్ ।
వితంద్రీ మాహేంద్రీ-వితతిరపి సంమీలిత-దృశా
మహాసంహారేఽస్మిన్ విహరతి సతి త్వత్పతి రసౌ ॥ 26 ॥

తాత్పర్యం:

అమ్మా సతీమతల్లీ ! మహాప్రళయంలో బ్రహ్మ పంచభూతాలలో కలిసిపోతాడు. విష్ణువు చైతన్యరహితుడౌతాడు. యముడు నశిస్తాడు, కుబేరుడు మరణిస్తాడు, ఇంద్రుడు, అతని పరివారమూ నిద్రాణమౌతుంది, కానీ నీ భర్త అయిన సదాశివుడు మాత్రము విహరిస్తూ ఉంటాడు.

వ్యాఖ్యానం:

పరమేశ్వరికి కామేశ్వర కామేశ్వరి అని పరమేశ్వర పరమేశ్వరి అని శివునికి సాంబ సదాశివుడని కొన్ని పేళ్లు. ఆమె లేకుండా ఆయన లేడు. ఆయన స- అంబ అంటే అమ్మవారితో కూడిన సదా ఎల్లప్పుడూ ఉండే శివుడు అని అర్థం. అంటే ఏమిటి? ప్రపంచం అంతా నశించినపుడు, లేదా ప్రళయకాలంలో అన్ని స్తంభించిపోతాయి, ఆగిపోతాయి, అప్పుడు విరించి అంటే లోకాలలో సృష్టిని విరచించే ఆయన పంచత్వం అంటే పంచభూతాలలో కలిసిపోతాడు. స్థితికారుడైన విష్ణువు విరతిని పొందుతాడు అంటే ఆగిపోతాడు. ఇక్కడ ఆదిశంకరులు యముడికి ఒక పదం ఉపయోగిస్తారు, కీనాశుడు అని. ఏది నాశనం చెయ్యడు అని ప్రశ్నిస్తే ఏదైనా సరే నాశనం చేసేవాడు కీనాశుడు, ఆయనే స్వయంగా నశించిపోతాడట. అప్పుడు ధనం ఎవరికి కావాలి.. అలాంటి సమయంలో ధనదుడు అంటే ధనాన్నిచ్చే కుబేరుడు నిధనం అవుతాడట. ఆ పదాల పొందిక గమనించండి, ఒక్కొక్కరికి ఒక్కొక్క పదం అందులోనే వారి అస్తమయం. అదీ శంకరుల పద పాటవం. ఎంతో గొప్పవాడైన ఇంద్రుడు, మహేంద్రుడు ఆయన పరివార సమేతంగా వితంద్రీ అంటే చేష్టలుడిగి నిద్రాణమైపోతారట. అయితే ఈ మహా సంహారంలో ఒక్క ఆయన మాత్రం

విహరిస్తున్నాడు, ఎవరాయన, అమ్మవారి పతి, అందుకే ఆయనకి సదా – శివుడు అని పేరు. ఇంత మహాసంహారంలో ఆయనొక్కడే ఎలా ఎందుకు ఉన్నాడు అని ప్రశ్నిస్తే దానికి ఆఖరి పాదంలో రెండక్షరాల పదం ఒకటి ఉపయోగించారు ఆదిశంకరులు. 'సతి' అని మహా పతివ్రత అని అర్థం. ఆమె పతివ్రత అయితే ఆయన ఉండాలి కదా. ఆ ప్రశ్నకు ఆదిశంకరుల రెండక్షరాల సమాధానం అది. జగదేక మంగళ రూపిణి, సర్వమంగళ అమ్మవారు, అది అమ్మవారి మాంగల్య బలం.

జపో జల్పః శిల్పం సకలమపి ముద్రావిరచనా
గతిః ప్రాదక్షిణ్య-క్రమణ-మశనాద్యా హుతి-విధిః ।
ప్రణామః సంవేశః సుఖమఖిల-మాత్మార్పణ-దృశా
సపర్యా పర్యాయ-స్తవ భవతు యన్మే విలసితమ్ ॥ 27 ॥

తాత్పర్యం:

దేవీ! నేను ఆడే మాటలు నీకు జపముగా, నేను చేసే పనులు నీకు పూజా విధానముగా, నేను నడిచే నడక నీకు ప్రదక్షిణముగా, నేను తినే ఆహారము నీకు ఆహుతిగా, నా నిద్రలో కదలికలే నీకు సాష్టాంగ నమస్కారాలుగా, నేననుభవించే సుఖవిలాసాలు నీకు పరిచర్యలుగా, ఇవన్నీ ఆత్మార్పణ బుద్ధితో నేను చేసే పూజలుగా అగుగాక!

వ్యాఖ్యానం:

ఆదిశంకరులవారు ఎంతటి మహోన్నతమైన భావనను అలతి అలతి మాటలతో చెప్పగలరో ఈ శ్లోకం దానికొక ఉదాహరణ. ఈ శ్లోకం మాహాజ్ఞానులకు, మూఢ భక్తులకు ఇద్దరికీ వర్తిస్తుంది. అక్షరంలో ఆశ్చర్యాన్ని పొందుపరచిన లోకోత్తరమైన భక్తి జ్ఞాన వైరాగ్యముల సమ్మేళనం ఈ శ్లోకం.

అమ్మవారి ఎదుట పసివాని ప్రలాపం. భక్తుడు తల్లితో చెప్పుకొనే సల్లాపం. జ్ఞానులు, యోగిపుంగవులు అమ్మతో మాట్లాడే పద్ధతి అదీ ఈ శ్లోకం.

నేను సంసారిని, మంత్ర తంత్రాలు, ముద్రలు, పూజా విధానాలు, ఎరుగను. నాకు జపతపాదులు తెలియవు, ఎదో ఎవరితోనో మాట్లాడితే, వాళ్ళతో మాట్లాడునపుడు కనులు మూసి తెరిస్తే, తల్లీ అదే జపంగా భావించు.

అమ్మవారు దశముద్రలతో పూజింపబడే దేవత, నాకా ముద్రలేమీ తెలియవు, లోక వ్యవహారంలో నేను ఏవో పనులు చేస్తూ, చేతులు త్రిప్పుతూ ఉంటాను, అవే ఆ శిల్పమే ఆ ముద్రలే అనుకో తల్లీ!

నేను పనులు చేసుకోడానికి నడవడం, ఒక్కో చోటికి వెళ్ళడం, కొన్నిటి కోసం అదే పనిగా తిరగడం, చేస్తూ ఉంటాను, అమ్మా! అదే నీకు నే చేసే ప్రదక్షిణం అనుకో.

శరీరాన్ని పోషించుకోడానికి వేళవేళలా ఎదో ఒకటి తినడమో, త్రాగడమో, చేస్తూ ఉంటాను, నాకు హోమాలు చెయ్యడం రాదు. అదే నేను చేసే హోమంగా భావించు నేను తిన్న తిండే హవిస్సు.

రోజూ నిద్రపోతాను, అందులో ఎన్నెన్నో భంగిమలు, అవే నేను నీకు చేసే సాష్టాంగ ప్రణామంగా భావించు.

ఇంకా కొన్ని-కొన్ని వేళలలో ప్రత్యేకంగా సుఖం పొందుతూ ఉంటాను, ఏవో ద్రవ్యాలు ఉపయోగించి ఈ శరీరాన్ని సుఖ పెడుతూ ఉంటాను, అవన్నీ నీకు నే చేసే పరిచర్యలుగా భావించు. అన్నీ నే చేసే అత్మార్పణమైన సేవలుగా భావించు తల్లీ అని భక్తుడు అమ్మవారితో నివేదిస్తున్నాడు.

ఇది ఒక అర్థం. లక్ష్మీధర పండితులు జ్ఞానులకు జీవన్ముక్తులకు అమ్మవారిని బయట మామూలుగా పూజ చేయవలసిన అవసరం ఉండదు. వాళ్ళు అమ్మవారిలో లీనమైన యోగులు. వాళ్ళు చేసే పనులు పైన చెప్పినవన్నీ అమ్మవారికే సపరిచర్యలు. అంతర్ముఖ పూజా విధి ఇది అంటారు. ఇంకో అర్థం సౌభాగ్యవర్ధిని వ్యాఖ్యానంలో చెప్తారు. శ్రీచక్రంలో 9 ఆవరణలు. ఈ మానవ శరీరం 9 రంధ్రాలున్న నవరత్న ద్వీపం. ఇదే

దేవాలయం. మన సంకల్పములే కల్పవృక్షాలు, ఈ నాలుకతో మనం అనుభవించే 6 రుచులు 6 ఋతువులు. జ్ఞానమే అర్ఘ్యము, నవరసములే అష్టసిద్ధులు. ఇలా 9 రసాలను 8 సిద్ధులనడంలో విశేషం ఏమిటంటే, శ్రీవిద్య ప్రకారం సిద్ధులు పది, ఇక్కడ సంఖ్యతో కాకుండా భావనతో చూడాలి. ఇలా దేహమే దేవాలయం అందులోనే అమ్మవారున్నది అనే భావన ఉన్నవారు, చేసే ప్రతి పని పవిత్రంగానే ఉంటుంది, అన్నీ ఆమెకే సమర్పణం అవుతాయి.

ఈ శ్లోకం ఇంత అర్థాన్ని కడుపులో ఉంచుకుని పైకి సామాన్యంగా కనిపించే అద్భుతమైన రచన.

సుధామప్యాస్వాద్య ప్రతి-భయ-జరామృత్యు-హరిణీం
విపద్యంతే విశ్వే విధి-శతమఖాద్యా దివిషదః ।
కరాలం యత్ క్ష్వేలం కబలితవతః కాలకలనా
న శంభోస్తన్మూలం తవ జనని తాటంక మహిమా ॥ 28 ॥

తాత్పర్యం:

జననీ! మిక్కిలి భయంకరమైన ముసలితనాన్ని మృత్యువును పోగొట్టేది అయిన అమృతాన్ని సేవించిన బ్రహ్మ ఇంద్రాది దేవతలందరూ కూడా కాలానికి వశులై, పోతున్నారు. కాని కఠోరమైన కాలకూట విషాన్ని త్రాగిన శివుడు మాత్రం కాలానికి లొంగడం లేదు, దానికి కారణం నీ చెవికమ్మల మహిమ గదా!

వ్యాఖ్యానం:

ఒక్కొక్క శ్లోకం ఒక అద్భుత రచన, ఒక అనర్ఘరత్నం, గనుకనే ఇది సౌందర్య లహరి. దేవతలందరూ అమృతం తాగారు. శివుడు కాలకూట విషం తాగాడు. ప్రళయ కాలంలో వాళ్ళు నశిస్తున్నారు, ఈయన చెక్కుచెదరక ఉన్నాడు. ఏమిటి విశేషం? ఆదిశంకరులంటారు, అమ్మా! అది నీ మాంగల్యం చలువ అనే మాటనే నీ చెవికమ్మల మహిమ అన్నారు. పోతనగారు సుమారుగా ఈ శ్లోకానికి భావానువాదం చేశారు

భాగవతంలో. దేవతలందరూ పాలకడలిలో వచ్చిన అన్ని ఐశ్వర్యాలూ పంచుకున్నారు. కాలకూట విషం హాలాహలం వచ్చింది. వెళ్లి శివుడిని ప్రార్థించారు. ఆయన ఒప్పుకున్నాడు, అమ్మవారిని ఓసారి అడిగాడట, త్రాగమంటావా అని. ఆమె అందట..

మ్రింగెడివాడు విభుండని
మ్రింగెడిదియు గరళమనియు మేలని ప్రజకున్
మ్రింగమనె సర్వమంగళ
*మంగళసూత్రంబునెంత మదినమ్మినదో.. **8-241***

అమ్మవారే త్రాగమందట ఆమె సర్వమంగళ. లోకంలో అందరికీ ఐదోతనాన్నిచే ముత్తైదువు.

ఇందులో శంకరులవారు అమ్మవారి చెవికమ్మల మహిమ అని ఎందుకన్నారంటే ఆమె తాటంకములు సూర్యమండలం, చంద్రమండలం. కాలాన్ని నిర్దేశించే రెండు మండలాలు రెండు కుండలాలు. కాలగమనమే ఆమె నిర్దేశంలో ఉన్నది కదా.

కిరీటం వైరించం పరిహర పురః కైటభభిదః
కఠోరే కోటీరే స్ఖలసి జహి జంభారి-మకుటమ్ ।
ప్రణమ్రే ష్వేతేషు ప్రసభ-ముపయాతస్య భవనం
భవస్యభ్యుత్థానే తవ పరిజనోక్తి-ర్విజయతే ॥ 29 ॥

తాత్పర్యం:

అమ్మా భవానీ! నీ పతికి ఎదురువెళ్లి స్వాగతం పలికే తొందరలో దారిలో నీకు సాష్టాంగం చేస్తున్న బ్రహ్మ కిరీటం ఉంది చూసుకో, కైటభుని వైరి అయిన విష్ణుని కఠోరమైన కిరీటం ఉంది జాగ్రత్త, జారిపోతావేమో, ఇంద్రుని ముకుటం చూసుకో, అని నీ పరిజనం చేసే హెచ్చరికలు ఉత్తమంగా ఉన్నాయి.

వ్యాఖ్యానం:

అమ్మవారు కొలువుతీరియున్నది. పరిజనం ఆమె ఎదుట ఉన్నారు.

బ్రహ్మ, విష్ణువు, ఇంద్రాది దేవతలు ఆమెకు సాష్టాంగ పడి నమస్కరిస్తున్నారు. ఇంతలో శివుడు వస్తున్నాడని పరిజనం అమ్మవారికి తెలియజేశారు. ఆమె తత్తరంగా అయ్యవారికి ఎదురువెళ్ళి స్వాగతం పలకబోతోంది. అప్పుడు చెలికత్తెలు ఆమెకు హెచ్చరిక పలుకుతున్నారు, అమ్మా! కాస్త చూసుకు నడువు, నీ మార్గంలో బ్రహ్మగారి కిరీటం ఉంది, విష్ణువు వజ్రకిరీటం ఉంది, ఇంద్రాది దేవతల కిరీటాలున్నాయి అని.. ఈ దృశ్యాన్ని ఆదిశంకరులు చూసినట్టుగా వర్ణిస్తున్నారు. దీనిని సంస్కృతంలో ఉదాత్తాలంకారం అంటారు. సమృద్ధిగా వస్తువును వర్ణించడం ఈ అలంకారం లక్షణం. అమ్మవారికి తానెంత జగజ్జనని అయినా అయ్యవారికివ్వవలసిన గౌరవం ఇవ్వడం సూచించే ఈశ్లోకం ఆమెకు అలంకారం!

స్వదేహోద్భూతాభి-ర్ఘృణిభి-రణిమాద్యాభి-రభితో
నిషేవ్యే నిత్యే త్వా మహమితి సదా భావయతి యః ।
కిమాశ్చర్యం తస్య త్రినయన-సమృద్ధిం తృణయతో
మహాసంవర్తాగ్ని-ర్విరచయతి నీరాజనవిధిం ॥ 30 ॥

తాత్పర్యం:

నిత్యా! బాగుగా సేవింపదగిన తల్లీ! నీ నుండియే ఉద్భవించెడి కిరణములతో, అణిమాది అష్ట సిద్ధులతోయున్న నిన్ను 'నీవే నేను' అను భావనతో ఎల్లవేళలా ధ్యానము చేసెడి సాధకునికి ముక్కంటి ఇచ్చే ఐశ్వర్యము గడ్డిపోచవంటిది. అట్టివానికి మహాప్రళయాగ్ని ఆరతి పడుతుందంటే ఆశ్చర్యమేముంది!

వ్యాఖ్యానం:

అమ్మవారిని ఎవరికీ తోచిన విధంగా వారు ధ్యానించవచ్చు. అందరికీ మంత్ర తంత్రాలు తెలియాలని లేదు. 27వ శ్లోకంలో చెప్పినట్టు, మనం ఏం చేసినా అది అమ్మవారి పూజే, అనుకుని భక్తితో చెయ్యాలి. భక్తి ప్రధానం, పద్ధతి కాదు. అయితే ఎవరు ఎంత చేస్తే వారికి అంతే దక్కుతుంది, అది పూజయినా, నిత్యం లోకంలో మనం చేసే యే పనయినా అంతే.

అమ్మవారు ఎవరు, ఆమె శక్తి ఏమిటి, జగజ్జనని అయిన ఆమెను ఎలా ధ్యానిస్తే ఏం జరుగుతుంది అని కొంచెం తెలుసుకు చేస్తే సాధకునికి కావలసిన ఫలితాలు లభిస్తాయి. అసలు ఏదైనా కోరికతో అమ్మవారిని పూజించాలా, ఏ కోరికా లేకుండా పూజించాలా అంటే రెండోదే గొప్ప మార్గం. మనకేం కావాలో ఆమెకు తెలీదా. అడిగి కొంచెం అడిగిందే పొందే బదులు అడగకుండా ఆమె ఏం ఇస్తే అదే పుచ్చుకోవచ్చు కదా.

ఆ ప్రశ్నలకే అటువంటి సందేహాలకే ఒక గొప్ప సమాధానం ఈ శ్లోకం. అమ్మవారిని ఆదిశంకరులు 'నిత్యే' అని సంబోధిస్తున్నారు. ఆమె శాశ్వతమైనది, ఆది మధ్య అంత రహితమైనది. నిషేవ్యే అని ఇంకో పదంతో ఆమెను సంబోధిస్తున్నారు. అంటే చక్కగా సేవింపదగినది. ఆమె శరీరం నుండి వెలువడే కాంతి కిరణాలవల్ల అష్ట సిద్ధులు కలుగుతాయి. శ్రీవిద్య ప్రకారం సిద్ధులు 10. అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ఈశిత్వ, వశిత్వ, ప్రాకామ్య, భుక్తి, ఇచ్ఛా, ప్రాప్తి సిద్ధులు, ఇవి అన్ని కోరికలను తీర్చే సిద్ధులు. ఇవికాక ఒక్కొక్క ఆవరణలో ఎన్నో యోగినీ దేవతలుంటారు, 9 ఆవరణలు. ఆమె చుట్టూ 64 మంది యోగినులు ఉంటారు. అలాంటి తల్లిని, నువ్వే నేను, అని భావించి ధ్యానించే సాధకుడు ఆమెలో ఏకమైపోతాడు, లీనమైపోతాడు, తాదాత్మ్యం చెందుతాడు. అటువంటి వానికి కోరికలుండవు, మిగిలిన ఐహికమైన లక్షణాలన్నీ ఉడిగిపోతాయి. అటువంటి వానికి ఏ ఐశ్వర్యమూ అక్కరలేదు, అంతా గడ్డిపోచతో సమానం. ఈశ్వరుడు ఇస్తాడు గనుక భోగభాగ్యాలకు, సంపదలకు ఐశ్వర్యం అని పేరు. అది అతనికి తృణప్రాయం, అంటే గడ్డిపోచ. అటువంటి సాధకునికి ప్రళయాగ్ని కూడా నీరాజనంతో సమానం. ఆ స్థాయికి చేరాలంటే అమ్మ ఒడిలో ఒదిగిపోవాలి. నీవేనేననే భావన, అనుకున్నంత సులభమైన ప్రక్రియ కాదు. ఎన్నో జన్మల సంస్కారం కావాలి. అది ఆదిశంకరులు ఈ శ్లోకంలో వివరించారు.

చతుః-షష్ట్యా తంత్రైః సకల మతిసంధాయ భువనం
స్థితస్తత్తత్-సిద్ధి ప్రసవ పరతంత్రైః పశుపతిః ।
పునస్త్వ-న్నిర్బంధా దఖిల-పురుషార్థైక ఘటనా-
స్వతంత్రం తే తంత్రం క్షితితల మవాతీతర-దిదమ్ ॥ 31 ॥

తాత్పర్యం:

తల్లీ! పశుపతి మొదట అరవైనాలుగు తంత్రాలు రచించి, అన్ని భువనాలను మోహింపజేశాడు. ఆ తంత్రాలు ప్రయోజనం కలిగించేవే, అని స్థిమితంగా ఊరుకున్నాడు. మరల నీ నిర్బంధంవలన అన్ని పురుషార్థాలను ఇవ్వగలిగే నీ శ్రీవిద్యాతంత్రాన్ని, భూమిపైనున్నవారి కోసం, సృజించాడు.

వ్యాఖ్యానం:

మనం ఎదో పూజ చేస్తాం. అమ్మవారు శక్తి గనుక ఆమె కొన్ని శక్తులు మనకు తెలియకుండానే వస్తాయి. అవే గొప్పవనుకుని అక్కడే ఉండిపోతే అది అక్కడితో సరి. ఇది మోహం. ఆకలేస్తోంది, ఎదో ఒకటి కనిపించింది, ఆకలి తీరదు కాని అది తినాలనిపిస్తుంది. అలా చిరుతిళ్ళు తింటే అవే రుచిగా కనిపిస్తాయి. అన్నం మీద కోరికే ఉండదు. లోకంలో పరమ శివుడు 64 తంత్రాలు అంటే సాధనాలు సృజించాడు. అవన్నీ ఏదో ఒక కోరికనో ఒక పురుషార్థాన్నో తీరుస్తాయి. అక్కడితో మన ఆధ్యాత్మిక ప్రయాణం ఆగిపోతుంది. అంత పాటికే ఓ నలుగురు శిష్యులు చుట్టూ చేరి, మీరు మహా శక్తి సంపన్నులు, అమ్మవారి ఉపాసకులు, అనేసరికి లోనున్న అహం తృప్తి పడిపోతుంది. అక్కడ నుంచి ఎక్కడ వేసిన గొంగళీ అక్కడే. మరి ఎదుగు బొదుగు ఉండదు. దీన్ని ఆదిశంకరులవారు ఈ శ్లోకంలో శివుడు ఈ 64 తంత్రాలిచ్చి మానవులను పరిమితమైన ఆనందాలకు లోను చేసి మోహంలో పడవేశాడు అంటారు. నిజానికి పరమశివుడు కాదు మోహంలో పడేసింది, ఎవరికి వారు, వాళ్ళంత వాళ్ళే పడిపోయి,

ఆగిపోతారు. ఈ 64 తంత్రాల పేరులు వాటి లక్షణాలు అవి ఇచ్చే సిద్ధులు, సుఖాలు వివరంగా అనేక సంస్కృత వ్యాఖ్యానాలలో ఉన్నాయి. శివుడు కైలాసంలో అమ్మవారికి ఈ 64 తంత్రాలు చెబుతూ ఉంటే వినాయకుడు వ్రాసి అవి భూలోకంలో మునులకు ఋషులకు అందించాడట. అందుచేత ఈ 64 తంత్రాలు ఏమీ తక్కువైనవో నీచమైనవో కాదు. కాకపోతే అవి పరిమితమైన ఫలాలను ఇస్తాయి. అవే గొప్పగా అనుకున్నవాళ్లకి అంతే దక్కుతుంది.

ఇక్కడ ఆదిశంకరులు ఒక గొప్ప రహస్యాన్ని మనకు సులువుగా అందిస్తారు. అమ్మవారు తన బిడ్డలయందు వాత్సల్యంతో శివుని నిర్బంధ పెట్టి తనదైన తంత్రాన్ని అంటే శ్రీవిద్యా తంత్రాన్ని భూమి మీద ఉన్నవారి కోసం అవతరింపజేసిందట. ఏమిటి రహస్యం అంటే ఎన్ని తంత్రాలైనా ఎదో ఒక అర్థాన్నో, కామాన్నో, ధర్మాన్నో , మోక్షాన్నో లేదా ఏవైనా ఇతర ఐహికమైన కోర్కెలనో తీరుస్తాయి. శ్రీవిద్యా తంత్రం ఒక్కటే, వీటన్నిటినీ కాక, అంతకుమించిన అమ్మవారి సాయుజ్యాన్ని కూడా కలిగిస్తుంది. ఆ తంత్రాన్ని అమ్మవారి ప్రోద్బలంతో స్వయముగా శివుడే భూమిపై శ్రీవిద్యా తంత్రాన్ని సర్వమంగళకరము, సర్వశుభప్రదము, సర్వసిద్ధిప్రదము, సర్వార్థసాధకమైనదిగా మనకు కల్పించాడు. లోకంలో ఇదొక్కటి తెలిస్తే వేరేదీ తెలుసుకోనవసరంలేదు. ఇది అయ్యవారి అమ్మవారి వాత్సల్యమునకు తార్కాణమైన శ్లోకం.

శివః శక్తిః కామః క్షితి-రథ రవిః శీతకిరణః
స్మరో హంసః శక్ర-స్తదనుచ పరా-మార-హరయః ।
అమీ హృల్లేఖాభి-స్తిసృభి-రవసానేషు ఘటితా
భజంతే వర్ణాస్తే తవ జనని నామావయవతామ్ ॥ 32 ॥

తాత్పర్యం:

జననీ! శివుడు శక్తి, మన్మథుడు, భూమి ఈ నాలుగు (క, ఏ, ఈ, ల), తరువాత సూర్యుడు, చంద్రుడు, మన్మథుడు, సూర్యుడు, ఇంద్రుడు

ఈ ఐదుగురు (హ, స, క, హ,ల) ఆ తరువాత పరాశక్తి, మన్మథుడు, హరి (స, క, ల) వరుసగా మూడు కూటములుగా ఏర్పడి ఈ మూడింటికి ఒకొక్కదానికి చివర హ్రీం చేరిస్తే ఆ పదిహేను అక్షరాలూ నీ మంత్రముగా ఏర్పడుతున్నాయి. (క, ఏ, ఈ, ల హ్రీం, హ, స, క, హ, ల, హ్రీం, స, క, ల హ్రీం).

వ్యాఖ్యానం:

అమ్మవారి తంత్రాన్ని అంటే శ్రీవిద్యాతంత్రాన్ని పై శ్లోకంలో చెప్పి ఆమె మంత్రాన్ని ఈ శ్లోకంలో ఆదిశంకరులు చెప్పకనే చెప్తునారు. మంత్రం అంటే గురువు ఉపదేశించేది. మనంతట మనం చదువుకునేది కాదు. అలా చదువుకుంటే మంత్రం సిద్ధించదు. మంత్రంలో అక్షరాలు తెలుస్తాయి. మంత్రం వెనుక ఒక సంస్కారం ఉంటుంది. అది సరిగా పలకాలి. పైకి చెప్పకూడదు గనుక సంస్కృతంలో ఈ సంప్రదాయం అనుసరించి సంకేతాల ద్వారా చెప్తారు.

ఈ మంత్రలో అమ్మవారి అద్భుతమైన శక్తివంతమైన మంత్రంలో 15 అక్షరాలు ఇక్కడ చెప్పారు. తాత్పర్యంలో చెప్పిన విధంగా ఒక్కొక దేవత ఒక అక్షరానికి సంకేతం. ఇందులో మూడు భాగాలు ఉన్నాయి.

1. శివుడు, శక్తి, మన్మథుడు, భూమి – ఆ అక్షరాలు వరుసగా క–ఏ–ఈ–ల

2. సూర్యుడు, చంద్రుడు, మన్మథుడు – సూర్యుడు, భూమి, అక్షరాలు వరుసగా హ–స–క–హ–ల

3. శక్తి, మన్మథుడు, హరి – అక్షరాలు వరుసగా స– క– ల

ఈ మూడు భాగాలలో అక్షరాలకి చివర ఒక్కొక్క దానికి హృల్లేఖ అంటే హ్రీం చేరిస్తే అప్పుడు 15 అక్షరాలు అవుతాయి. అది 15 అంటే పంచదశి మంత్రం. ఇది లక్ష్మీధరుల వ్యాఖ్యానం, కైవల్య మిశ్రుడనే మరొక పండితుడు ఈ మొదటి భాగంలో అక్షరాలు హ–స–క–ల అన్నారు. లక్ష్మీధరుల మతంలో 'క' మొదటి అక్షరం గనుక దీనిని కాది మతం అని

కైవల్య మిశ్రుని మతంలో 'హ' మొదటి అక్షరం గనుక దీనిని హాది మతం అని అంటారు.

ఇందులో పైన చెప్పిన మూడు భాగాలకు కొన్ని లక్షణాలున్నాయి.

మొదటి భాగం లక్షణం: అగ్ని ఖండం. అమ్మవారి జ్ఞానశక్తికి సంకేతం. జాగ్రదావస్థ, తమోగుణం.

రెండవ భాగం లక్షణం: సూర్య ఖండం, ఇచ్ఛాశక్తి, స్వప్నావస్థ, రజోగుణం.

మూడవ భాగం: సోమ / చంద్ర ఖండం, క్రియాశక్తి, సుషుప్తి అవస్థ – సత్త్వ గుణం.

ఈ పదాలు కొంచెం వివరిస్తాను. అమ్మవారు మూడు శక్తులు కలిగినది, ఒకటి ఆమె ఇచ్ఛ అనగా ఆమె మనసున పుట్టిన కోరిక. రెండవది జ్ఞానశక్తి, మూడవది క్రియ అనగా పని చేయు శక్తి. ఆమె శరీరములో శిరస్సు ఇచ్ఛ, దేహము పై భాగము జ్ఞానము, క్రింది భాగము క్రియ అని కలదు. ఆమె ఈ శక్తులవలననే బ్రహ్మ సృష్టించును, విష్ణువు, స్థితికారుడై పోషించును, ఈశ్వరుడు లయకారుడై లయము చేయును. ఈ మంత్రములో మూడు భాగములు ఈ మూడు శక్తులను తెలియజేస్తాయి.

ఇంక రెండవది మనకి 3 అవస్థలు, మేలుకొని ఉండడం జాగ్రదావస్థ, నిద్రపోవడం సుషుప్తి, కలలు కనడం స్వప్నావస్థ. ఈ మంత్రంలో మూడు భాగాలు ఈ మూడవస్థలను తెలియజేస్తాయి. అలాగే మూడు గుణాలు, సత్త్వ, రజో, తమో గుణాలు. ఈ మూడు భాగాలు వరుసగా వాక్సంపత్తిని, శక్తిని, మోక్షాన్ని ఇస్తాయని తత్త్వవేత్తలు చెప్తారు.

ఈ అక్షరాలను కలిపితే ఏర్పడిన 15 అక్షరాల మంత్రం చంద్రుని 15 కళలను తెలియజేస్తాయి. విచిత్రం ఏమిటంటే మంత్రంలో మొదటి భాగంలో మొదటి అక్షరం క –మూడవ భాగంలో ఆఖరి అక్షరం ల – కలిపితే 'కళ' అవే అమ్మవారి కళలు. ఇంకో రహస్యం ఏమిటంటే శ్రీవిద్య

మంత్రంలో ఉన్నవి 16 అక్షరాలు, 15 వరకే ఆదిశంకరులు చెప్పారు, 16వది గురువు దగ్గర పొందాలి. శ్రీవిద్యలో మొదటి అక్షరమే శ్రీవిద్యా మంత్రంలో ఆఖరి అక్షరం. ఇలా అమ్మవారి స్వరూపాన్ని, ఆమె తంత్రాన్ని మంత్రాన్ని వరుసగా వర్ణించారు ఆదిశంకరులు, జగద్గురువులు కూడా!

స్మరం యోనిం లక్ష్మీం త్రితయ-మిద-మాదౌ తవ మనో
ర్నిధాయైకే నిత్యే నిరవధి-మహాభోగ-రసికాః ।
భజంతి త్వాం చింతామణి-గుణనిబద్ధాక్ష-వలయాః
శివాగ్నౌ జుహ్వంతః సురభిఘృత-ధారాహుతి-శతైః ॥ 33 ॥

తాత్పర్యం:

ఓ నిత్యా! అనంతమైన ఆనందాన్ని అనుభవించే రసికులు కొందరు, పైన చెప్పిన 15 అక్షరాల మంత్రానికి ముందు మన్మథ బీజాక్షరమును, భువనేశ్వరీ బీజాక్షరాన్ని, లక్ష్మీదేవి బీజాక్షరాన్ని (క్లీం, హ్రీం, శ్రీం,) జోడించి చింతామణులుగల అక్షమాలతో, కామధేనువు నేతి ధారలు శివాగ్నిలో ఆహుతి చేస్తూ నిన్ను భజిస్తున్నారు.

వ్యాఖ్యానం:

అమ్మవారిని మహాభోగం కావలసినవారు ఎలా పూజిస్తారో లేదా ఎలా పూజించాలో ఆదిశంకరులు ఈ శ్లోకంలో చెప్తారు. మహాభోగం అంటే, ఐహిక సుఖాలనుకుంటే అదే, కాదు పరమయోగులే మహాభోగులనుకుంటే అదే. దీనికి ఏం చెయ్యాలంటే, పైన చెప్పిన శ్లోకంలోని 15 అక్షరాలకు ముందు మరో మూడక్షరాలు, మన్మథుడు, భువనేశ్వరి, లక్ష్మీదేవి వీరికి చెందిన అక్షరాలు చేర్చి ధ్యానం చెయ్యాలి. ఆ మంత్రం ఏమిటో ముందు చూద్దాం.

లక్ష్మీధరులకాదిమతం ప్రకారం 15 అక్షరాలూ 'క'తో మొదలవుతాయి. దానికి ముందు ఈ మూడక్షరాలు చేర్చాలి. ఈ మూడక్షరాలు క్లీం - హ్రీం - శ్రీం. ఈ 18 అక్షరాల అష్టాదశ మంత్రం జపించాలి.

ఈ మూడక్షరాల విషయంలోనూ రెండభిప్రాయాలున్నాయి. ఇంకో మతం ప్రకారం ఆ మూడక్షరాలు క-ఏ-ఈ. ఇలా అర్థం చెప్పుకుంటే

హాదివిద్యలో హ- స- క, కు బదులుగా క - ఏ-ఈ లను పెట్టి ధ్యానిస్తే 15 అక్షరాలే అవుతుంది. లక్ష్మీధరుల మతంలో 18, కైవల్యశర్మ మతంలో 15 అక్షరాలే వస్తాయి. ఈ రెండవ మార్గం ఎక్కువమంది అనుసరిస్తారు.

దీన్ని మరింత లోతుగా అర్థం చేసుకోనక్కరలేదు. అయితే ఎలా ధ్యానిస్తారో అటువంటి మహాభోగులు లేదా పరమాయోగులు చెప్తున్నారు ఆదిశంకరులు.

అమ్మా నిత్యస్వరూపిణీ! సమయాచారం అనుసరించే కొందరు మహాభోగులు, నీ మంత్రానికి ముందు ఈ మూడక్షరాలు జోడించి, చింతామణులు అంటే అన్ని కోరికలు తీర్చే రత్నమాలను చేతిలో ధరించి, నిన్ను మనసులో ధ్యానిస్తూ, శివాగ్ని (అంటే మన శరీరంలో ఉన్న స్వాధిష్ఠానం అనే అగ్ని)లో కొన్ని వందలసార్లు కామధేనువు యొక్క నేతిధారలతో హోమం చేస్తూ అంతులేని నిరవధికమైన మహా ఆనందాన్ని అనుభవిస్తున్నారు.

ఇక్కడ మహాభోగులన్న పదమే ఆదిశంకరుల పదబంధ పాటవానికి గీటు రాయి. సంస్కృతంలో ఉన్న అనేక వ్యాఖ్యలలో వీరు ఎటువంటివారో చెప్పారు. నేనే శివుడను అనుకునేవారని, అమ్మవారికీ నాకూ భేదం లేదనుకునేవారని, అన్ని లౌకిక బంధాలకు అతీతులైనవారని, ఇలా ఎన్నో రకాలుగా చెప్తారు. ఆ స్థితికి చేరినవారు మనసులోనే ఈ హోమం చేస్తారు, ధ్యానంలోనే నిమగ్నైపోతారు, అలాంటివారే కదా నిజమైన మహాభాగులు, మహాభోగులు!

శరీరం త్వం శంభోః శశి-మిహిర-వక్షోరుహ-యుగం
తవాత్మానం మన్యే భగవతి నవాత్మాన-మనఘమ్ ।
అతః శేషః శేషీత్యయ-ముభయ-సాధారణతయా
స్థితః సంబంధో వాం సమరస-పరానంద-పరయోః ॥ 34 ॥

తాత్పర్యం:

భగవతీ! సూర్యచంద్రులు స్తనములుగా నీవు శివుని శరీరానివి. దోషరహితమైన నీ దేహమే నవవ్యూహాత్మకమైన ఆనంద భైరవుని

శరీరమగుచున్నది. ఆనంద భైరవ– ఆనంద భైరవిలుగా మీకు అన్యోన్య సంబంధము (శేష శేషి సంబంధము) సమరసముగా ఉన్నది.

వ్యాఖ్యానం:

శ్రీచక్రమే శివశక్తుల స్వరూపమని శాస్త్రము. అర్థనారీశ్వరత్త్వమొక ఎత్తు. ఇక్కడ ఇద్దరును ఒకటే అని ప్రతిపాదన. ఎంత చక్కని శ్లోకమో.. అమ్మా! నువ్వు అయ్యవారి శరీరానివి అని శ్లోకం ప్రారంభం చేశారు ఆదిశంకరులు. మీకు అనాలా నీకు అనాలా తరువాత? నీకు అనే అంటారు ఆదిశంకరులు, అదీ చమత్కారం. ఇద్దరూ ఒకటేనని చెప్తూ ద్వివచనం ప్రయోగిస్తే అర్థం లేదు. నీకు సూర్యచంద్రులు కుచములు. దోషరహితమైన నీ శరీరమే తొమ్మిది వ్యూహములుగల శివుని శరీరము. అందువలన ఆనందరూపులైన మీ ఇద్దరు ఒకరు ఆధారము, ఒకరు ఆధేయము, ఒకరు శేషము, ఇంకొకరు శేషి. ఇదే విషయము కాళిదాసు పార్వతీ పరమేశ్వరులను వాక్కు అర్థమువలె కలిసియున్నవారని చెప్పాడు.

ఆనందభైరవుడు శివుడు, మహా భైరవి అమ్మవారు. ఒక్కటే. ఆయన తొమ్మిది వ్యూహములుగలవాడు ఈమె 9 ఆవరణలు కలిగినది. వారి అద్వితీయమైన ఏకత్వాన్ని ఈ శ్లోకంలో శంకరులు ఎనలేని భక్తితో వివరించారు.

మనస్త్వం వ్యోమ త్వం మరుదసి మరుత్సారథి–రసి
త్వమాప–స్త్వం భూమి–స్త్వయి పరిణతాయాం న హి పరమ్ ।
త్వమేవ స్వాత్మానం పరిణమయితుం విశ్వ వపుషా
చిదానందాకారం శివయువతి భావేన బిభృషే ॥ 35 ॥

తాత్పర్యం:

ఓ శివ యువతి! నీవే మనస్సువు (ఆజ్ఞా చక్రము), ఆకాశానివి (విశుద్ధి చక్రము), వాయువువు (అనాహత చక్రము), అగ్నివి (స్వాధిష్ఠానము), నీవే జలము (మణిపూరము), నీవే భూమివి (మూలాధారము). నిన్ను

మించి ఇతరమేదియు లేదు. నిన్ను నీవే విశ్వముగా పరిణమించుటకు చిదానందమైన రూపాన్ని ధరిస్తున్నావు.

వ్యాఖ్యానం:

అమ్మా శివయువతీ! అని శంకరులు అమ్మవారిని సంబోధిస్తూ అమ్మవారే సర్వం జగత్ అని చెప్తున్నారు. నీవే మనస్సు, నీవే ఆకాశము, వాయువు, అగ్ని, నీరు, భూమి అన్నీ నువ్వే. నీవు కానిదేదీ లేదు. నిన్ను నువ్వే విశ్వముగా పరిణామము చేసుకొనుటకు చిదానంద రూపుడైన శివుని ఆయన యువతివిగా కలుస్తున్నావు. ఇంత చక్కని శ్లోకంలో అమ్మవారికి మించినది ఏదీ లేదని ప్రతిపాదిస్తున్నారు ఆదిశంకరులు. ఆమె మనస్సు అంటే – మనస్సు చంద్రునికి సంకేతం, అగ్ని సూర్యరూపం, ఇలా చూస్తే అమ్మవారు అష్టమూర్తి, అంటే ఆమె పైన చెప్పిన పంచ భూతాలూ మనస్సు మాత్రమే కాక సూర్యచంద్రులు కూడాను. పంచభూతాలు అంటే మనస్సు ఆజ్ఞాచక్రం, ఆకాశం విశుద్ధి చక్రం, వాయువు అనాహత చక్రం, అగ్ని స్వాధిష్ఠానం, నీరు మణిపూరం, భూమి మూలాధారం. చిత్ అంటే శక్తి, అమ్మవారు, ఆనందం అంటే శివుడు. ఈ రకంగా ఈ జగత్తు అంతా ఆమె రూపమే. లేదా వారిరువురి రూపమే. దీనికి మించి ఏమీ లేదు. ఆమె తనకు తానై విశ్వముగా పరిణమించడానికి శివునితో కలుస్తుంది. ఆమెయే త్రిపుర సుందరియై, ప్రళయ కాలమున ఆమెయే మహాకాళి అవుతుంది.

తవాజ్ఞాచక్రస్థం తపన-శశి కోటి-ద్యుతిధరం
పరం శంభుం వందే పరిమిలిత-పార్శ్వం పరచితా ।
యమారాధ్యన్ భక్త్యా రవి శశి శుచీనా-మవిషయే
నిరాలోకే-లోకే నివసతి హి భాలోకభువనే ॥ 36 ॥

తాత్పర్యం:

ఆజ్ఞాచక్రమందు కోటి సూర్యచంద్రుల కాంతితో ప్రకాశిస్తూ, పరమనే

చిచ్ఛక్తి ఎడమ భాగమున కలిగిన పరమేశ్వరునికి నమస్కరిస్తున్నాను. ఈ శంభుని ఎవరు భక్తితో ఆరాధిస్తారో వారు సూర్యచంద్రాగ్నులకు సైతము అందని, కనిపించని కాంతిమయమైన లోకంలో నివసిస్తారు.

వ్యాఖ్యానం:

ఆదిశంకరుల సౌందర్యలహరిలో మొదటి 41 శ్లోకములు ఆనందలహరి ఇది ఒక భాగము, మిగిలిన 59 శ్లోకములు రెండవ భాగము, ఇది సౌందర్యలహరి. ఇప్పుడు మనం 36లో ఉన్నాం, ఈ మొదటి భాగంలో ఇక మిగిలినవి 6 శ్లోకాలే. పై శ్లోకంలో చెప్పిన 6 చక్రాలు ఈ 6 శ్లోకాలలో వర్ణించారు ఆదిశంకరులు. ఈ శ్లోకంలో ఆజ్ఞాచక్రం. ఈ చక్రం కనుబొమ్మల నడుమ ఉంటుంది. ఇక్కడ 64 మానస మయూఖాలు అంటే కాంతిపుంజాలుంటాయి. వీటి నడుమ పరాశంభునాథునిగా ఈశ్వరుని, చిత్ పరాంబగా అమ్మవారిని ధ్యానం చేయాలి. ఆదిశంకరుల కవిత్వంలో చమత్కారం శ్లోకం మొదటి పాదంలోనే మనల్ని పులకరింపజేస్తుంది. 'తవాజ్ఞాచక్రస్థంతపన – శశికోటి – ద్యుతిధరం – పరం శంభుం వందే' అని ప్రారంభిస్తారు. అంటే ఏమిటి పైకి నీ ఆజ్ఞాచక్రంలో ఉన్న శతకోటి సూర్యచంద్రుల కాంతి కలిగిన శివునికి నమస్కారం. రహస్యార్థం ఏమిటంటే అమ్మా పరమశివుడు నీ ఆజ్ఞ చేతనే అన్నీ నిర్వహిస్తున్నాడు అన్నది ధ్వని. ఆ శివుడు పరిమళిస్తున్న పార్శ్వంలో చిచ్ఛక్తి అయిన అమ్మవారితో కలిసియున్నాడు. వారిని ధ్యానించే సాధకుడు అపరిమితమైన తేజస్సు కలిగిన, మామూలు కళ్ళతో చూడడానికి వీలుకాని, లోకోత్తరమైన లోకాల్లో నివసిస్తాడు. సౌభాగ్యవర్ధిని అనే సంస్కృత వ్యాఖ్యలో నిష్కామంగా ఏ కోరికలు లేని వారికి ఈ స్థితి కలుగుతుంది. కోరికలున్న వారికి అందనిదంటూ ఏమీ ఉండదని చెప్తాడు. ఆజ్ఞాచక్రం కనుబొమ్మల మధ్య ఉంటుంది గనుకనే ఎంతటి నాస్తికులైనా ఏదేనా దీర్ఘంగా ఆలోచించునపుడో, జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నిస్తున్నపుడో కళ్ళు మూసుకును కనుబొమ్మల మధ్య దృష్టి నిలుపుతారు, ఇదే ధ్యానం లక్షణం, జ్ఞానం లక్షణం.

విశుద్ధౌ తే శుద్ధస్ఫటిక విశదం వ్యోమ-జనకం
శివం సేవే దేవీమపి శివసమాన-వ్యవసితామ్ ।
యయోః కాంత్యా యాంత్యాః శశికిరణ-సారూప్యసరణే
విధూతాంత-ర్ధ్వాంతా విలసతి చకోరీవ జగతీ ॥ 37 ॥

తాత్పర్యం:

తల్లీ! నీ విశుద్ధి చక్రమున ఉన్న ఆకాశతత్త్వముతో శుద్ధమైన స్ఫటికమువంటి శివుని, శివునితో సమానమైన సామర్థ్యముగల దేవి అయిన నిన్ను సేవించెదను. మీ ఉభయుల నుండి ప్రసరించు వెన్నెలవంటి కాంతిచే ఈ జగత్తు అంతరమునగల అజ్ఞానము పోగొట్టబడి ఆడు చకోరపక్షివలె విలసిల్లుతున్నది.

వ్యాఖ్యానం:

తరువాతి శ్లోకం విశుద్ధి చక్రంలో ఉన్న అమ్మవారు, అయ్యవారు. విశుద్ధి చక్రం కంఠంలో ఉంటుంది, దీనికి 16 దళాలుంటాయి. సత్త్వగుణ ప్రధానమైన చక్రం. శుద్ధస్ఫటికం వంటి కాంతి కలిగిన శివుడు అంతే శుద్ధమైన అమ్మవారు ఇక్కడుంటారు. చక్రం పేరే విశుద్ధ చక్రం అంటే విశేషించి శుద్ధమైన చక్రము. ఇక్కడున్న శివుడే ఆకాశతత్త్వాన్ని సృష్టిస్తాడు, అందుకని ఆదిశంకరులు, వ్యోమజనకుడు అన్నారు. అటువంటి వ్యోమజనకుడైన శివుడు, అమ్మవారి నుండి వెలువడు వెన్నెలవంటి కాంతి ముల్లోకాలలో ఉన్న అజ్ఞానమనే చీకటిని పూర్తిగా పారద్రోలగలిగే సాత్త్వికమైన కాంతి. చకోరపక్షికి వెన్నెల ఆహారం, అజ్ఞానంలో మునిగియున్న లోకాలు ఈ పరమేశ్వరీ పరమేశ్వరుల నుండి వెలువడే జ్ఞానమనే వెన్నెల కోసం చంద్రుడు కోసం ఆడు చకోరపక్షిలా ఎదురు చూసి ఆ వెన్నలని పొంది ఆనందించినట్టు, లోకాలు ఆనందిస్తాయట. ఇక్కడ ఉన్న పరమశివుడు, అమ్మవారు పేర్లు వ్యోమేశ్వరుడు, వ్యోమేశ్వరి–

సమున్మీలత్ సంవిత్కమల-మకరందైక-రసికం
భజే హంసద్వంద్వం కిమపి మహతాం మానసచరం ।
యదాలాపా-దష్టాదశ-గుణిత-విద్యాపరిణతిః
యదాదత్తే దోషాద్ గుణ-మఖిల-మద్భ్యః పయ ఇవ ॥ 38 ॥

తాత్పర్యం:

అమ్మా! వికసించుచున్న జ్ఞానమనెడి (అనాహతము) కమలము నుండి తేనెను గ్రోలుతూ, మహాత్ముల మానసమనెడి సరోవరంలో విహరించుచు, వాటి ఆలాపమువలన పదునెనిమిది విద్యలను పరిణమింపజేసి, గుణములను దోషముల నుండి, పాలను నీటి నుండి వేరు చేయు రాజహంసల జంటను భజించెదను.

వ్యాఖ్యానం:

ఈ శ్లోకము అనాహత చక్రంలో ఉండే హంస ద్వంద్వం అంటే మానస సరోవరంలో విహరించే అమ్మవారు, శివుడు వీళ్ళను ధ్యానించేది. అనాహతం అంటే హృదయం దగ్గర ఉండే 12 దళాలు కలిగిన చక్రం. హృదయ సరస్సని, మానస సరోవరం అని, హృదయ కమలం అని, ఇలా రకరకాలుగా వర్ణించే ఈ చక్రమే మనలో భగవంతుడు, అమ్మవారుండే స్థానం. ఆదిశంకరులు ఇక్కడ వారిని హంస ద్వంద్వం అంటున్నారు. చమత్కారం ఏమిటంటే 'హం' అంటే శివుడు, 'స' అంటే అమ్మవారు. ఇదే మన ఊపిరి, మనం చేసే అజపాజపం, అంటే దానంతట అదే జరిగే జపం, మన ఉచ్ఛ్వాస నిశ్వాసాలలో. హంస ద్వంద్వంవలె ఉన్న పార్వతీ పరమేశ్వరులు, ఇక్కడ ఈ చక్రానికి అధిష్ఠాన దేవతలు, హంసేశ్వర- హంసేశ్వరీ. ఈ హంసద్వంద్వము చేసే కలకలా రావములే వారి సల్లాపములే అష్టాదశ విద్యలు. ఆ పద్దెనిమిదే విద్యలు అంటే తెలుసుకోనదగినవి అని అర్థం. 4 వేదాలు, 6 వేదాంగాలు అంటే శిక్ష, వ్యాకరణం, జ్యోతిషం, ఛందస్సు, నిరుక్తం, కల్పం, 11. మీమాంస, 12. న్యాయము, 13. పురాణము, 14, ధర్మశాస్త్రము, 15. ఆయుర్వేదము,

16, ధనుర్వేదము, 17. గాంధర్వ వేదము, 18. నీతి శాస్త్రము. ఈ విద్యలు వారి సల్లాపములలో నిరంతరం సాగుతూ ఉంటాయి, యోగుల మానస సరోవరాల్లో ఉండే హంసలు కదా. హంసకున్న లక్షణం పాల నుండి నీటిని వేరు చేయడం. దోషాలను వదలిపెట్టి గుణాలనే పరిగ్రహించే జంట ఈ హంస ద్వయం. శంకర భగవత్పాదులు వారి సౌభాగ్యోదయం అనే వ్యాఖ్యానంలో శివుడు అగ్ని శిఖ అని, అమ్మవారు అగ్ని శిఖిని అని అంటారు. వీరిని ఆవరించి ఈ చక్రంలో 54 వాయవ్య అంటే ఆకాశానికి సంబంధించిన కిరణాలు ఉంటాయంటారు. అంతటి మహత్తరమైన చక్రం అనాహతం. ఆ చక్రంలో ఉండే ఆ ఉభయులకు నమస్కారం.

తవ స్వాధిష్ఠానే హుతవహ-మధిష్ఠాయ నిరతం
తమీడే సంవర్తం జనని మహతీం తాం చ సమయామ్ ।
యదాలోకే లోకాన్ దహతి మహసి క్రోధ-కలితే
దయార్ద్రా యా దృష్టిః శిశిర-ముపచారం రచయతి ॥ 39 ॥

తాత్పర్యం:

తల్లీ నీ స్వాధిష్ఠానమున (అగ్నిచక్రము) సంవర్తాగ్ని రూపమున ఉన్న శివుని పూజిస్తున్నాను. ఆయన క్రోధాగ్నికి లోకాలు దహించుకుపోతే, సమయా రూపమున ఉన్న నీవు నీ దయార్ద్ర దృష్టితో చల్లదనాన్ని కలిగించి ఉపచారం చేస్తున్నావు. అట్టి నిన్నూ పూజిస్తున్నాను.

వ్యాఖ్యానం:

స్వాధిష్ఠాన చక్రం 6 దళాలున్న చక్రం ఇది సుమారుగా మన శరీరంలో జీర్ణాశయం దగ్గర ఉంటుంది. అగ్ని చక్రం. కడుపులో మంట అంటూంటాం కదా, జఠరాగ్ని అంటాం కదా. ఇక్కడ ఉండే అమ్మవారు సమయాంబ, శివుడు సంవర్తేశ్వరుడు. తల్లీ! స్వాధిష్ఠానంలో అగ్నిరూపంలో ఉన్న శివునికి, సమయా రూపంలో ఉన్న నీకు నమస్కరిస్తున్నాను. ఆయన తన క్రోధ పూరితమైన దృష్టితో లోకాలను దహించివేస్తే నువ్వు నీ దయాపూరితమైన చూపులతో లోకాలకు చల్లదనాన్ని కలిగించి ఉపచారం చేస్తున్నావు.

అర్ధనారీశ్వరులకు మూడు నేత్రాలలో ఒకటి సూర్యుడు, రెండవది చంద్రుడు, మూడవ కన్ను అగ్ని. ఆమె ఆయనతో కలిసి ఒకవంక అగ్నియై లోకాలను దహించే శివునికి సహకరించినా, తన బిడ్డల మీద అమ్మవారికి ఎనలేని కరుణ. అందుకనే తనవంక ఉన్న నెలవంక కంటితో లోకాలకు శీతోపచారం చేస్తుంది. ఈ చక్రంలో వారిరువురిని ఆవరించి 62 అగ్ని శిఖలుంటాయి, వాటిని తైజసీ మయూఖాలు అంటారు. రహస్యం ఏమిటంటే ఉపాసన ఒక తపస్సు. తపస్సు అంటే తపింపజేసేది. అలాంటి ఉపాసకులను సమయాంబ తన కరుణా కటాక్షాలతో శీతోపచారం చేసి వారికి ఉపాసనా ఫలాన్ని బలాన్ని ఇచ్చి ఉపశమింపజేస్తుంది.

తటిద్వంతం శక్త్యా తిమిర-పరిపంథి-స్ఫురణయా
స్ఫుర-న్నా నారత్నాభరణ-పరిణద్ధేంద్ర-ధనుషమ్ ।
తవ శ్యామం మేఘం కమపి మణిపూరైక-శరణం
నిషేవే వర్షంతం-హరమిహిర-తప్తం త్రిభువనమ్ ॥ 40 ॥

తాత్పర్యం:

నీ మణిపూరమున కలిగిన చీకటిని, నీ శక్తిచే విద్యుత్కాంతితో, నానారత్నాభరణముల వెలుగు వలన ఇంద్రధనస్సునువలె ప్రకాశింపజేస్తూ, శివుడనే సూర్యునిచే తగులబెట్టబడిన ముల్లోకాలకు తాపోపశమనం కలిగించే ఆ నీలి మేఘాన్ని భజిస్తున్నాను.

వ్యాఖ్యానం:

నిజానికి మణిపూరం చెప్పాక స్వాధిష్ఠానం చెప్పాలి కాని పంచభూతాల వరుస క్రమం కోసం ముందే స్వాధిష్ఠానం చెప్పబడింది. ఇది మణిపూర చక్రం నాభి స్థానంలో శరీరానికి కేంద్ర బిందువుగా ఉంటుంది. పది దళాలున్న జల చక్రం. ఇక్కడ ధ్యానించవలిసినవారు, మేఘేశ్వరుడు, సౌదామని లేదా అమృతేశ్వరుడు, అమృతేశ్వరీ. ఇక్కడ ఆయన మేఘము, అమ్మవారు మెరుపు. వీరిని 52 నీటి కిరణాలు అంటే ఆప్య మయూఖాలు చుట్టి ఉంటాయి. లక్ష్మీధర పండితులు తమ వ్యాఖ్యానంలో అంటారు,

సిద్ధ ఘుటికా అనే ఒక గ్రంథంలో సదాశివుడు మణిపూరంలో శీతాకాలపు మేఘంలా ఉంటాడట, అక్కడ అమ్మవారు విద్యుల్లత అంటే మెరుపుతీగెగా ఉంటుందట. ఆ మేఘం వల్ల ఏర్పడిన చీకటిని అమ్మవారి ఆభరణాలు ఇంద్రధనస్సు కాంతిని కలిగించి ఆమె మెరుపై మెరిసిన తరువాత తాపోపశమనమైన వర్షాన్ని వర్షించే ఉభయులకు నమస్కారం అంటారు ఆదిశంకరులు.

తవాధారే మూలే సహ సమయయా లాస్యపరయా
నవాత్మానం మన్యే నవరస-మహాతాండవ-నటమ్ ।
ఉభాభ్యా మేతాభ్యా-ముదయ-విధి ముద్దిశ్య దయయా
సనాథాభ్యాం జజ్ఞే జనక జననీమత్ జగదిదమ్ ॥ 41 ॥

తాత్పర్యం:

నీ మూలాధారమున లాస్యము చేయు సమయా రూపమున ఉన్న నిన్ను, నవరసములతో తొమ్మిది రూపములుగల తాండవము చేయు శివుని, ధ్యానిస్తున్నాను. మీ ఇరువురు సృష్టి చేయు సంకల్పముతో దయతో ఒకరితోనొకరు కలిసి ఈ జగత్తునకు జననీ జనకులవుతున్నారని తెలుసుకుంటున్నాను.

వ్యాఖ్యానం:

ఈ శ్లోకం ఎన్నో విధములుగా అత్యంత ప్రదానమైన శ్లోకము. సౌందర్యలహరి మొదటి భాగంలో చివరి శ్లోకం. మూలాధార చక్రం నాలుగు దళాలున్న పృధ్వీ తత్త్వము అయిన చక్రం. అన్నిటికి మూలము, ఆధారముగనుకనే ఈ చక్రానికి మూలాధారమని పేరు. ఇక్కడ ఉన్న అధిదేవతలు జగత్తుకు తల్లిదండ్రులు. వారు ఆది నటుడు, లాస్యేశ్వరి. ఇక్కడ అమ్మవారు సృష్టి సమయంలో చేసే లాస్యం, పరమశివుడు ప్రళయ సమయంలో చేసే తాండవం ఆదిశంకరులు బహు రమ్యంగా పొందుపరిచారు. ఆధారచక్రం త్రికోణ రూపంలో బిందువుగా ఉంటుంది. శ్రీచక్రంలో మధ్యనున్నది బిందువు, దానినావరించి యుండేది త్రికోణం.

త్రికోణం సర్వ సిద్ధిప్రదం, బిందువు సర్వానందమయం. ఈ చక్రంలోనే కుండలినీ శక్తి ఉంటుంది. ఈ చక్రాన్ని పూజిస్తే నిద్రాణమైయున్న కుండలినీ శక్తి మేలుకుంటే అదే ముక్తి. ఇక్కడ అమ్మవారు లాస్యము చేసే ఆనంద భైరవి, ఆయన తాండవం చేసే ఆనంద భైరవుడు. వీరిద్దరూ కలియుట చేతనే సృష్టి స్థితి లయలు ఏర్పడుచున్నవి. వారి కలయిక చేతనే వారు ముల్లోకములకు జననీ జనకులై ప్రకాశిస్తున్నారు. వారికి నమస్కారం.

యజుర్వేదం (1–IV–11) ఏం చెప్తుందంటే ఈ సంసారం దాటడానికి ఒక ధృఢమైన నావ కావాలి, అది అగ్ని కలిగిన స్వాధిష్ఠానంతోనూ, భూతత్త్వమైన మూలాధారంతోనూ, జలతత్త్వమైన మణిపూరంతోనూ, ఆకాశతత్త్వమైన విశుద్ధితోనూ, మనస్తత్త్వం కలిగిన ఆజ్ఞాచక్రంతోనూ, వాయు తత్త్వం కలిగిన అనాహతంతోనూ నిర్మింపబడినది అయి ఉండాలని చెప్తుంది.

ఇది సౌందర్యలహరిలో మొదటి భాగం, శ్రీవిద్య, శ్రీచక్రం, శరీరంలోని చక్రాలు మొదలైన అంతర్ముఖంగా చేసే పూజ తెలియజేస్తుంది. ఈ భాగం ఆనందలహరి.

* * *

ఇది జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్య కృతంబైన సౌందర్యలహరి యందు ప్రథమ భాగమునకు శ్రీవిద్యా ఉపాసక పప్పు వంశోద్భవ, వేంకటరత్నమ్మ, సోమయాజిపుత్ర వేణుగోపాలరావుచే విరచితంబైన అమృతలహరి యను వ్యాఖ్యానము సంపూర్ణము.

✦

ద్వితీయ భాగం:

సౌందర్యలహరి రెండవ భాగం:

సౌందర్యలహరి – ఆనందలహరి వ్యాఖ్యానం

గతై-ర్మాణిక్యత్వం గగనమణిభిః సాంద్రఘటితం
కిరీటం తే హైమం హిమగిరిసుతే కీర్తయతి యః ॥
స నీడేయచ్ఛాయా-చ్ఛురణ-శకలం చంద్ర-శకలం
ధనుః శౌనాసీరం కిమితి న నిబధ్నాతి ధిషణాం ॥ 42 ॥

తాత్పర్యం:

తల్లీ హిమగిరి తనయా! నీ బంగారు కిరీటాన్ని దానిలో బాగా దగ్గరగా పొదగబడిన పన్నెండు సూర్యులనే మణులతో ఎవరు నిన్ను కీర్తిస్తారో వారి బుద్ధికి ఆయా మణుల కాంతి చంద్రవంక పైబడి ఇంద్ర ధనుస్సు అని తోచకపోవునా!

వ్యాఖ్యానం:

శ్రీచక్రము, శ్రీవిద్య మొదలైన విషయములు మొదటి భాగమున వర్ణించబడినవి. 8వ శ్లోకములో చిదానందలహరీం అని 21వ శ్లోకములో పరమానందలహరీం అను వర్ణనలు ఈ భాగము ఆనందలహరి అని ధృవపరచును. అలాగే 44వ శ్లోకంలో సౌందర్యలహరీం అను ప్రస్తావన వస్తుంది, ఈ రెండవ భాగమునకు సౌందర్యలహరీ అని పేరు, మొత్తం గ్రంథం అంతా సౌందర్యలహరి.

ఈ భాగంలో అమ్మవారి రూపము మకుటము నుండి పాదముల వరకు వర్ణన గలదు. అయితే ఇవి రెండు భాగాలన్న విషయం లక్ష్మీధరులు, భాస్కరరాయుడు, కైవల్య శర్మ మొదలైన పండితులు అంగీకరించరు, మొత్తం గ్రంథం అంతా అమ్మవారే కదా అని వారి భావన.

ఇది మొదటి శ్లోకం, అంటే అమ్మవారి రూపవర్ణనలో మొదటిది. ఆదిశంకరులు ఇందులో చేసిన వర్ణన మహాకవి కాళిదాసు అమ్మవారిని

కుమార సంభవంలో చేసిన వర్ణనను తలపిస్తుంది. మనుషులను వర్ణించినపుడు పాదాలతో ప్రారంభించి వర్ణించాలి, దేవతలైతే శిరసుతో ప్రారంభించాలి అనేది సంప్రదాయం. అమ్మవారి కిరీటాన్ని ఆదిశంకరులు అతి రమణీయంగా ఉత్ప్రేక్ష, అతిశయోక్తి అలంకారాలతో వర్ణిస్తున్నారు. అమ్మవారి కిరీటం గగన మణులతో పొదగబడి ఉందట. ఆకాశంలో మణి అంటే సూర్యుడు, మణులు అంటే 12 మంది ఆదిత్యులు. కోటిసూర్యప్రభా అని సంప్రదాయంగా ఆమె కాంతిని చెప్తారు. హిమగిరిసుతే అని అమ్మవారిని సంబోధిస్తున్నారు. తెల్లని మంచుకొండ కూతురు తలలో ఆకాశంలో ఉన్న ఆదిత్యులచే పొదగబడిన కిరీటం. హిమం అంటే మంచు, హేమ అంటే అమ్మవారు, హేమం అంటే బంగారం. ఆ బంగారు కిరీటంలో రంగురంగుల మణులు. ఎవరేనా కవియో భక్తుడో సాధకుడో దీన్ని కీర్తిస్తే అతనికి అది ఎలా కనిపిస్తుందట... ఈ నానా రత్న మణిమయ కాంతులు, అమ్మవారి తలపైనున్న చంద్రవంక పైబడి, అది రంగురంగులుగా అతనికి కన్పించి ఇది ఇంద్రధనస్సేమో అనిపిస్తుందట.

ధునోతు ధ్వాంతం న-స్తులిత-దలితేందీవర-వనం
ఘనస్నిగ్ధ-శ్లక్ష్ణం చికుర నికురుంబం తవ శివే ।
యదీయం సౌరభ్యం సహజ-ముపలబ్ధుం సుమనసో
వసంత్యస్మిన్ మన్యే బలమథన వాటీ-విటపినామ్ ॥ 43 ॥

తాత్పర్యం:

అమ్మా! శివే! వికసిస్తున్న నల్ల కలువల వనమువంటి నీ చిక్కని, నున్నని, మెత్తని కురులు మాలో ఉన్న అంధకారాన్ని పోగొట్టుగాక! ఇంద్రుని ఉద్యానవనంలో పూలు సహజమైన ఈ సౌరభం పొందడానికే నీ కురులలో ఉండాలని కోరుకుంటాయనుకుంటాను.

వ్యాఖ్యానం:

ఇది ఒక విచిత్రమైన శ్లోకం. ఇందులో అమ్మవారి కేశాలను వర్ణిస్తున్నారు.

అవి ఎలా ఉన్నాయి. వికసిస్తున్న నల్ల కలువల వనంలా దట్టంగా ప్రకాశంగా ఉన్నాయి. ఇంకా స్నిగ్ధము అంటే పరిమళమైన తైలమువలన నున్నగా ఉన్నాయి. మెత్తగా ఉన్నాయి. అమ్మా! శివే అని సంబోధిస్తున్నారు, తల్లీ నీ ఈ తల వెంట్రుకల సువాసనను పొందడానికి, ఇంద్రుని నందనవనంలో కల్పవృక్షపు కుసుమాలు, నీ తలలో తురుమబడాలని కోరుకుంటున్నాయి. అలాంటి నీ నల్లని కేశపాశం, మాలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించుగాక. విచిత్రం ఏమిటంటే నల్లని కేశాలు అజ్ఞానం అనే అంధకారాన్ని ఎలా తొలగిస్తాయి. అవే నల్లగా ఉన్నాయి, మనలో ఉన్న అజ్ఞానం ఇంకా దట్టమైన చీకటి! ఇదీ ఆదిశంకరుల చమత్కారం. అమ్మవారి శిరోజములు నల్లనివైనా ప్రకాశముగలవి, పరిమళముగలవి, ఆ రెండు లక్షణాలే కాదు స్నిగ్ధం అని ఇంకో పదం ప్రయోగించారు. స్నిగ్ధం అంటే తైలముతో కూడినది. తైలానికి స్నేహం అని ఇంకో మాట ఉంది సంస్కృతంలో. అంటే అమ్మవారి కురులకుగల లక్షణాలు, ప్రకాశం, స్నేహం, మృదుత్వము, పరిమళము. వీటివల్ల మాలో ఉన్న అజ్ఞానం అనే చీకటి తొలగించు తల్లీ అని ప్రార్థన.

తనోతు క్షేమం న-స్తవ వదనసౌందర్యలహరీ
పరీవాహస్రోతః-సరణిరివ సీమంతసరణిః ।
వహంతీ- సిందూరం ప్రబలకబరీ-భార-తిమిర
ద్విషాం బృందై-ర్వందీకృతమేవ నవీనార్క కిరణమ్ ॥ 44 ॥

తాత్పర్యం:

నీ ముఖ సౌందర్యలహరి ప్రవహించుటకు వీలుగా ఉండే కాలువలా నీ పాపిట కనిపిస్తోంది. దానికి ఇరువైపులా కటిక చీకటిలాంటి నీ దట్టమైన కురులు శత్రుబృందాలలా ఉన్నాయి. వాటి మధ్యలో నీ పాపిట సింధూరం బంధించబడిన ఉదయ సూర్యుని కిరణమ్‌లా ఉంది; ఆ ఉదయ కిరణ సన్నిభమైన నీ పాపిట సింధూరము మాకు సమృద్ధిగా క్షేమమును కలిగించుగాక!

వ్యాఖ్యానం:

ఈ శ్లోకం ఆదిశంకరుల అద్భుతమైన కవిత్వానికి ఇంకో ఉదాహరణ. అప్పయ్య దీక్షితులవారు కువలయానందంలో అలంకారాలు చెపుతూ ఉదాహరణగా ఈ శ్లోకాన్ని ఉటంకించారు. ఈ శ్లోకంలోనే సౌందర్యలహరి అని ఈ గ్రంథం పేరు నిక్షిప్తమై ఉంది. ఈ శ్లోకంలో అమ్మవారి ముఖ సౌందర్యం వర్ణిస్తున్నారు. అందులో ఆమె పాపిట, ఉత్ప్రేక్ష, రూపకం, అతిశయోక్తి అలంకారాల సమ్మేళనం. అమ్మవారి వదన సౌందర్యలహరి. ఆ సౌందర్య ప్రవాహం రెండు ప్రక్కలా శత్రువులు మోహరించినట్టున్న కురుల మధ్యలో పాపట సెలయేరులా ప్రవహిస్తోందట. ఆ చీకటి వంటి కురుల మధ్య పాపటలో ఆమె సింధూరం బొట్టు బంధింపబడిన ఉదయ సూర్యునిలా ఉందట. కళ్ళ ఎదుట అమ్మవారిని దర్శించిన కవి ఆదిశంకరులు. వారి అనుభూతిని మనతో పంచుకుంటున్నారు. ఆ వదన సౌందర్య ప్రవాహం సెలయేరై ప్రవహించే నీ పాపిట మాకు క్షేమం కూర్చుగాక అని ప్రార్థన! ఈ పాపిట లక్షణం ఏమిటి, శత్రువులను అదుపులో పెట్టడం, చీకటిని తొలగించడం, సౌందర్యాన్ని ప్రవహింపజేయడం, అరుణిమను తేజస్సును బంధించి మనకు ఇవ్వడం. ఇదే కదా క్షేమం అంటే!

అరాలై స్వాభావ్యా-దలికలభ-సశ్రీభి రలకైః
పరీతం తే వక్త్రం పరిహసతి పంకేరుహరుచిమ్ ।
దరస్మేరే యస్మిన్ దశనరుచి కింజల్క-రుచిరే
సుగంధౌ మాద్యంతి స్మరదహన చక్షు-ర్మధులిహః ॥ 45 ॥

తాత్పర్యం:

జననీ! గండు తుమ్మెదలవలె ప్రకాశిస్తూ సహజముగానే వంకరగా ఉండే నీ ముంగురులచేత అందమైన నీ ముఖము, కలువల కాంతిని పరిహసిస్తున్నది. చిరునవ్వుతో దంత కాంతులనే కేసరములచే ప్రకాశిస్తూ సుగంధమును వెదజల్లుచున్న నీ ముఖము మన్మథుని దహించిన శివుని కనులకు మత్తుగొల్పుతున్నది.

వ్యాఖ్యానం:

ఆదిశంకరులు ఈ సౌందర్యలహరి రచనలో మొదటి భాగంలో ఒక ఉపాసకుడైన కవి, రెండవ భాగంలో ఒక మహాకవియైన ఉపాసకులు. అమ్మవారి సౌందర్యం ఆయనే మొదటి శ్లోకంలోనే వర్ణించడానికి ఎవరికి సాధ్యం, ఒక్క పూర్వ పుణ్యం ఉన్న ఉపాసకుడైన మహాకవికి తప్ప అన్నారు కదా! శంకరుల కవితా ప్రాగల్భ్యం అమ్మవారి సౌందర్య వర్ణనలో ప్రత్యక్షరంలో ప్రత్యక్షంగా కనిపిస్తుంది. పులకించిన మనసుతో ఆయన వర్ణించిన రూపాన్ని మనోనేత్రంతో దర్శించుకొని ఆనదించడమే!

ఈ శ్లోకంలో అమ్మవారి వదన సౌందర్య వర్ణన, అందమైన ముంగురులు గండు తుమ్మెదల్లా ఉన్నాయి. ఇక్కడ ఏ కవీ వాడని ఒక పద ప్రయోగం చేశారు ఆదిశంకరులు. అలికలభ అని. అలీ అంటే తుమ్మెదలు. కలభ అంటే చిన్నవి. సాధారణంగా గున్న ఏనుగులకు కరికలభ అని వాడుతారు, తుమ్మెదలకు కలభం అనే మాట శంకరులు విచిత్రంగా ప్రయోగించారు, ఎందుకంటే ఒకచోట నిలవవు, చిన్నతనంచేత. అమ్మవారి ముంగురులు గండు తుమ్మెదలు, ఒకచోట నిలవనివి. ముంగురుల లక్షణం అదే కదా. ఆ కదలికే అందాన్ని మరింత ఇనుమడింపజేస్తుంది. అమ్మవారి ముఖం కమలముల కాంతిని పరిహసిస్తోందట. అక్కడితో కమలంతో సామ్యం ఆగలేదు, కమలంలో కేసరాలుంటాయి, అమ్మవారి చిరునవ్వు నవ్వితే ఆమె పలువరస కాంతి కిరణాలు కేసరాల్లా ఉన్నాయి. కమలాలకి కొంతసేపే ఉండే సుగంధం ఉంటుంది, అమ్మవారి ముఖ కమల సహజ సుగంధం శాశ్వతమైనది. ఇక్కడ శంకరులు మరో రెండు మత్తెక్కిన తుమ్మెదలు చెప్పారు, అవి శివుని కన్నులు, అనురాగంతో మత్తెక్కిన చూపులతో ఆయన అమ్మవారి అందాన్ని ఆస్వాదిస్తున్నాడు. ఆయన మామూలువాడా? మన్మథుని దహించినవాడు, అంటే ఇంద్రియాలను జయించినవాడు, ఆయనకే మత్తుగొలిపే వదన సౌందర్యం అమ్మవారిది! ఇందులో ఉపమ రూపక అలంకారాలు ఉపయోగించారు ఆదిశంకరులు. అద్వితీయమైన కవితా పాటవం!

లలాటం లావణ్య ద్యుతి విమల-మాభాతి తవ యత్
ద్వితీయం తన్మన్యే మకుటఘటితం చంద్రశకలమ్ ।
విపర్యాస-న్యాసా దుభయమపి సంభూయ చ మిథః
సుధాలేపస్యూతిః పరిణమతి రాకా-హిమకరః ॥ 46 ॥

తాత్పర్యం:

అమ్మా! నీ నుదురు లావణ్యమైన కాంతితో ప్రకాశిస్తోంది. అది కిరీటానికి పొదగబడిన రెండవ చంద్రకళవలె ఉంది. ఈ రెండు కలిపితే అమృతము ప్రవహించు పూర్ణచంద్రునివలె ఉన్నది.

వ్యాఖ్యానం:

అమ్మవారి కిరీటంతో ప్రారంభమైన వర్ణన ఇప్పుడు నుదురు వరకు వచ్చినది. అమ్మవారి లలాటం స్వచ్ఛమైన కాంతితో ప్రకాశిస్తోంది. ఎలా ఉందంటే ఆమె కిరీటంలో ఉన్న రెండవ చంద్రశకలంలా ఉందట. ఒకటి కిరీటం మీద ఉంది. రెండవది కిరీటం కింద ఉంది. ఈ రెండూ తిప్పి కలిపితే ఒక పౌర్ణమి చంద్రుడిలా ఉంది. ఈ రెండు భాగాలను కలిపే వస్తువు ఏమిటి అంటే శంకరులు శ్లేషలో చెప్తున్నారు. సుధాలేపస్యూతిః, అనడంలో ఈ స్యూతి అనే మాటకు అల్లడం, కుట్టడం అని అర్థాలున్నాయి. ఈ రెండు అర్థచంద్రబింబాలను అమృత స్రావంతో కలిపి కుట్టి లేదా అల్లి ఒక పౌర్ణమి చంద్రబింబంలా చెయ్యడం ఒకటి, ఆ చంద్రబింబం అమృతాన్ని స్రవిస్తుంది. ఆ రకంగా అమ్మవారి ఫాలభాగం సాధకులకు అమృతత్వాన్ని వెన్నెలను ప్రసాదిస్తుంది అని భావన.

భ్రువౌ భుగ్నే కించిద్భువన-భయ-భంగవ్యసనిని
త్వదీయే నేత్రాభ్యాం మధుకర-రుచిభ్యాం ధృతగుణమ్ ।
ధను ర్మన్యే సవ్యేతరకర గృహీతం రతిపతేః
ప్రకోష్ఠే ముష్టౌ చ స్థగయతి నిగూఢాంతర-ముమే ॥ 47 ॥

తాత్పర్యం:

తల్లీ ఉమాదేవీ! లోకములలో భయాన్ని తొలగించడమే అలవాటుగాగల

దేవీ! తేనెటీగలవంటి నీ కనులు, కొంచెము వంగిన నీ కనుబొమ్మలు, వాటి మధ్యభాగము వింటినారివలె ఎడమచేత మన్మథునిచే పిడికిలి పట్టుకొనుటచే ధనుస్సు మధ్య భాగమువలె అనిపించుచున్నది.

వ్యాఖ్యానం:

అమ్మవారి కనుబొమల వర్ణన. ఒక అతి రమణీయమైన కవితా శిల్పం. ఉమా! అని అమ్మవారిని సంబోధిస్తున్నారు ఆదిశంకరులు. తల్లీ! లోకాలను ఆపదలు నుండి రక్షించడమే వ్రతంగా గలదానా! నీ కనులు తెనేటీగలులా ఉండి మన్మథుని వింటికి అల్లెత్రాడులా ఉన్నాయి. మన్మథుని విల్లు గురించి 6వ శ్లోకంలో వర్ణన చూడండి. కనుబొమలు కొంచెం వంగి ఉన్నాయి. కనుబొమ్మలను ధనస్సుతో పోల్చడం మహాకవులందరూ చేశారు. ఇక్కడే ఆది శంకరుల ప్రత్యేకత తెలుస్తుంది. కనులు మన్మథుని వింటి నారిలా ఉన్నాయి. కనుబొమలు ధనుస్సు దండంలా ఉంది. మన్మథుడి వింటి నారిని సారించి, ధనుస్సు ఎక్కుపెడితే, ఆ కనుబొమ్మలకు మధ్యలో ఉన్న జాగాలో పిడికిలి పెట్టి ధనస్సుని పట్టుకోవాలి. అలా ఉన్నాయట ఆమె కనుబొమలు.. రహస్యం ఏమంటే ఆమెను శంకరులు 'లోకాలను ఆపదలు నుండి రక్షించడమే వ్రతంగా కలదానా' అని ఎందుకు సంబోధించారంటే అలాంటి వ్రతం ఉన్నప్పుడు కనులు నిశితమైన వాడి చూపు కలిగి ఉంటాయి.. వాడిగా ఉండడం బాణాల లక్షణం. చూపు వాడి, కనులు వింటి నారి, కనుబొమ్మలు ధనుస్సు అన్నీ మన్మథునికి సంబంధించినవే. ఆయన బాణాలన్నీ పూలబాణాలే. అమ్మవారు ఇలా మన్మథుడు ఎక్కుపెట్టిన విల్లులా ఉన్నా, ఆమె వ్రతం లోకాలను ఆపదల నుంచి రక్షించడం. ఆపదలు కల్పించేదీ ఆమెయే, రక్షించేదీ ఆమెయే! అమ్మవారి కరుణ, ఆమె కనుబొమ్మలు ఈ శ్లోకంలో ఆదిశంకరులు వర్ణించిన తీరు లోకోత్తరమైనది..

అహః సూతే సవ్య తవ నయన-మర్కాత్మకతయా
త్రియామాం వామం తే సృజతి రజనీనాయకతయా ।
తృతీయా తే దృష్టి-ర్దరదలిత-హేమాంబుజ-రుచిః
సమాధత్తే సంధ్యాం దివస-నిశయో-రంతరచరీమ్ ॥ 48 ॥

తాత్పర్యం:

అమ్మా! నీ కుడి కన్ను సూర్యాంశచే పగటిని, ఎడమకన్ను చంద్రాంశచే రాత్రిని, తెలియజేస్తున్నాయి. నీ మూడవ కన్ను కొంచెము వికసించిన చెంగలువవలె, ప్రాతః సాయంసంధ్యలు రెంటిని సూచిస్తున్నది.

వ్యాఖ్యానం:

ఆదిశంకరులు ఈ శ్లోకం నుంచి పది శ్లోకాలలో అమ్మవారి కనులు వర్ణిస్తున్నారు. ఆమె కాలగమనాన్ని తన అధీనంలో ఉంచుకుంటుంది, కాలాతీతమైనది, ఆమెయే కాలము. ఆమె కుడి కన్ను సూర్యునికి నెలవు, దానివలన లోకంలో పగలు ఏర్పడుతోంది. ఎడమ కన్ను చంద్రునికి నెలవు, దాని వలన రాత్రి ఏర్పడుతోంది. ఆమె మూడవ కన్ను అరవిరిసిన చెంగలువవలె ఉన్నది, అగ్నికి స్థానము, ఉదయము, సాయంత్రములలో సంధ్యలను ఏర్పరుస్తోంది. అంటే ఏమిటి? ఈ రేయింబవళ్ళు, రోజులు, నెలలు, ఋతువులు, సంవత్సరాలు, కల్పాలు అన్నీ ఆమె కనుసన్నలలోనే నడుస్తాయి. లోకంలో సర్వ ప్రాణులకు ఆమె ఇచ్చే వెలుగు వల్ల ప్రాణ సంరక్షణం ఒకటి, వారు వారు చేసే అన్ని పనులకు ఆమె కర్మ సాక్షి ఇది ఒకటి.

విశాలా కల్యాణీ స్ఫుటరుచి-రయోధ్యా కువలయైః
కృపాధారాధారా కిమపి మధురాఽఽభోగవతికా ।
అవంతీ దృష్టిస్తే బహునగర-విస్తార-విజయా
ధ్రువం తత్తన్నామ-వ్యవహరణ-యోగ్యావిజయతే ॥ 49 ॥

తాత్పర్యం:

జగజ్జననీ! నీ దృష్టి విశాలము (విశాలా), కల్యాణదాయకము (కల్యాణీ),

యుద్ధము చేయరానిది (అయోధ్యా), స్ఫుటమైన నల్లకలువల ప్రకాశాముచే (ధారా) మధురమైనది (మధురా), ఆసాంతము సుఖము చేకూర్చునది (భోగవతీ), రక్షణనిచ్చునది (అవంతీ), విజయవంతమై (విజయా) వర్ధిల్లుచున్నది ఇట్లు ఆయా ఎనిమిది నగరములయందున్నది.

వ్యాఖ్యానం:

అమ్మవారి దృష్టి, కనుచూపు లక్షణాలు ఒకవంక చెపుతూనే ఆదిశంకరులు, ఆయా విశేషణాలను ఊరి పేరులుగా సూచించి ఆమె ఆయా ఊళ్లలో ఉంటుంది అని చమత్కరిస్తున్నారు. అమ్మవారి దృష్టి విశాలమైనది, అంటే ఎక్కడకైనా చూపు ప్రసరించి ఆశ్రితులు ఎక్కడున్నా వారిని కటాక్షించగలది. కల్యాణప్రదమైనది, అంటే ఆమె చూపు మంగళకరమైనది. నల్లకలువలచేత ప్రకాశములో యుద్ధమున జయింపలేనివి, అయోధ్యలు. కృపాకటాక్షములు చూపుటలో ధార. ఏ విధంగా చూసినా మధురములు. అనంతమైన ఆనందాన్నిచే ఆభోగవతి. రక్షణకలిగించునది అనగా అవంతీ, ఈ విధంగా ఎలా చూసినా నీ చూపులు విజయవంతములు. ఆయా ఊళ్ల పేర్లతో వర్ధిల్లుతున్నాయి. ఆ ఊళ్ళ పేర్లు ఇవి, విశాల – బదరీనాథ్, కల్యాణి ముంబై నాసికల మధ్య ఒక ఊరు. అయోధ్య, ధార ఇప్పుడు ధార్ రాజస్థాన్‌లో ఉంది, మధుర, భోగవతి అంటే అమరావతి, అవంతి ఉజ్జయినీ నగరం. విజయ విజయనగరము.

ఇది ఆదిశంకరుల ఒక చమత్కారం, రెండోది, ఉత్తమ జాతి స్త్రీలకందరికీ ఈ దృష్టులు ఉంటాయి అనేది శాస్త్ర రహస్యము. లక్ష్మీధర పండితులు వీటి లక్షణాలు చెప్పారు. అవి:

విశాల – అంతర్వికాసమైనది, కల్యాణి – ఆశ్చర్యమైనది, అయోధ్య – కనుపాప పెద్దదిచేసి చూడడం, ధార – బద్ధకమైనది, మధుర – ఓరచూపు, భోగవతి– స్నేహపూరితమైన చూపు, అవంతి– ముగ్ధ, అమాయకమైన చూపు, విజయ – ఆలోలమైన వ్యాపకమైన చూపు.

ఆదిశంకరులు కేరళ దేశీయులు. అక్కడ నాట్యంలో నేత్రవిన్యాసానికి ఏంతో ప్రాముఖ్యమున్నది. ఆదిశంకరుల వివిధ శాస్త్ర పాండిత్య ప్రాభవం ఇందులో కనిపిస్తుంది.

కవీనాం సందర్భ-స్తబక-మకరందైక-రసికం
కటాక్ష-వ్యాక్షేప-భ్రమరకలభౌ కర్ణయుగలమ్ ।
అముంచంతౌ దృష్ట్వా తవ నవరసాస్వాద-తరలౌ
అసూయా-సంసర్గా-దలికనయనం కించిదరుణమ్ ॥ 50 ॥

తాత్పర్యం:

కవుల రచనలనెడి పుష్పగుచ్ఛాల నుండి జాలువారు తేనెనాస్వాదించడానికి నీ చెవులు ఆసక్తి తెలిపితే, నీ రెండు కనులు, ఆ నవరసాలను అనుభవించడానికి నీ రెండు చేవులను క్రీగంటి చూపు నెపంతో అంటిపెట్టుకొని ఉండగా, అసూయతో మూడవ కన్ను కొంచెం ఎరుపెక్కినట్టుంది.

వ్యాఖ్యానం:

ఆదిశంకరుల కవిత్వంలో ఈ శ్లోకమొక రత్నం, కవితా శిల్పానికి ఉదాహరణ. అతిశయోక్తి, రూపకం, ఉత్ప్రేక్షాది అలంకారాలు, వస్తు ధ్వని అన్నీ చేర్చి ఈ శ్లోకంలోనూ అమ్మవారి నేత్రాలనే వర్ణిస్తున్నారు. కవులకు రుచించే శ్లోకం. అమ్మవారి చెవులు కవుల కవిత్వంలోని తేనెధారలు అనుభవిస్తుందట. కవిత్వం అనే పూల గుచ్ఛాలలోని మకరందం గ్రోలుతాయట ఆమె చెవులు. చేస్తున్నది అమ్మవారి కనుల సోయగం వర్ణన. ఆమె తేనెటీగల వంటి కళ్ళు ఆ తేనెలు అనుభవించడానికి చెవుల వరకు సాగి ఉన్నాయట. అంటే అమ్మవారి కనులు ఆకర్ణాంతములు. ఇది చూసి నుదుట ఉన్న మూడో నేత్రానికి అసూయగలిగి కొంచెం ఎరుపెక్కిందట. అసలు కవిత్వానికి లక్షణం ఏమిటి అని ఒక మాటలో చెప్పాలంటే చమత్కారం అని చెప్పొచ్చు. ఇక్కడ ఎన్నెన్ని చమత్కారాలు. కవుల సాహిత్యమనే పుష్పగుచ్ఛాల మకరందం ఒకటి. అమ్మవారికి తనను

స్తుతించే కవులయందే కాదు, సర్వ సారస్వతం పైన మక్కువ ఒకటి. ఇది ఆమె అక్షరాకృతి. కనులు తీనేటీగలు ఇది ఒకటి, అవి చెవుల వరకు విశాలమై దీర్ఘమైన కనులు ఆమె కటాక్షాన్ని చూపడం ఇంకొకటి. ఇది ఇలా ఉండగా మూడవ కంటి ఎరుపును ఈ రెండు కనుల మకరంద ఆస్వాదనను చూసి అసూయ పొందడం అని చిత్రించడం మరొకటి. ఇలాంటి కవితా శిల్పం శంకరులకే చెల్లు!

శివే శృంగారార్ద్రా తదితరజనే కుత్సనపరా
సరోషా గంగాయాం గిరిశచరితే విస్మయవతీ ।
హరాహిభ్యో భీతా సరసిరుహ సౌభాగ్య-జననీ
*సఖీషు స్మేరా తే మయి జనని దృష్టిః సకరుణా ॥ **51** ॥*

తాత్పర్యం:

జననీ! నీ దృష్టి శివుని చూచునపుడు శృంగారముతో ఆర్ద్రమైనది, శివేతరులయందు జుగుప్స కలిగియున్నది, గంగ యందు రౌద్రము, శివుని చరితము వినునప్పుడు అద్భుతము, ఆయన ధరించిన పాముల యందు భయము, చెంగలువల గెలిచిన వీరము, సఖులయందు హాస్యము, నాయందు కరుణ కలిగియున్నది.

వ్యాఖ్యానం:

అమ్మవారు జగజ్జనని. ఆది శంకరులు ఈ శ్లోకంలో అమ్మవారి కనులలో ఏఏ సమయాల్లో ఎలా ఎలా ఏఏ రసాలు కనిపిస్తాయో చెపుతున్నారు. శివే! నీ కనులు శివుని చూసినప్పుడు శృంగారంతో ఆర్ద్రమవుతాయి. తదితరులను అంటే శివేతరులను చూస్తే జుగుప్స కనిపిస్తుంది. శివుని తలమీదనున్న సవతి గంగను చూస్తే రౌద్రం, శివుని అనేక రకాలైన చరిత్ర, హాలాహల భక్షణం, చితాభస్మ ధారణం, తోలు కట్టుకోడం, ఇవన్నీ విన్నప్పుడు అద్భుతం, ఆయన వేసుకున్న పాములు రకరకాలవి ఎనెన్నో తలలున్నవి చూసి భయం, కలువలను చూసి వాటిని గెలిచాననే వీరం, సఖులతో, చెలికత్తెలతో ఉన్నపుడు హాస్యం, తల్లివి

గనుక నాయందు కరుణ ఇలా ఎనిమిది రసాలు కనిపిస్తున్నాయి. ఈ శ్లోకంలో 9వ రసం శాంతం చెప్పలేదు. కొందరు వ్యాఖ్యాతలు శాంతం వేరే చెప్పవలసిన అవసరం లేదు, ఆమె స్వభావమే శాంతం, ఆమె మామూలుగా ఉన్నప్పుడు శాంత రసము చెప్పకనే ఉంటుంది అన్నారు.

రసం గురుంచి మొట్టమొదట వ్రాసిన భరతముని నాట్యశాస్త్రంలో ఎనిమిది రసాలే చెప్పారు. ఆయన శాంతం చెప్పలేదు. కొందరేమంటారంటే అన్ని రసాలకు చివర మనస్సునకు కలిగేది శాంతమే గనుక అది వేరే చెప్పనవసరంలేదని అంటారు.

ఆ సంగతి అలా ఉంచి ఈ శ్లోకంలో అమ్మవారి రసస్వరూపాన్ని దర్శిస్తే ఆమె రసదాయి, రసవతి, సరసవతి, సరస్వతి.

గతే కర్ణాభ్యర్ణం గరుత ఇవ పక్ష్మాణి దధతీ
పురాం భేత్తు-శ్చిత్తప్రశమ-రస-విద్రావణ ఫలే ।
ఇమే నేత్రే గోత్రాధరపతి-కులోత్తంస-కలికే
తవాకర్ణాకృష్ట స్మరశర-విలాసం కలయతః ॥ 52 ॥

తాత్పర్యం:

భూమిని ధరించు పర్వత రాజయిన హిమవంతుని వంశమునకు నీవు కలికితురాయివంటిదానవు. ఈ నీ రెండు కనులరెప్పలు చెవుల వరకు చేరి వింటికి కట్టిన వెంట్రుకలవలె అనిపించుచు, త్రిపురహరుని మనశ్శాంతిని భంగపరచుటకు మన్మథుడు చెవి వరకు లాగిన బాణమా అన్నట్లున్నవి.

వ్యాఖ్యానం:

అమ్మా! నువ్వు హిమవంతుని కులంలో కలికి తురాయివి. కొండ కూతురైన నువ్వు స్థాణువు అని పిలువబడి ఇంద్రియాలను జయించిన శివుని కూడా చలింపజేయగలవు. ఎందుకంటే చెవుల వరకు వ్యాపించిన నీ విశాలమైన కన్నుల పైనున్న కనురెప్పలు త్రిపురహరుడైన శంకరునికి

మోహాన్ని కలిగిస్తూ మన్మథుడు ఎక్కుపెట్టిన బాణంలా ఉన్నాయి. మన్మథుడి ఐదు బాణాలు శివుని చిత్తాన్ని చలింపజేయగలవో లేదో కాని నీ కనురెప్పలు ఆకర్ణాంతములై మన్మథుని 6వ బాణంలా ఉన్నాయి అంటున్నారు ఆదిశంకరులు. రహస్యం ఏమిటంటే ఆమె కడకంటి కొనచూపు శివునిపై మన్మథుని బాణానికి మించిన మోహాన్ని కలిగిస్తుంది. పై శ్లోకంలో ఆయనను చూసినప్పుడు ఆమె కనులలో శృంగారార్ద్రత అని ఒక పదం ప్రయోగించారు శంకరులు. అది ఒక ప్రత్యేకమైన విశిష్టమైన పదబంధము. శృంగారమువలన చిన్నగా కనులు చెమ్మరించుటయట! అట్టి కనుల రెప్పలు శివునికి మోహము కలిగింపకుండునా!

విభక్త-త్రైవర్ణ్యం వ్యతికరిత-లీలాంజనతయా
విభాతి త్వన్నేత్ర త్రితయ మిద-మీశానదయితే ।
పునః స్రష్టుం దేవాన్ ద్రుహిణ హరి-రుద్రానుపరతాన్
రజః సత్త్వం బిభ్రత్తమ ఇతి గుణానాం త్రయమివ ॥ 53 ॥

తాత్పర్యం:

ఓ శివుని ప్రియురాలా! నీ మూడు కన్నులు కాటుకచే వేరుచేయబడి, అర్ధ వలయాకారముగా నుండి, ఎరుపు, తెలుపు నలుపు రంగులలో రజస్సు, సత్త్వము, తమోగుణాలవలె నుండి ప్రళయానంతరము బ్రహ్మ విష్ణు మహేశ్వరులను తిరిగి సృష్టించుటకనునట్లు ప్రకాశించుచున్నవి.

వ్యాఖ్యానం:

ఆదిశంకరులు అమ్మవారి కంటి కాటుకకే ఎంత శక్తి ఉన్నదో తెలియజేస్తున్నారు. ఆమె ఈశాన దయిత అని సంబోధన, ఈశ్వరుని భార్య. ఈశ్వరుడు అంటే ప్రభువు. ఆయన పరమ ఈశ్వరుడు, పరమేశ్వరుడు. ఆమె ఆయన భార్య. ఆమె కంటి కాటుకకు ఎంత శక్తి? ఆమె పరాశక్తి. అమ్మా! నీ మూడు కనులకు కాటుక ధరించడంవల్ల, మూడు కనులు తెలుపు, నలుపు, ఎరుపు రంగులు కలిగి ఉన్నాయి. ఆ రంగులు తెలుపు

సత్త్వగుణాన్ని, ఎరుపు రజో గుణాన్ని, నలుపు తమస్సును తెలియజేస్తున్నాయి. త్రిమూర్తులు, బ్రహ్మ సృష్టికి, విష్ణువు స్థితికి, రుద్రుడు లయకు కారకులు. వరుసగా వారు ఈ మూడు గుణాలు కలిగినవారు, బ్రహ్మ సత్త్వము, విష్ణువు రజస్సు, రుద్రుడు తమస్సు. ప్రళయ కాలంలో వీళ్ళు అమ్మవారి కనులలో విలీనమై ఆమె తిరిగి కనులు తెరువగానే ఆమె ఆజ్ఞానుసారము మళ్ళీ సృష్టి స్థితి లయలు చేస్తున్నారు. ఈ మూడు కనులు మూడు రంగులై ఆ ముమ్మూర్తులను, వారి పనులను తెలియచేస్తున్నట్టుగా ఉన్నాయి అని శంకరుల వర్ణన. ఉత్ప్రేక్షాలంకారం, వస్తుధ్వని.

పవిత్రీకర్తుం నః పశుపతి-పరాధీన-హృదయే
దయామిత్రై ర్నేత్రై-రరుణ-ధవల-శ్యామ రుచిభిః ।
నదః శోణో గంగా తపనతనయేతి ధ్రువమముమ్
త్రయాణాం తీర్థానా-ముపనయసి సంభేద-మనఘమ్ ॥ 54 ॥

తాత్పర్యం:

పశుపతి యందు నిలిచిన హృదయముగల తల్లీ! దయాన్వితమైన నీ మూడు కన్నులు ఎరుపు, నలుపు, తెలుపు రంగులలో, శోణ నదము, గంగానది, యమునా నదుల తీర్థములై మా పాపములను పోగొట్టుటకై ఒకచోట సంగమము చేయుచున్నావు.

వ్యాఖ్యానం:

పై శ్లోకంలో చెప్పిన కనుల రంగులనే ఆదిశంకరులు త్రివేణీ సంగమం అని వర్ణిస్తున్నారు. ముందు అమ్మవారిని ఏమని సంబోధించారో చూడండి. పశుపతి పరాధీన హృదయే అన్నారు. అంటే పశుపతి అయిన శివుని యందు అధీనమైన హృదయంగల తల్లి. పశుపతి అంటే పశువులకు పతి. లోకంలోని ప్రాణులందరూ పశువులు, అంటే స్వతంత్రం లేని పశుప్రాయమైన జీవితం గలవారు. మనమే. ఆయన మనకు ఈశ్వరుడు. ఆమెకూ మనమే సంతానం. ఆమె మనయందు దయార్ద్ర దృష్టితో

ఏం చేస్తోందో శంకరులు చెపుతున్నారు. మనమందరమూ ఏదోరకంగా అపవిత్రులం. పాపాలు తెలిసో తెలియకో నిత్యం చేస్తూ ఉండేవాళ్ళం. మనకు మరి దిక్కెవరు? అమ్మవారు. ఆమె తన మూడు కనుల నుండి మూడు రంగులు ఎరుపు, తెలుపు, నలుపు గల మూడు నదులను, ఎర్రని శోణా నదం, తెల్లని గంగ , నల్లని యమునా నదులను త్రివేణీ సంగమంగా ఏర్పరచి మనలను పవిత్రం చేస్తోంది. ఆర్ద్రం అన్న మాటకి చెమ్మగిల్లిన అని అర్థం చెప్పుకుంటే మనపై దయతో చెమ్మగిల్లిన కనులతో అమ్మవారే తన మూడు నేత్రాలను మనకి త్రివేణీ సంగమంగా ఇచ్చి మనలని పవిత్రం చేస్తోంది అని భావన. అది ఆమెకు భక్తులయందున్న కరుణ.

నిమేషోన్మేషాభ్యాం ప్రలయముదయం యాతి జగతి
తవేత్యాహుః సంతో ధరణిధర-రాజన్యతనయే ।
త్వదున్మేషాజ్జాతం జగదిద-మశేషం ప్రలయతః
పరేత్రాతుం శంకే పరిహృత-నిమేషా-స్తవ దృశః ॥ 55 ॥

తాత్పర్యం:

పర్వతరాజ పుత్రికా! ఈ జగత్తునకు నీ కనులు తెరచిన సృష్టి, మూసిన ప్రళయము సంభవించునని మహానుభావులు చెప్పుదురు. నీ కనులు తెరచుటవలన ఏర్పడిని ఈ జగత్తును ప్రళయం నుంచి రక్షించడానికి నువ్వు కనురెప్పలు మూయక ఉంటివని తలంచుచున్నాను.

వ్యాఖ్యానం:

అమ్మవారి నేత్ర వర్ణనలో ఎన్నో ఆగమ రహస్యాలు ఆదిశంకరులు తెలియజేస్తారు. ఆగమం అంటే సంప్రదాయంగా మనకు పూర్వులు అందించిన జ్ఞానం. శక్తి ఆగమాలు సుమారు 77 ఉన్నాయి. ఆగమాలలో అనేక రకాలైన విషయాలుంటాయి. ముఖ్యమైనది జ్ఞాన కాండ. శక్తి ఆగమాలలో అమ్మవారి కనులే సృష్టికి, స్థితికి, సంహారానికి కారణం అని

సత్పురుషులు చెప్పారు. ఆమె కనులు తెరిస్తే సృష్టి, మూస్తే ప్రళయం అని విజ్ఞులు అంటారు. ఈ శ్లోకంలో అమ్మవారి నేత్రాలను ఆ విధంగా వర్ణిస్తున్నారు ఆదిశంకరులు. అమ్మా! పర్వతరాజ పుత్రీ! ఈ జగత్తు నీవు కనులు మూస్తే ప్రళయాన్ని, తెరిస్తే సృష్టిని పొందుతుంది. ఆ విషయం తెలిసిన నువ్వు నీ భక్తులయందు, నీ సృష్టిలో ప్రాణులయందు అవ్యాజమైన కరుణ వలన కనులు మూస్తే ఎక్కడ నశించి పోతారో అని కనులు రెప్పవేయడమే లేదు! విచిత్రం ఏమిటి అంటే అసలు దేవతలందరూ కనురెప్పలు వేయరట. అందుకే వారిని అనిమేషులు, రెప్ప వేయని వారని పిలుస్తారు. కాని అమ్మవారు కనురెప్ప వేయకపోడానికి కారణం ఆమె ప్రళయాన్నుంచి జగత్తుని రక్షించడమే అని ఆదిశంకరులు చమత్కరిస్తున్నారు. ఈ అలంకారాన్ని ఫలోత్ప్రేక్ష అంటారు. ఆమె కనురెప్పల కదలికలోనే సృష్టి స్థితి లయలు ఇమిడి ఉన్నాయి.

తవాపర్ణే కర్ణే జపనయన పైశున్య చకితా
నిలీయంతే తోయే నియత మనిమేషాః శఫరికాః ।
ఇయం చ శ్రీ-ర్బద్ధచ్ఛద పుటకవాటం కువలయం
జహాతి ప్రత్యూషే నిశి చ విఘటయ్య ప్రవిశతి ॥ 56 ॥

తాత్పర్యం:

ఓ అపర్ణా! ఎప్పుడూ ఏదో రహస్యం చెప్పడానికా అన్నట్టు నీ చెవులకు దగ్గరగా ఉన్న నీ కళ్ళను చూసి శఫరిక అను చేపలు కనులు మూయక నీటిలో దాగుకొంటున్నాయి. నల్లకలువలు నీ కనుల అందంతో పోటీ పడలేక సిగ్గుపడి పగలు ముడుచుకుపోయి రాత్రి తెరుచుకుంటున్నాయి.

వ్యాఖ్యానం:

అమ్మవారి నేత్ర వర్ణనలో ఇంకొక చమత్కారం ఆదిశంకరులు ఈ శ్లోకంలో చెప్తున్నారు. లోకంలో కవులు సాధారణంగా అందమైన స్త్రీల కనులను నల్లకలువలతోను, చేపలతోనూ పోలుస్తారు. కమల నయన, అనో మీనాక్షి అనో వర్ణిస్తారు. అమ్మవారి నేత్రాల విషయంలో ఇది

ఇంకోలా చమత్కరించారు ఆదిశంకరులు. ఆమె కనులు దీర్ఘంగా చెవుల వరకు ఉండి ఆమె చెవులో ఏదో రహస్యం చెప్తున్నట్టున్నాయట. అదేదో తమ గురించేమోనని ఆడు చేపలు నీటిలో దాక్కుని కనులు మూయకుండా ఉన్నాయట. ఇది ఆడు చేపల సహజమైన లక్షణం. నీటిలో ఉండడం, కనులు మూయకపోవడం. ఈ రెండింటికి అమ్మవారి కనుల సౌందర్యం వాటికి మించి ఉండడంవలన అని ఒక కారణం చూపించడం ఉత్ప్రేక్ష. ఇక రెండవది నల్ల కలువలు. ఇవి పగలు ముడుచుకుని రాత్రిపూట వికసిస్తాయి. దానికి కూడా అమ్మవారి కనుల సౌందర్యంతో తాము పోటీ పడలేమని, రాత్రిపూట వికసించి పగలు మూసుకుని ఉన్నాయట. పగలైతే ఎవరైనా చూస్తారేమోనని రాత్రే వికసించడం, ఇది అతిశయోక్తి అలంకారం. లోకంలో సహజమైన చేపల లక్షణాన్ని నల్ల కలువల లక్షణాన్ని చమత్కరించి అమ్మవారి కనుల సౌందర్యాన్ని వర్ణించడం ఆదిశంకరుల కవితా ప్రతిభ. ఈ శ్లోకంలో అమ్మవారిని అపర్ణా అని సంబోధిస్తున్నారు. అపర్ణ అంటే అమ్మవారు పరమ శివునికై తపస్సు చేసినపుడు ఆకులు అంటే పర్ణములు కూడా తినలేదని ఆమెను దేవతలు అపర్ణా అని పిలిచారు. అపర్ణ అంటే ఏ ఋణమూ లేనిది అని ఇంకో అర్థం. ఆమె పాతివ్రత్యాన్ని పవిత్రతను సౌందర్యాన్ని వర్ణించే శ్లోకం ఇది.

దృశా ద్రాఘీయస్యా దరదలిత నీలోత్పల రుచా
దవీయాంసం దీనం స్నపయ కృపయా మామపి శివే ।
అనేనాయం ధన్యో భవతి న చ తే హానిరియతా
వనే వా హర్మ్యే వా సమకర నిపాతో హిమకరః ॥ 57 ॥

తాత్పర్యం:

శివే! విశాలమైన నీ నల్లకలువలవంటి కనుల కాంతి నిండిన చూపుతో దయతో దూరముగా నున్న నన్ను కూడా తడుపుము. దానివల్ల నీకే లోటూ లేదు, నేనూ ధన్యుడను అవుతాను. అడవిలోనైనా భవనాలలోనైనా చంద్రుని వెన్నెల సమంగా పడుతుంది కదా!

వ్యాఖ్యానం:

అమ్మవారి నేత్ర వర్ణనలో చివరి శ్లోకం ఇది. ఇంతసేపూ ఆమె కన్నుల సౌందర్యాన్ని వర్ణించిన శంకరులు ఇందులో ఆమె కటాక్షం కోరుతున్నారు. అమ్మా శివే! నీ కనులు దీర్ఘముగా విశాలముగా ఉన్నాయి. నీవు లోకమాతవు. ఇటువంటి కనులతో నువ్వు ఏదేనా, ఎక్కడున్నదైనా, ఎంత దూరంలో ఉన్నదైనా చూడగలవు. నీ దయగల చూపులతో నన్ను కూడా తడుపు, నీ కరుణా కటాక్ష దృష్టిలో నన్ను మునకలు వేయనీ, స్నానం చేయించు. నేను దీనుడను. ఇలా చెయ్యడం వల్ల నీకేం హాని కలుగదు, తరిగిపోదు. నేనైతే దాని వలన ధన్యుడనౌతాను. లోకంలో చంద్రుని వెన్నెల మేడలు మిద్దెలైనా అడవి అయినా అన్నిటా ఒకలాగే ప్రసరిస్తుంది కదా. దానివల్ల చంద్రుడి వెన్నెలకు ఏమైనా నష్టం ఉందా? ఇలా అనడంలో శంకరుల వారి ఉద్దేశం ఏమిటంటే చంద్రుడు అమ్మవారి కనులలో ఒకటి. లేదా ఆమె శిరసునే ఉండేది. అమ్మకి ఈ విషయం గుర్తు చేసి దీనుడైన తనయందు కరుణ చూపమని అమ్మవారిని ప్రార్తిస్తున్నారు.

అరాలం తే పాలీయుగల-మగరాజన్యతనయే
న కేషా-మాధత్తే కుసుమశర కోదండ-కుతుకమ్ ।
తిరశ్చీనో యత్ర శ్రవణపథ-ముల్లంఘ్య విలసన్
అపాంగ వ్యాసంగో దిశతి శరసంధాన ధిషణామ్ ॥ 58 ॥

తాత్పర్యం:

అమ్మా పార్వతీ నీ కణతలు చూస్తే మన్మథుని కోదండంలా ఉందని ఎవరికి అనిపించదు? ఎందుకంటే నీ కటాక్ష వీక్షణలు కణతలు దాటి చెవులను దాటి ఎక్కుపెట్టిన మన్మథ బాణంలా అనిపిస్తున్నాయి.

వ్యాఖ్యానం:

బ్రహ్మాది దేవతలే వర్ణించలేని, ఎంత వర్ణించినా తనివి తీరని, అమ్మవారి అందాన్ని ఆదిశంకరులు భక్తిపారవశ్యంలో, తను ఆమె అందాన్ని దర్శించి, తన అనుభూతిని మనకి పంచి ఇచ్చే శ్లోకాలు ఈ సౌందర్యలహరి లో నిక్షిప్తమై

ఉన్నాయి. అమ్మవారి కనులు, పైన పది శ్లోకాలలో వర్ణించి, ఇప్పుడు ఈ శ్లోకంలో ఆమె కణతలను వర్ణిస్తున్నారు. కంటికి చెవికి మధ్య ప్రదేశం కణతలు. అమ్మా పర్వత రాజ తనయా! నీ కణతలు మన్మథుని కోదండంలా ఉంది అంటున్నారు. కనులు కటాక్ష వీక్షణలు చూపుతున్నాయి. దీర్ఘమైన కనులకు చెవులకు మధ్యలో ఉన్న కణతలు ఎక్కుపెట్టిన మన్మథుని ధనస్సులా ఉన్నాయట. పార్వతీ దేవి సుకుమారి, అయినా పర్వత రాకుమారి. అంటే పుట్టుకతో వచ్చిన కాఠిన్యము, లోకంలో సౌందర్యం రాశి పోసిన పుట్టుకచే వచ్చిన సౌకుమార్యం, ఈ రెండింటిని గుర్తు చేస్తూ ఉండడానికే ఆమె అందాన్ని వర్ణిస్తూ మధ్య మధ్యలో పర్వత రాజ తనయా అని సంబోధించడం. ఇది కవిత్వంలో నిహితమైన చమత్కృతి. ఒక భ్రాంతిని కలుగ చేసే ఈ వర్ణనలో ఉన్నది భ్రాంతిమదలంకారం.

స్ఫురద్గండాభోగ-ప్రతిఫలిత తాటంక యుగలం
చతుశ్చక్రం మన్యే తవ ముఖమిదం మన్మథరథమ్ ।
యమారుహ్య ద్రుహ్యత్యవనిరథ మర్కేందుచరణం
మహావీరో మారః ప్రమథపతయే సజ్జితవతే ॥ 59 ॥

తాత్పర్యం:

అమ్మా! కాంతివంతమైన నీ చెక్కిళ్ళపై నీ తాటంకాలు ప్రతిబింబించి నీ ముఖం నాలుగు చక్రాలున్న మన్మథ రథం అయిందా అనిపిస్తుంది. భూమిని రథం చేసుకొని సూర్య చంద్రులు చక్రాలుగా ప్రమథపతి రాగా, నీ ముఖమే రథం చేసుకుని మారుడు, పరమ శివుడినే ఎదిరించగలుగుతున్నాడు.

వ్యాఖ్యానం:

అమ్మవారి చెక్కిళ్ళను మనోహరంగా వర్ణించే శ్లోకం. ఆదిశంకరుల అతి మనోజ్ఞమైన కవిత్వానికి ఈ శ్లోకం ఒక రమణీయమైన ఉదాహరణ. అమ్మవారి చెవినున్న లోలకులు అద్దాలవంటి ఆమె చెక్కిళ్ళపై ప్రతిబింబించి ఆమె ముఖం నాలుగు చక్రాలున్న మన్మథ రథంలా ఉందట! ఎంత అతిలోకమైన వర్ణన. ఒడలు పులకరించే ఈ వర్ణనకి కారణాలు రెండు.

ఒకటి మన్మథుడు శ్రీవిద్యా ఉపాసకుడు. అతనికంటూ వేరే శక్తి లేదు. ఉన్నదల్లా అమ్మవారి శక్తే. ఆ శక్తినే ఉపయోగించి శివుని జయించగలడు. రెండవది అటు ఉన్నవాడు పరమేశ్వరుడు. ఆ శివుడెటువంటివాడు? ఆయన మహాశక్తిమంతులైన త్రిపురాసురులను జయించినవాడు. ఆయన రథం భూమి. చక్రాలు సూర్యచంద్రులు. విల్లు మంధర పర్వతం, బాణం స్వయంగా విష్ణుమూర్తి. అటువంటి శంకరుని మోహపరచడానికి మన్మథుని ఆయుధం అమ్మవారే. ఆమె ముఖమే మన్మథరథం.

ఈ శ్లోకంలో వ్యాఖ్యానం చేస్తూ కైవల్యశర్మ అనే ఒక పండితుడు ఆది శంకరులు ఈ శ్లోకం మూడవ పాదంలో మొదటి పదం 'ఆరూహ్య'కి బదులు 'ఆశ్రిత్య' అని ఉంటే బాగుంటుంది అని సవరణ తెలిపారు. ఆరూహ్య అంటే ఎక్కడం, అమ్మవారి ముఖాన్ని మన్మథుడు రథంగా వాడుకుని అధిరోహించాడు అని భావం. కైవల్య శర్మ అంటారు, అమ్మవారి ముఖాన్ని రథంగా ఆశ్రయించి మన్మథుడు శివుని మోహింపజేశాడు అని. ఇది మన పరంపరలో ఉన్న ఒక ఉత్తమమైన సంస్కారం.. చెప్పినది ఎంతవారైనా లోపాన్ని సవరించడం ఉపనిషత్ సంప్రదాయంలో మనకు పూర్వులు అందించిన సంస్కారం. నక్కీరన్ అనే ఒక కవి శివుని కవిత్వంలోనే లోపం చూపించి, నెత్తిన కన్ను ఉన్నా తప్పు తప్పే అంటాడు. ఇక్కడ ఆదిశంకరుల కవిత్వంలో తప్పేమీ లేదు కాని ఆ పదానికి బదులు ఈ పదం వాడితే బాగుండును అనడం ఒక విశేషం. సౌందర్యలహరికి అందుకే 36కి పైబడి వ్యాఖ్యానాలున్నాయి. ఒక్కొక్క వ్యాఖ్యానం ఆ సౌందర్య సముద్రంలోని రత్నాలను అన్వేషించి మనకిచ్చింది.

సరస్వత్యాః సూక్తీ-రమృతలహరీ కౌశలహరీః
పిబంత్యాః శర్వాణి శ్రవణ-చులుకాభ్యా-మవిరలమ్ ।
చమత్కారః-శ్లాఘాచలిత-శిరసః కుండలగణో
ఝణత్కారైస్తారైః ప్రతివచన-మాచష్ట ఇవ తే ॥ 60 ॥

తాత్పర్యం:

అమ్మా శర్వాణీ! సరస్వతీ దేవి యొక్క అమృతలహరీ సౌభాగ్యాన్ని,

చమత్కారాన్ని, పొగడ్తను, తెలియజేయాడానికి నువ్వు తల ఊపుతూ ఉంటే, నీ చెవి కుండలాలు ఊగి, ఆ నీ చమత్కారాన్ని పొగడ్తను ఝుణత్ ఝుణత్ శబ్దాల ద్వారా తెలుపుతున్నాయి.

వ్యాఖ్యానం:

అమ్మవారి కర్ణాభరణాలనే వర్ణిస్తున్నారు ఈ శ్లోకంలో కూడా. అమ్మవారిని శర్వాణీ అని సంబోధిస్తున్నారు. శర్వుని భార్య. ఆమె సరస్వతీ దేవి యొక్క గానామృతాన్ని ఆస్వాదిస్తోంది. ఆమె తన చెవులనే దోసిళ్ళతో ఆ అమృతాన్ని గ్రోలుతూ ఆహా ఎంత బాగుంది అనకుండా ఆమోదంగా, ప్రోత్సాహకరంగా, శ్లాఘించడానికని తల ఊపితే ఆమె తాటంకాలు ఝుణత్ ఝుణత్ అనే శబ్దాలతో ప్రశంసించాయని వర్ణన. ఈ శ్లోకంలో చెవి శృతికి సంకేతం. తాటంకాల ఝుణత్ ఝుణత్ శబ్దం లయకు సంకేతం. ఆమె శిరః కంపనం తాళానికి సంకేతం. శంకరులవంటి ఒక అవతార పురుషల కవిత్వంలో వాక్కు అర్థం వెనుక పరుగులిడుతుంది!

అసౌ నాసావంశ-స్తుహినగిరివంశ-ధ్వజపటి
త్వదీయో నేదీయః ఫలతు ఫల-మస్మాకముచితమ్ ।
వహత్యంతర్ముక్తాః శిశిరకర-నిశ్వాస-గలితం
సమృద్ధ్యా యత్తాసాం బహిరపి చ ముక్తామణిధరః ॥ 61 ॥

తాత్పర్యం:

మంచుకొండకు పతాక దండమువంటి ఓ పార్వతీ! నీ ముక్కు అనే దండములో నుండి ఊపిరి వదులునప్పుడు లోనున్న చల్లని (చంద్ర సంబంధమైన) ముత్యాల సమూహముచే ముక్కు బయట కూడా ముత్యాన్ని ధరిస్తోంది. అవి మాకు కోరిన ఫలములనిచ్చుగాక.

వ్యాఖ్యానం:

అమ్మవారి ముక్కు ఈ శ్లోకంలో వర్ణించబడింది. ఆదిశంకరులు శ్లోకం మొదటి పాదంలో రెండుసార్లు వంశ అనే పదం ప్రయోగిస్తారు. 'అసౌ నాసావంశ-స్తుహినగిరివంశ - ధ్వజపటి' అని, మొదటిసారి వంశ పదం ముక్కుకి విశేషణం రెండోసారి, హిమాలయపు వంశానికి ఆమె

పతాకంవంటిది అని ఇక్కడ వంశం నామవాచకం. వంశ అనే పదానికి సంస్కృతంలో రెండు అర్థాలున్నాయి, ఒకటి వెదురు, రెండు కులం. ఆమె ముక్కు వెదురు దండంలా ఉంది అని వర్ణన. ఎందుకు వెదురుతో సరిపోల్చారంటే, వెదురులో ముత్యాలు ఏర్పడతాయని శాస్త్రం. ఆమె ముక్కు చివర ఒక ముత్యం ఆభరణంగా ఉంది. ఆమె విడిచిన ఊపిరి చంద్రునివలన చల్లబడి, గాలి ముక్కు చివరకు చేరగానే ముత్యమై నీ ముక్కుకు ఆభరణం అయింది అంటారు. ఎందువలన అంటే అమ్మ ముక్కు అనే వెదురు దండంలో ఎన్నో ముత్యాలు ముందే ఉన్నాయి అని చెప్పి అట్టి నాసిక మాకు కోరిన కోర్కెలు తీర్చుగాక అని ప్రార్థన, నాసికా వర్ణన. ఇందులో కొన్ని యోగ రహస్యాలున్నాయి. ప్రాణాయామంలో ఊపిరి పీల్చుట పూరకము, పీల్చిన గాలి లోపల ఉంచుట కుంభకము, విడచుట రేచకము. ముక్కుకు ఎడమవైపు నుండి గాలి వదులునపుడు అది ఇడా నాడి ద్వారా వెలువడునపుడు చంద్రుని శీతలత్త్వము దానిని సోకి అది లోపల ఉన్న ముత్యముల సంసర్గముచే ముత్యమై వెలువడి, ఆమెకు నాసాభరణమైనదట. ఇది యొక యోగ రహస్యము. సంస్కృతంలో ముక్తాఫలము అంటే ముత్యము. ముక్తి అన్న మాటకు ముత్యము అంత సన్నిహితమైనది. అమ్మవారిని కోరుకునేది ముక్తి, , ముత్యములు కాదు. ఆ కోరిక ఎలా కోరాలో శంకరులు చెప్తున్నారు, మాకు ఉచితమైన ఫలాన్ని ప్రసాదించు అని కోరుకుంటున్నారు.

ప్రకృత్యా--రక్తాయా-స్తవ సుదతి దందచ్ఛదరుచేః
ప్రవక్ష్యే సదృశ్యం జనయతు ఫలం విద్రుమలతా ।
న బింబం తద్బింబ-ప్రతిఫలన-రాగా-దరుణితం
తులామధ్యారోఢుం కథమివ విలజ్జేత కలయా ॥ 62 ॥

తాత్పర్యం:

అమ్మా! మంచి పలువరసగలదానా! ఎర్రని నీ పెదవులకు సామ్యము చెప్పెదను. నీ పలువరుస కాంతిచే నీ పెదవుల ఎర్రదనము, పగడానికి

పండు ఉంటే అలా ఉంటుందేమో. దొండపండు (బింబ ఫలము) అందామా అంటే అవి నీ పెదవుల ఎరుపే వాటిపై ప్రతిబింబించగా దానిలో ఒక కళ (16వ వంతు) అయినా ఎరుపు లేవే, అందుచే సరిపోల్చడానికి సిగ్గుపడుతున్నాయి.

వ్యాఖ్యానం:

సౌందర్యలహరి అమ్మవారు. ఆమె సౌందర్యారాధనలో మునకలై భక్తిపారవశ్యంతో ఆమె అందాన్ని వర్ణిస్తున్నారు శంకరాచార్యులువారు. ఇప్పుడు ఆమె పెదాల వర్ణన. పెదాల వర్ణన చేస్తూ ముందుగా ఆమెను శంకరులు అమ్మా! సుదతీ అని సంబోధిస్తున్నారు. అంటే మంచి పలువరుసగలదానా అని. పెదవి విప్పితే కనిపించేది పలువరుసే కదా. లోకంలో కవులు పెదాలను దొండ పండుతో పోలుస్తారు. లేదా పగడాలతో పోలుస్తారు. శంకరుల వారికి ఇవి రెండూ చాలలేదు. పగడపు తీగ ఒకవేళ పండు పండితే నీ ఎఱ్ఱని పెదాలను వాటితో పోల్చవచ్చు. కాని పగడంకి పళ్ళు లేవే. ఇంక ఉన్నవి దొండపళ్ళు. దీనికి సంస్కృతంలో బింబఫలం అని పేరు. అసలు అవి నీ పెదవుల దగ్గర పెడితే నీ పెదాల ఎఱ్ఱదనం వాటిపై ప్రతిబింబించి దానికి బింబం అని పెరొచ్చిందేమో! అందుకని దొండపళ్ళు సిగ్గుపడి నీ పెదాల ఎఱ్ఱదనానికి సామ్యం రాలేకపోతున్నాయి. అమ్మవారి రూపమే ఎరుపు. ఈ శ్లోకంలో అతిశయోక్తి అలంకారం.

స్మితజ్యోత్స్నాజాలం తవ వదనచంద్రస్య పిబతాం
చకోరాణా-మాసీ-దతిరసతయా చంచు-జడిమా।
అతస్తే శీతాంశో-రమృతలహరీ మామ్లరుచయః
పిబంతీ స్వచ్ఛందం నిశి నిశి భృశం కాంజికధియా ॥ 63 ॥

తాత్పర్యం:

అమ్మా! నీ ముఖచంద్రము చిరునవ్వు నుంచి జాలువారు వెన్నెలను త్రాగి చకోరముల ముక్కులు అతి తీపిచే మొద్దుబారినవి. అందువలన

ఏదేనా పుల్లనిది త్రాగాలనే కోరికతో గంజి అనుకొని స్వేచ్ఛగా ప్రతి రాత్రి చంద్రుని అమృతలహరిని తాగుతున్నాయి.

వ్యాఖ్యానం:

అమ్మవారి చిరునవ్వు ఈ శ్లోకంలో వర్ణించబడింది. నవ్వు ఆరు రకాలు, 1. స్మితము, 2. హసితం, 3. విహసితం, 4. ఉపహసితం, 5. అపహసితం, 6. అతిహసితం. ఉత్తమ ప్రకృతిగలవారికి మొదటి రెండు రకాలు, స్మితం – హసితం, మధ్యమ ప్రకృతిగలవారికి తరువాతి రెండు అంటే విహసితం – ఉపహసితం, అధమ ప్రకృతి వాళ్ళకి చివరి రెండు అంటే అపహసితం – అతిహసితం అని శాస్త్రం చెప్తోంది. స్మితం అంటే కొంచెం వికసించిన చెక్కిళ్లతో, అందమైన క్రీగంటి చూపుతో పలువరుస కనబడకుండా గంభీరంగా ఉండేది. ఇది ఉత్తమ ప్రకృతిగల స్త్రీ పురుషులలోనే ఉంటుంది.

ఆదిశంకరులు ఈ శ్లోకంలో అమ్మవారి స్మితంని వర్ణిస్తున్నారు. ఇది ఒక విచిత్రమైన వర్ణన. లోకంలో చకోర పక్షులు చంద్రుని వెన్నెలను త్రాగి బ్రతుకుతాయట. శంకరులు అది ఇంకోలా చెప్పారు. అమ్మా! నీ చిరునవ్వు అనే వెన్నెల అమృత ధారా ప్రవాహం త్రాగి త్రాగి చకోర పక్షుల ముక్కులు ఆ తీపికి మొద్దుబారిపోయాయి. వ్యవహారంలో తీపి ఎక్కువగా తింటే ఇలా అవుతుంది. ఇది అందరికీ అనుభవమే. అలాంటప్పుడు మరేదీ రుచించదు, రుచి తెలియదు. అప్పుడేం చేస్తామంటే ఏదో పులుపో కారమో కొంచెం తింటే తిరిగి నోటికి రుచి తెలుస్తుంది. అందుకని చకోరాలు వెతికి చివరికి చంద్రుని వెన్నెలనే పుల్లగా ఉన్న గంజి అనుకొని ప్రతి రాత్రి అదే త్రాగుతున్నాయట. అంటే అమ్మవారి చిరునవ్వనే అమృతధారకి అలవాటు పడిన చకోరాలకు, చంద్రుని వెన్నెలలోని అమృత ధార గంజిలా ఉందని భావం. అతిశయోక్తి అలంకారం. అమ్మవారి చిరునవ్వుకు మించిన అమృతం ఏదీ. ఏదీ దానికి సాటి రాదనేది అతిశయోక్తి కాదు.

అవిశ్రాంతం పత్యుర్గుణగణ కథామ్రేడనజపా
జపాపుష్పచ్ఛాయా తవ జనని జిహ్వా జయతి సా ।
యదగ్రాసీనాయాః స్ఫటికదృష-దచ్ఛచ్ఛవిమయి
సరస్వత్యా మూర్తిః పరిణమతి మాణిక్యవపుషా ॥ 64 ॥

తాపర్యం:

జననీ! ఎల్లవేళలా విశ్రాంతి లేకుండా నీ భర్త గుణగణాలను జపించడం వల్ల నీ నాలుక ఎర్రమందారంలా అయింది. ఆ నీ నాలుకపై స్వచ్ఛమైన స్ఫటికం వంటి సరస్వతి కూర్చొని ఉండడం వల్ల ఆ ఎరుపు ఆవిడకు సోకి ఆమె పద్మరాగంలా ప్రకాశిస్తోంది.

వ్యాఖ్యానం:

జననీ! అని సంబోధించి ఆదిశంకరులు ఈ శ్లోకంలో అమ్మవారి నాలుక ఎరుపుదనాన్ని వర్ణిస్తున్నారు. నాలుక అందరికీ ఎర్రగానే ఉంటుంది. వైద్యులు నాలుక చూసి ఆరోగ్యం ఎలా ఉందో చెప్తారు. నాలుక రుచులను తెలుసుకొనే ఇంద్రియం. అందుకనే రసనా అని సంస్కృతంలో పేరు. ఆడిన మాటలో పద, అర్థాల రుచి అయినా, తిన్న పదార్థంలో రుచి అయినా, నాలుకకే తెలుసు. ఇంద్రియాలలో మానవులు నిగ్రహించుకోవలసినది నాలుక ఒకటి. అమ్మవారి నాలుక వర్ణనలో రహస్యం గ్రహించిన వారికి ఆమె అనుగ్రహం వలన ఆ నిగ్రహం తనంత వస్తుంది.

అమ్మవారు అవిశ్రాంతంగా, అంటే విశ్రాంతి అనేది లేకుండా, పతి యొక్క గుణగణ కథలను తిరిగి తిరిగి జపిస్తోందట. త్రిపురాసుర సంహారం, హాలాహల భక్షణం ఇలా ఎన్నో కథలున్నాయి. అవి జపిస్తోంది అమ్మవారు. జపించడం అంటే ఏకాగ్రతతో అదే పని చెయ్యడం. వేరే ఆలోచనలు లేకుండా. అలా జపించడం వల్ల ఆమె నాలుక ఎఱ్ఱనయిందట. రాగం అంటే ఎరుపు, ప్రేమ, శృంగార భావం. సిగ్గుపడితే స్త్రీలకు ముఖం ఎఱ్ఱనవుతుంది. ఆ విధంగా అమ్మవారి నాలుక జపాపుష్పం అంటే మందారంలా ఎరుపెక్కింది. భర్త గుణగణాలను ప్రశంశించి ఆమె నాలుక

మందారాలు పూసింది. ఆ నాలుకపై అతి స్వచ్ఛమైన స్ఫటికం వంటి తెల్లనైన సరస్వతి అమ్మవారు కూర్చొని ఉంది. ఈమె జిహ్వాగ్రాన ఉన్న ఆమె ఎఱ్ఱని మాణిక్యంలా ప్రకాశిస్తోంది.

అమ్మవారి జిహ్వాగ్రాన సరస్వతి ఉండడం ఒకటి. ఆమె భర్తృ గుణగణాలను ప్రశంశించడం ఒకటి. నాలుకపై నిగ్రహం కావాలంటే పరమశివుని నామస్మరణం అమ్మవారి కథనం పాటించాలి.

రణే జిత్వా దైత్యా నపహృత-శిరస్త్రైః కవచిభిః
నివృత్తై-శ్చండాంశ-త్రిపురహర-నిర్మాల్య-విముఖైః ।
విశాఖేంద్రోపేంద్రైః శశివిశద-కర్పూరశకలా
విలీయంతే మాతస్తవ వదనతాంబూల-కబలాః ॥ 65 ॥

తాత్పర్యం:

మాతా! యుద్ధంలో రాక్షసులను జయించి శిరస్త్రాణాలు తొలగించి కవచాలు మాత్రమే ధరించి తిరిగివచ్చు కుమారస్వామి, ఇంద్రుడు, విష్ణువు, శివుడు తినిన తాంబూలాన్ని చండునికే వదిలి, కర్పూరకళికలుగల నీ తాంబూలం తిని ఆనందిస్తున్నారు.

వ్యాఖ్యానం:

ఈ శ్లోకంలో అమ్మవారి తాంబూలం యొక్క ప్రసాద మహిమ, ఆమె వాత్సల్యం వర్ణించారు ఆదిశంకరులు. దేవతలు రాక్షసులతో యుద్ధానికి వెళ్లి గెలిచి తిరిగి వస్తున్నారు. పరమ శివుడు, కుమారస్వామి, ఇంద్రుడు, విష్ణుమూర్తి. పరమ శివుడు త్రిపురహరుడు. కుమారస్వామి సైన్యాధ్యక్షుడు, మహాసేనాని అని ఆయన పదవి. ఇంద్రుడు దేవతల రాజు దేవేంద్రుడు. విష్ణుమూర్తి స్థితికారకుడు. యుద్ధం నుంచి తిరిగి వస్తున్నవారు వీరు. యుద్ధం అయిపోయింది గనుక కవచాలు, శిరస్త్రాణాలు తొలగించుకొని వస్తున్నారు. పరమ శివుని ప్రసాదం అంటే ఆయన తాంబూలం సేవిస్తే అందులో భాగం ఆయన ప్రమథ గణాలకు చెందిన చండుడు అనేవానికి చెందుతుంది. అది పరిపాటి. మిగిలిన ముగ్గురూ అంటే కుమారస్వామి,

ఇంద్రుడు, విష్ణువు అమ్మవారి సన్నిధికి వచ్చారు. యుద్ధంలో విజయం పొంది వచ్చిన బిడ్డలపై అమ్మవారు వాత్సల్యంతో తన తాంబూలంలోని చంద్రకాంత శిలల ముక్కలవంటి పచ్చ కర్పూరపు తునకలతో ఉన్న భాగాలను ప్రసాదంగా ఇచ్చింది. తల్లికి పిల్లలపై ఉన్న వాత్సల్యం వారెంత ఎదిగినా బిడ్డలనే ప్రేమ ఇందులో ఆర్ద్రంగా వర్ణించారు ఆదిశంకరులు.

విపంచ్యా గాయంతీ వివిధ-మపదానం పశుపతే-
స్త్వయారబ్ధే వక్తుం చలితశిరసా సాధువచనే ।
తదీయై-ర్మాధుర్యై-రపలపిత-తంత్రీకలరవాం
*నిజాం వీణాం వాణీం నిచులయతి చోలేన నిభృతమ్ ॥ **66** ॥*

తాత్పర్యం:

అమ్మా! సరస్వతీదేవి శివుని సాహస కృత్యాలను తన విపంచిపై ఆలపిస్తూ ఉండగా నీవు విని నీ శిరఃకంపముచే శ్లాఘించి ఆమె వీణకన్న మధుర వాక్కులు చెప్పులోపు తన వీణానాదముకన్న నీ వాక్కులు మధురములని, ఆమె తన వీణను వస్త్రముతో కప్పి మూయుచున్నది.

వ్యాఖ్యానం:

ఈ శ్లోకములో అమ్మవారి పలుకుల మాధుర్యం వర్ణించబడింది. ఒకసారి అమ్మవారి ఎదుట స్వయముగా సరస్వతీదేవి తన వీణ మీద శివుని సాహస కృత్యాలను గానం చేస్తోంది. ఆయన పశుపతి, దక్షయజ్ఞ ధ్వంసం, హాలాహల భక్షణం, గజాసుర వథ ఇలా ఎన్నో ఆయన చరిత్రలు. అమ్మవారు సరస్వతీదేవి వీణాగానంలో మాధుర్యానికి, పరమేశ్వరుని లీలలకు పరవంశించిపోయింది. ముందు పొగడడానికి సంకేతంగా తల ఊపింది. తరువాత మాటలలో ఆమె ఆనందాన్ని వ్యక్తం చేయబోయింది. ఆమెను వ్యాస మహర్షి కచ్ఛపీ మాధుర్యానికి మించిన తీయదనంగల పలుకుల తల్లిగా లలితా సహస్రనామంలో కీర్తించాడు. సరస్వతి వీణ పేరు కచ్ఛపి. ఆమె మాటల తీయదనం ముందు తన వీణానాదం పేలవంగా ఉంటుందని సరస్వతియే ఆమె వీణను వాయించడం ఆపి తన వస్త్రంతో మూసి వేసిందట. అంతటి మాధుర్యమైన వచోవిలాసం అమ్మవారిది.

కరాగ్రేణ స్పృష్టం తుహినగిరిణా వత్సలతయా

గిరీశేనో-దస్తం ముహురధరపానాకులతయా ।

కరగ్రాహ్యం శంభోర్ముఖముకురవృంతం గిరిసుతే

కథంకారం బ్రూమ-స్తవ చుబుకమోపమ్యరహితమ్ ॥ 67 ॥

తాత్పర్యం:

పార్వతీ! వాత్సల్యంతో హిమవంతుని చేతితో స్పృశించబడినది, నీ పెదవుల అమృత పానం కోసం శివునిచే అనేకమార్లు పైకెత్తబడినది, నీ ముఖమనే అద్దానికి పిడివంటిది అయిన, అనుపమానమైన, నీ చుబుకాన్ని దేనితో పోల్చగలం!

వ్యాఖ్యానం:

ఈ శ్లోకముతో అమ్మవారి ముఖవర్ణన పూర్తవుతుంది. ఇందులో ఆదిశంకరులు ఏ ఉపమానం చెప్పలేని అమ్మవారి చుబుకాన్ని అంటే గడ్డాన్ని వర్ణిస్తున్నారు. ఆంగ్లంలో Chin అనే ఒక చిన్న మాటతో తెలిపే చుబుకం, కవులు ఎవరూ ఎక్కువగా ఎక్కడా వర్ణించలేదు. ఏ కొద్దిమందో ఎవరెవరివో నాయికల చుబుకాలు వర్ణించినా వాటిని ఆమలకం అంటే ఉసిరికాయతో పోల్చారు. అదంతగా పొసిగే ఉపమానం కాదు. అందులో నిరుపమానం అయిన అమ్మవారి చుబుకం ఎంతటిది? ఈ గడ్డాన్ని అమ్మవారి తండ్రి అయిన హిమవంతుడు ఏంతో వాత్సల్యంతో ఎన్నోసార్లు పుణికాడు, ముద్దు చేశాడు. మన్మథుని దహించిన శివుడు అమ్మవారి పెదవులను ముద్దాడాలనే కోరికతో ఎన్నోసార్లు ఆమె గడ్డాన్ని ఎత్తి పట్టుకుని ఆమెను చుంబించాడు. ఆమె ముఖం అద్దం అనుకుంటే ఆమె గడ్డం దాన్ని పట్టుకునే పిడిలా ఉంది. ఇంతకుమించి ఏం చెప్పి నీ అనుపమానమైన గడ్డాన్ని వర్ణించగలం తల్లీ. మాటలకందని సౌందర్యరాశి అమ్మవారు. ఆమె అందాన్ని వర్ణించడం సాహసమే అని మొట్టమొదటి శ్లోకంలోనే శంకరులు ఒప్పుకున్నారు.

భుజాశ్లేషాన్నిత్యం పురదమయితుః కంటకవతీ
తవ గ్రీవా ధత్తే ముఖకమలనాల-శ్రియమియమ్ ।
స్వతః శ్వేతా కాలాగురు బహుల-జంబాలమలినా
మృణాలీలాలిత్యం వహతి యదధో హారలతికా ॥ 68 ॥

తాపర్యం:

అమ్మా! ఈ నీ కంఠము ఎల్లప్పుడూ శివునిచే కౌగలింపబడిన పులకింతచే గగుర్పాటునొంది, నీ ముఖకమలానికి కాడవలె ఉంది. ముత్యాలహారముతోనూ, నల్లని అగరు గంధపు పూతతోను నీ మెడ లేత తామర తూడువలె కనిపించుచున్నది.

వ్యాఖ్యానం:

ఈ శ్లోకం అమ్మవారి కంఠం వర్ణన. శంకరులు అమ్మవారి ముఖం పద్మమని అనేకసార్లు వర్ణించారు. ఆముఖ పద్మానికి తూడు, నాళంవలె ఉందట అమ్మవారి కంఠం. ముఖం పద్మంలా ఉందనడానికి ఎన్నో కారణాలు చెప్పారు. కంఠం తామర తూడులా ఉందంటే ముఖం పద్మంలా ఉండడం ఒకటే సరిపోదు. ఇంకేం పోలికలున్నాయి తామర తూడుతో అవి చెప్తున్నారు. తామర తూడులో కొంచెం ముళ్లవంటి ఉపరితలం ఉంటుంది. అమ్మవారిని పరమేశ్వరుడు అను నిత్యం కౌగిలించుకోడంవల్ల పులకించి గగుర్పొడిచిన ఆమె మెడ తామర తూడులా ఉంది. ఇంకో లక్షణం తామర నీటి బయట ఉంటుంది. పంకజం అని పేరు, అంటే బురదలో పుట్టినది అని అర్థం. తామర నీటి బయట ఉన్నా తూడు కొంచెం బయట, కొంత బురదలోను ఉంటుంది. అమ్మవారి మెడలో ముత్యాల సరులు ఉన్నాయి, అది నీటి బయట ఉన్న తూడులా మెరుస్తోంది. మిగిలిన తూడు బురదలో ఉంది, అమ్మవారి మెడలో నల్లని అగురు గంధం పూత ఉంది. అది పరమేశ్వరుని కౌగిలిలో చెమర్చి మెడ మీద వ్యాపించి ఉంది. ఈ విధంగా తామర తూడుతో మెడకు అన్ని రకాలుగా సామ్యం చూపించారు శంకరులవారు. అవతార పురుషుల రచనలలో సౌందర్యం ఇలా ఉంటుంది.

గలే రేఖాస్తిస్రో గతి గమక గీతైక నిపుణే

వివాహ-వ్యానద్ధ-ప్రగుణగుణసంఖ్యా ప్రతిభువః ।

విరాజంతే నానావిధ-మధుర-రాగాకర-భువాం

*త్రయాణాం గ్రామాణాం స్థితి-నియమ-సీమాన ఇవ తే ॥ **69** ॥*

తాత్పర్యం:

అమ్మా! నీ మెడ మీదనున్న మూడు మడతలు, గీతంలో త్రిస్థాయి గమకాల్లా ఉన్నాయి. పెళ్ళిలో నీ మెడకు అలంకరించిన నూలు పోగుల్లా ఉన్నాయి, మూడు గ్రామాలలో అంటే షడ్జ, మధ్య గాంధార గ్రామాలలో పలికే నానా విధ రాగాలకు ఆకరాల్లా ఉన్నాయి.

వ్యాఖ్యానం:

మీది శ్లోకంలో కంఠం వర్ణించి ఆది శంకరులు ఈ శ్లోకంలో మెడను వర్ణిస్తున్నారు. మెడ అంటే గళం అనుకోవచ్చు, గ్రీవం అనుకోవచ్చు. శంకరులు ఈ శ్లోకంలో సంగీతం సాముద్రికం ఈ రెండు శాస్త్రాలతో సర్వమంగళ గళ వర్ణన చేస్తున్నారు. అమ్మవారిని సంబోధించడమే 'గతి గమక గీతైక నిపుణే' అని చెప్పడంలో మూడు సంగీతానికి సంబంధించిన మాటలు ఉపయోగించారు. గతి – గమకం– గీతం. గతి అనేది నడక అంటే తాళానికి సంబంధిన విషయం. 3–4–5–7–9 గతులు త్రిశ్ర, చతురస్ర, ఖండ, మిశ్ర, సంకీర్ణ అని ఐదు రకాలు. సంగీతానికి గతి అంటే తాళం ప్రధానం. దీనికి ఎన్నో మాటలు ఉపయోగిస్తారు. నడక అని, లయ అని, తాళం అని, కాల ప్రమాణం అని. రెండవ పదం గమకం. గమకం అంటే స్వరాన్ని కంపింపజేయడం. సంగీత శాస్త్రంలో 15 రకాల గమకాలను చెప్పారు. శంకరులు ఉపయోగించిన మూడవ పదం గీతం. గీతం అంటే మామూలు మాటల్లో పాట. ఇందులో సంగీత పరంగా అయితే స్వరములతో తాళబద్ధమై, భాషకు కూర్చిన పాట. అమ్మవారిని శంకరులు ఈ మూడింటిలో నిపుణా అని వర్ణించారు. మూడు లక్షణాలే ఎందుకు చెప్పారంటే అమ్మవారి మెడలో మూడు రేఖలున్నాయట.

అవి సంగీత పరంగా ఈ మూడు. ఇది శ్లోకం మొదటి పాదం. రెండవ పాదంలో ఆ మూడు రేఖలు వివాహ సమయంలో మంగళసూత్రం కట్టినపుడు అనేక దారాలు ఆ మూడు రేఖలుగా కనిపిస్తున్నాయంటారు. మూడు పేటల దారాలు ఒక్కొక దానిలో తొమ్మిదేసి దారాలతో చేస్తారు కొందరు. తరువాత 3-4 పాదాలలో మళ్ళీ సంగీత పరంగా వర్ణిస్తున్నారు. సంగీతంలో స్వర సమూహాన్ని గ్రామం అంటారు. గ్రామం అంటే వ్యవహారంలో ఒక ప్రజాసమూహం ఉండే ప్రదేశం. సంగీతంలో గ్రామం అంటే స్వర సమూహం. స్వరాలను అనుసరించి షడ్జగ్రామం అని, మధ్యమ గ్రామం అని, గాంధార గ్రామం అని మూడు రకాలు. ఈ గ్రామాలలోంచే రాగాలు పుట్టాయి. అమ్మవారి మెడమీద రేఖలు సంగీతంలో అనేకమైన మధురమైన రాగాలకు నిలయమై, సంగీతంలో మూడు గ్రామాలలా ఉన్నాయని వర్ణించారు. సాముద్రిక శాస్త్రంలో నుదుట, మెడమీద, పొట్టమీద మూడు మడతలుండడం సౌభాగ్య చిహ్నమని చెప్తారు. అమ్మవారు స్వయముగా సకల జగత్తుకు సౌభాగ్యమిచ్చే జనని. అన్నీ మూడుమూడుగా వర్ణించడమే త్రిపుర సుందరి సౌందర్య వర్ణనలో రహస్యం.

మృణాలీ-మృద్వీనాం తవ భుజలతానాం చతసృణాం
చతుర్భిః సౌందర్యం సరసిజభవః స్తౌతి వదనైః ।
నఖేభ్యః సంత్రస్యన్ ప్రథమ-మథనా దంధకరిపోః
చతుర్ణాం శీర్షాణాం సమ-మభయహస్తార్పణ-ధియా ॥ 70 ॥

తాత్పర్యం:

అమ్మా! బ్రహ్మ ఇంతకు ముందు ఐదవ తలను శివుడు తన గోటితో త్రెంచినది గుర్తు చేసుకొని, తలచి భయపడి తన నాలుగు ముఖాలతో తామర తూడులవలె మృదువైన నీ నాలుగు భుజాలను అభయం కోరుతూ స్తుతిస్తున్నాడు.

వ్యాఖ్యానం:

అమ్మవారి నాలుగు భుజాల సౌందర్యం ఈ శ్లోకంలో విషయం. అమ్మా! నాలుగు ముఖాలున్న బ్రహ్మ తన నాలుగు ముఖాలతో తామర తూడులవలె మృదువైన నీ నాలుగు భుజాలను స్తుతిస్తున్నాడు. ఎందుకంటే ఆయనకు శివుడంటే భయం. శివుని ఇక్కడ శంకరులు 'అంధకాసురిని శత్రువు' అనే విశేషణంతో పేర్కొన్నారు. అంధకాసురుడు అంటే మదం చేత కళ్ళు మూసుకుపోయినవాడు. మనం అందరం ఎదో రకంగా అంధకాసురలమే. ఈ పేరుతో శివుని ఆదిశంకరులు ఈ శ్లోకంలో ఎందుకు పేర్కొన్నారంటే ముందు బ్రహ్మకు ఐదు ముఖాలు ఉండేవట. పరమ శివునికీ ఐదు ముఖాలే. సద్యోజాతం, తత్పురుషం, ఈశానం, అఘోరం, వామదేవం అని వీటికి పేర్లు. బ్రహ్మగారికి గర్వం కలిగింది, శివుడికీ ఐదు ముఖాలే నాకూ అయిదే అని. అది గ్రహించిన పరమ శివుడు ఆ అంధక తత్త్వాన్ని అణచడానికి ఒక వేలి గోరుతో ఆ అయిదో తల గిల్లి ఖండించాడు. అందుకని బ్రహ్మగారికి పరమ శివుడంటే భయం. అభయమిచ్చే తల్లి అమ్మవారుంది కదా. అందుకని ఆ మిగిలిన నాలుగు ముఖాలతో ఆమె నాలుగు భుజాలను అభయమిమ్మని స్తోత్రం చేస్తున్నాడు. అసలు రహస్యం ఏమిటంటే బ్రహ్మ అయిదు ముఖాలు పంచభూతాలు. అందులో పైకి ఉన్న ముఖం ఆకాశం. ప్రళయ కాలంలో శివుడు పంచభూతాలలో ఆకాశాన్ని ముందు తనలో విలీనం చేసుకుంటాడు. మిగిలిన నాలుగు భూతాలు ఆకాశం నుండి పుట్టినవని ఉపనిషత్తులు చెప్తున్నాయి. అవి కూడా ఆయనలో లీనమౌతాయి. ఇంకోలా చూస్తే బ్రహ్మ నాలుగు ముఖాలు నాలుగు వేదాలు. నాలుగు వేదాలతో బ్రహ్మ అమ్మవారిని స్తుతిస్తున్నాడు అని భావం. శంకరుల రచనలో వాల్మీకిలా పైకి కొంచెం తేలికైన అర్థం ఉండి, తరచి చూసిన కొద్దీ రహస్యాలు వెలికి వస్తూ ఉంటాయి. ఎంత ఆసక్తిగలవారికి అంత!

నఖానా-ముద్యోతై-ర్నవనలినరాగం విహసతాం
కరాణాం తే కాంతిం కథయ కథయామః కథముమే ।
కయాచిద్వా సామ్యం భజతు కలయా హంత కమలం
యది క్రీడల్లక్ష్మీ-చరణతల-లాక్షారస-చణమ్ ॥ 71 ॥

తాత్పర్యం:

ఓ ఉమాదేవీ! అప్పుడే వికసిస్తున్న తామరపూవు కాంతిని పరిహసించే నీ గోళ్ళ నుండి ప్రసరించే నీ చేతి కాంతిని దేనితో సరిపోల్చగలం చెప్పు. ఒకవేళ క్రీడిస్తున్న లక్ష్మీదేవి కాలి లత్తుకతో కొంతవరకు పోల్చదగునేమో!

వ్యాఖ్యానం:

ఆదిశంకరులు ఈ శ్లోకంలో అమ్మవారి చేతుల కాంతిని వర్ణిస్తున్నారు. కవిత్వంలో రెండు రకాల చమత్కారం ఉంటుంది. శబ్ద చమత్కారం, అర్థ చమత్కారం. ఇందులో శంకరులు రెండు చమత్కారాలూ జోడించారు. ఉమాదేవీ! అప్పుడే వికసిస్తున్న తామరపూవు కాంతిని పరిహసించే, నీ గోళ్ళ నుండి ప్రసరించే నీ చేతి కాంతిని, దేనితో సరిపోల్చగలం చెప్పమని ఆమెనే అడుగుతున్నారు. దేనితో సరిపోల్చగలం చెప్పు అనడానికి సంస్కృతంలో 'కథయ కథయామః కథముమే' అంటారు. కథయ అంటే చెప్పు, కథయామః అంటే చెప్పగలము, కథం అంటే ఎలా. ఎలా చెప్పగాలమో తల్లీ నువ్వే చెప్పు అంటే నీ చేతి కాంతిని వర్ణించలేము అని భావం. ఒకవేళ వర్ణిద్దామంటే ఎలాగ అంటే నీ గోళ్ళ కాంతి అప్పుడే వికసిస్తున్న తామరపూల కాంతిని మించి ఉన్నది. ఆ కాంతి సరిపోదు. ఒకవేళ ఏ మాత్రమైనా సరిపోవాలంటే క్రీడిస్తున్న లక్ష్మీదేవి పాదాల పారాణితో కలిస్తే కొంతవరకు నీ చేతి కాంతితో పోల్చదగునేమో. ఆ తామరపూలకు స్వయంగా నీ చేతి గోళ్ళ కాంతితో సరిపోల్చేంత ప్రకాశం లేదు. ఇక్కడ అతిశయోక్తి అలంకారం.

అమ్మవారి చేతి కాంతి అసలు ఆమె అభయ దానం. ఆమె భక్తులకిచ్చే సంపదలు, ఐశ్వర్యం, ఆమె చూపే కరుణ. అందుకే లక్ష్మీదేవి పారాణితో

చేరిన తామరపూల కాంతితో కొంతవరకు పోల్చవచ్చేమో అన్నారు. శబ్ద అర్థ గాంభీర్యం ఆదిశంకరుల వాణిలో అలవోకగా ప్రవహిస్తుంది.

సమం దేవి స్కంద ద్విపవదన పీతం స్తనయుగం
తవేదం నః ఖేదం హరతు సతతం ప్రస్నుత-ముఖమ్ ।
యదాలోక్యాశంకాకులిత హృదయో హాసజనకః
స్వకుంభౌ హేరంబః పరిమృశతి హస్తేన ఝుటితి ॥ 72 ॥

తాత్పర్యం:

తల్లీ! ఒకవంక కుమారస్వామి మరొకవంక గణేశుడు ఒకేసారి నీ పాలు తాగుతూ ఉంటే నీ స్తనాలను చూసి సందేహంతో గాబరాగా తన కుంభస్తలాలను తడిమి చూసుకునే హేరంభుని చూసి నవ్వు కలుగునో, అట్టి నీ స్తనములు మా దుఃఖమును హరించుగాక.

వ్యాఖ్యానం:

అమ్మవారి భుజాలను, చేతులను, చేతి వ్రేళ్ళ గోళ్ళను, వర్ణించి ఆదిశంకరులు, ఈ శ్లోకంలో అమ్మవారి స్తనాలను వర్ణిస్తున్నారు. ఆమె జగన్మాత. లోకంలో ప్రాణులందరికి తన స్తన్యం ఇచ్చి పోషించే తల్లి. శంకరులు అందుకే మొదటి రెండు పాదాలలో తల్లీ! కుమారస్వామికి గణేశునికి ఒకే సమయంలో స్తన్యం ఇచ్చే నీ కుచాలు, నిత్యం పాలు స్రవించేవి, మా ఖేదాలను తొలగించి, మాకు ఎల్లవేళలా క్షేమాన్ని కలిగించుగాక! అని ప్రార్థిస్తున్నారు. తరువాతి రెండు పాదాలలో కవిత్వం, చమత్కారం, ఒక ఆధ్యాత్మిక రహస్యం చెప్పారు. ఏనుగు నుదుటి మీద కుంభాలు ఉంటాయి. కవులు స్తనాలను ఏనుగు కుంభాలతో పోలుస్తారు. ఇక్కడ అలా సూటిగా చెప్పకుండా శంకరులు చమత్కరిస్తున్నారు. పాలు తాగుతున్న గణేశునికి ఆమె స్తనాలు చూసి, తన నెత్తి మీద ఉన్న కుంభాలలా ఉండడంతో, ఇవి అవేనేమో అని సందేహంగలిగి, ఒకసారి తొండంతో నెత్తిని తడిమి చూసుకున్నాడట. ఆ అమాయకత్వం చూసి, అమ్మవారు,

శివుడు, కుమారస్వామి నవ్వుకున్నారట. అమ్మవారి కుచాలు ఏనుగు కుంభస్థలంలా ఉన్నాయని సూటిగా చెప్పకుండా ఇలా చమత్కరించారు.

ఇందులో ఎన్ని సౌందర్యాలు ఎన్ని రహస్యాలో. మొదటిది ఆమె పిల్లలిద్దరికీ ఒకే సమయంలో పాలివ్వడం. అంటే సమదృష్టి. ఆమెకు సంతానం పట్ల అందరినీ ఒకేలా చూసే మమత. రెండవది ఆ స్తనములు నిత్యమూ స్రవించేవి. అంటే ఆమె కరుణ అపారమైనది. మూడవది ఆ స్తనములు మా ఖేదాలను తొలగించుగాక అనే ప్రార్థన. తల్లిని భక్తుడు కోరుకొనే విధం. వినాయకుని అమాయకత్వమే మనకు విఘ్నాలు లేకుండా చేసే శక్తి. అది శివపార్వతులకు, సుబ్రహ్మణ్యునికి, ఆనందాన్ని కలిగించడమే వారి సంపూర్ణ కటాక్షం.

అమూ తే వక్షోజా-వమృతరస-మాణిక్య కుతుపౌ
న సందేహస్పందో నగపతి పతాకే మనసి నః ।
పిబంతౌ తౌ యస్మా దవిదిత వధూసంగ రసికౌ
కుమారావద్యాపి ద్విరదవదన-క్రౌంచదలనౌ ॥ 73 ॥

తాత్పర్యం:

అమ్మా గిరిజా దేవీ! నీ ఈ స్తనములు రెండును అమృతము నిండిన మాణిక్య కలశములనుటలో మాకేమాత్రము సందేహము లేదు. ఏలయన అవి గ్రోలిన గజముఖుడు, క్రౌంచాద్రిని ఛేదించిన కుమారస్వామి నేటికిని ఇతర స్త్రీ సంగమమందు ఆసక్తి లేని బాలురుగానే ఉన్నారు.

వ్యాఖ్యానం:

అమ్మవారి స్తనాల సౌందర్యం కాదు, ప్రభావం వర్ణిస్తున్నారు ఆదిశంకరులు. అమ్మవారిని నగపతి పతాకే! అని సంబోధిస్తున్నారు. అమ్మా పార్వతీ! అని. ఈ శ్లోకం మొదటి రెండు పాదాలలో అమ్మా! నీ స్తనములు మాణిక్యములు పొదిగిన అమృత కలశాలు, అని చెప్పడంలో నాకేమీ సందేహం లేదు, అన్నారు. ఎందుకు అన్నది తరువాతి రెండు

పాదాలలో చెప్తున్నారు. ఎందుకంటే నీ పాలు త్రాగుతున్న సుబ్రహ్మణ్యుడు, వినాయకుడు, మరే స్త్రీ సంసర్గం గాని, అట్టి కోరికలు గాని, లేకుండా ఇంకా పిల్లలుగానే ఉన్నారు.

ఇదీ విచిత్రం. మనకు తెలిసి పురాణాలలో కుమారస్వామికి ఇద్దరు భార్యలు, వల్లి, దేవసేన. గణేశునికీ ఇద్దరు భార్యలు, సిద్ధి, బుద్ధి. మరేమిటీ శ్లోకం ఆదిశంకరులిలా చెప్పారు? ఒకటి ఒక ఊహా చిత్రం, పిల్లలెంతటివారయినా, తల్లిదండ్రులకు ఎప్పుడూ పిల్లలే. మరి శ్లోకంలో 'అవిదిత వధూసంగా రసికౌ' అంటే స్త్రీసంగమమే తెలియనివాళ్ళు అంటున్నారు ఆదిశంకరులు! ఇంకొకటి అంతరార్థం. సుబ్రహ్మణ్యస్వామి సర్పమునకు సంకేతం. కుండలినీ శక్తి, చుట్టుకుని ఉండేది వల్లి, దానికి నాథుడు, వల్లీ నాథుడు సుబ్రహ్మణ్యేశ్వరుడు. ఆయన దేవతలకు సేనాని, దేవసేనాపతి.

గణాధిపతికి ఒక భార్య సిద్ధి. మనం చేసే పనులకు సిద్ధిని అంటే విజయాన్ని కలిగించేవాడు విఘ్నేశ్వరుడు. సిద్ధి పతి. అలాగే కుమారస్వామికా, గణపతికా, ఎవరికీ మొదటిస్థానం ఇవ్వాలన్నప్పుడు, ఇద్దరినీ భూమిని ముందు ఎవరు చుట్టివస్తారో, వారికే ప్రథమ స్థానం అని, పార్వతీ పరమేశ్వరులు నిర్ణయించారు. తల్లిదండ్రులకు ప్రదక్షిణం చేసి, అది భూ ప్రదక్షిణంతో సమానమని గెలిచిన బుద్ధిమంతుడు, గణపతి. కుమారస్వామి, గణపతి, వారిద్దరి భార్యల పేర్లు సంకేతాలేనని, తెలుసుకోవాలి. పౌరాణికంగా కథల కోసం ఇంకోలా ఉండొచ్చు.

ఆ రకమైన వైదిక రహస్యాన్ని ఇందులో పొందుపరచి ఆదిశంకరులు అమ్మవారి పవిత్రమైన వక్షోజాలకు, ఆమెకు పిల్లలయందున్న వాత్సల్యాన్నే కాక, పిల్లలు ఎప్పుడూ అమ్మకు పిల్లలేనని, సూచించే ఒక అత్యంత సాంద్రమైన సంస్కారానికి సంకేతం ఈ శ్లోకం.

వహత్యంబ స్తంబేరమ-దనుజ-కుంభప్రకృతిభిః
సమారబ్ధాం ముక్తామణిభిరమలాం హారలతికామ్ ।
కుచాభోగో బింబాధర-రుచిభి-రంతః శబలితాం
ప్రతాప-వ్యామిశ్రాం పురదమయితుః కీర్తిమివ తే ॥ 74 ॥

తాత్పర్యం:

అమ్మా! నీ స్తనముల సౌదర్యమైన ప్రదేశము గజాసురుని కుంభస్థలము నుంచి తీసిన నిర్మలమైన ముత్యాల హారముతో ప్రకాశిస్తున్నది. ఆ ముత్యాల హారముపై నీ దొండపండువంటి పెదాల కాంతి ప్రతిబింబించి ఎర్రని కాంతితో పురహరుని కీర్తిని చాటుచున్నట్లున్నది.

వ్యాఖ్యానం:

ఆదిశంకరులు అమ్మవారి స్తనాలు పిల్లలకు ఏ విధమైన సంస్కారాన్ని కలిగించాయో చెప్పి, ఈ శ్లోకంలో అమ్మవారి స్తనములకు, మెడకు మధ్యనున్న ప్రదేశం పరమ శివుని కీర్తిలా ప్రకాశిస్తూ ఉన్నది అని వర్ణిస్తున్నారు. ఎలా అంటే, పరమ శివుడు గజాసురిని సంహరించినపుడు, గజాసురుని కుంభస్థలంలోని ముత్యాలు తెచ్చి, అమ్మవారికి ఇచ్చారు. ఆమె అవి ధరించింది. ఆమె స్వచ్ఛమైన స్తనప్రదేశంలో తెల్లగాను, పైనున్న దొండపండులాంటి పెదవుల ఎరుపు ప్రసరించడంవలన ఎర్రగాను ఆ ముత్యాలహారమున్న ప్రదేశం ప్రకాశిస్తోంది. అది పరమ శివుని సాత్త్వికతను చాటుతూ తెల్లగానూ, ఆయన త్రిపురసంహార, గజాసుర సంహారం మొదలైన వీరోచిత కృత్యాల వీరాన్ని చాటుతూ ఎరుపుగానూ, ప్రకాశిస్తోంది అని ఆదిశంకరుల వర్ణన. ఇందులో రెండు మూడు వివరాలు చూడండి. ఒకటి గజాసురుని కుంభస్థలంలోని ముత్యాలు. శాస్త్రం ఏం చెప్తుందంటే, ఆరుచోట్ల ముత్యాలు లభిస్తాయట. గజకుంభములు, వెదురుబొంగులు, పాములు, మేఘములు, ముత్యపుచిప్పలు, చెరుకు అవీ ఆరు. పరమశివుని వీరం చాటి చెప్తోందని వర్ణిస్తున్నారు గనుక, అవి గజాసురిని కుంభస్థలం నుంచి తెచ్చిన ముత్యాలు. రెండవది,

స్త్రీ సౌందర్యం మీద పిల్లలకి, భర్తకి ముందు అధికారం. అందుకని ముందు గణపతికి కుమారస్వామికి అమ్మవారి స్తనముల ఉపయోగం చెప్పి, తరువాత అయ్యవారి కీర్తిని చాటే సౌందర్యంగా వర్ణిస్తున్నారు. మూడవది మనకందరికీ స్త్రీయందు మాతృభావన, పార్వతీ పరమేశ్వరులయందు జగత్ జననీ జనకులనే విషయం శ్లోకంలో ప్రవహిస్తూనే ఉండే ఉత్కృష్టమైన సంస్కారం.

తవ స్తన్యం మన్యే ధరణిధరకన్యే హృదయతః
పయః పారావారః పరివహతి సారస్వతమివ ।
దయావత్యా దత్తం ద్రవిడశిశు–రాస్వాద్య తవ యత్
కవీనాం ప్రౌఢానా మజని కమనీయః కవయితా ॥ 75 ॥

తాత్పర్యం:

అమ్మా! పార్వతీ! నీ చనుబాలు నీ హృదయము నుండి ప్రవహించు పాలసముద్రంవంటి సారస్వత ప్రవాహంలా ఉంది. ఎందుకంటే నీ దయవలన ఈ ద్రావిడ శిశువు ఆ స్తన్యమును గ్రోలి (శంకరాచార్యులు) ప్రౌఢమైన కవిత్వం చేయగలుగుతున్నాడు!

వ్యాఖ్యానం:

ఈ మొత్తం గ్రంథంలో ఇది ఒక ఆర్ద్రమైన శ్లోకం. ఒక అద్వితీయమైన సంస్కారం, ఒక అనన్యమైన కవిత్వావేశం. ఈ శ్లోకంలో అమ్మవారి స్తన్యం, అంటే ఆమె పాలు, ఆమె హృదయం నుంచి పుట్టిన సారస్వతం, అంటే సాహిత్యం అనే పాలసముద్రం అని ఆదిశంకరులు వర్ణిస్తున్నారు. తల్లీ! నీ దయవలన, ఆ పాలను త్రాగిన ఈ ద్రవిడ శిశువు, మహాకవులలా గొప్ప కవిత్వం వ్రాయగలిగాడు. ఇక్కడ ఆదిశంకరులు తనను తాను ద్రవిడ శిశువు అని చెప్పుకుంటున్నారు. ఆదిశంకరులకు అమ్మవారిపైనున్న ప్రగాఢమైన భక్తికి ఇది ఒక గుండెను కరిగించే శ్లోకం. దీనిపై లక్ష్మీధరుడు, కైవల్యశర్మ మరికొందరు పండితులు ద్రవిడ శిశువు అన్న పదం శంకరాచార్యులవారికే చెందుతుందని వివరించారు. అనేకమంది పండితులు

వేరే వ్యాఖ్యలు చేశారు. మలయాళంలో కంటియూర్ మహాదేవశాస్త్రి అనే ఆయన తన వ్యాఖ్యానంలో ద్రవిడ శిశువు అనే పేరున్న ఒక రచయిత సౌందర్యలహరి వ్రాశాడని అన్నారు. కొందరు తమిళ పండితులు ద్రవిడ శిశువు అన్న మాట తిరుజ్ఞాన సంబంధర్‌ని సూచిస్తోందన్నారు.

దీని గురించిన గుండెకు హత్తుకునే కథ ఒకటి కైవల్యాశర్మ తన సౌభాగ్యవర్ధని వ్యాఖ్యానంలో చెప్పారు. ఆదిశంకరుల తండ్రి రోజూ అమ్మవారి ఆలయానికి ఒక చిన్న గిన్నెలో పాలు తీసుకువెళ్ళేవాడట. తిరిగి అందులో సగం పాలతో ఇంటికి వచ్చి, ఇది అమ్మవారి ప్రసాదం, అని శంకరులకు ఇచ్చేవాడట. ఒకనాడు ఆయన ఎదో ఊరికి వెళ్తే, తల్లి, పిల్లవాడైన శంకరులకు పాలగిన్నె ఇచ్చి, అమ్మవారి కోవెలకు పంపింది. శంకరులు ఆలయానికి వెళ్ళారు, అమ్మవారు పాలు తాగలేదు, ఆయన ఏడుస్తూ కూర్చున్నాడు. అమ్మవారు స్వయంగా వచ్చి, పిల్లాడిని ఓదార్చి, పాలు తాగింది. శంకరులు ఇంకా బిగ్గరగా ఏడవడం మొదలుపెట్టారు. పాలు త్రాగానుకదా, ఎందుకు ఏడుస్తున్నావ్, అంది అమ్మవారు. అన్నీ త్రాగేశావు, నాకు ప్రసాదం ఉంచలేదు, అన్నారు శంకరులు. అమ్మవారు ఏంతో వాత్సల్యంతో బాలుడైన శంకరాచార్యులవారిని ఒడిలోకి తీసుకుని తన పాలు ఇచ్చిందట. ఆ మహిమ వలన ఆదిశంకరులు ఆ రోజు నుంచి అమ్మవారిని అనేక స్తోత్రాలతో గానం చేశారు.

ఆ విషయం, ఈ శ్లోకంలో వారే స్వయంగా చెప్పుకుని, తల్లీ! నీ పాలు త్రాగిన ఈ ద్రవిడ శిశువు, మహాకవులవంటి కావ్య రచనా సమర్థుడయ్యాడు. అది పాలసముద్రంవంటి, సారస్వతాన్ని ప్రవహించే నీ చనుబాల మహిమ, అని వర్ణించారు. కనులు చెమర్చి, ఒడలు పులకించే శ్లోకం ఇది. ఆ అనుభూతిని మనో నేత్రంతో చూసి ఆనందించాలి.

హరక్రోధ-జ్వాలావలిభి-రవలీఢేన వపుషా
గభీరే తే నాభీసరసి కృతసంగో మనసిజః ।
సముత్తస్థౌ తస్మా-దచలతనయే ధూమలతికా
జనస్తాం జానీతే తవ జనని రోమావలిరితి ॥ 76 ॥

తాత్పర్యం:

ఓ జననీ! శివుని క్రోధాగ్ని జ్వాలలచే కప్పబడిన శరీరముగల మన్మథుడు నీ నాభి అనే సరస్సులో మునిగిపోయాడు. ఆ అగ్ని చాల్లారితే వచ్చిన పొగ తీగె చూసి, జనులు నీ నూగారు అనుకుంటున్నారు.

వ్యాఖ్యానం:

ఈ శ్లోకంలో ఆదిశంకరులు అమ్మవారి నాభి ప్రదేశాన్ని, అక్కడ నుంచి పైకి ప్రాకే నూగారు అంటే సన్నని నూనూగు వెంట్రుకల రేఖను, వర్ణిస్తున్నారు. ఇక్కడ రెండు సాముద్రిక శాస్త్ర లక్షణాలు, ఒకటి బొడ్డు లోతుగా ఉండడం లక్ష్మీప్రదం, రెండోది నూగారు. సాముద్రికం అంటే, శరీరంలో ఏ భాగం ఎలా ఉంటే, ఆ లక్షణం ఏమిటో చెప్పే శాస్త్రం. శరీరంలో అన్ని భాగాలకు సాముద్రికం ఉంది. మనం ఎక్కువగా లోకంలో ఉపయోగించేది, వాడేది, హస్త సాముద్రికం, జాతకం అన్నమాట. ఆదిశంకరులు ఎలా వర్ణిస్తున్నారో చూడండి. శివుని మూడో కంటి అగ్నిజ్వాలకు గురి అయిన మన్మథుడు, అమ్మవారి లోతైన బొడ్డు అనే కొలనులో ఉపశమనం పొందాడట. ఆ అగ్ని చల్లారి, అందు నుండి వచ్చిన పొగ తీగ సాగి, పైకి వెళుతూ ఉంటే ఎలా ఉంటుందో, అమ్మవారి నూగారు అలా ఉందట.

వర్ణనలో అమ్మ మాతృత్వాన్ని చూసే దృష్టే ఉండాలి. ఇందులో యోగ రహస్యాలు, సాముద్రిక లక్షణాలూ ఉన్నాయి. అతిశయోక్తి, ఉత్ప్రేక్ష, భ్రాంతి మొదలైన అలంకారాలు ఉపయోగించారు.

యదేతత్కాలిందీ-తనుతర-తరంగాకృతి శివే
కృశే మధ్యే కించిజ్జనని తవ యద్భాతి సుధియామ్ ।
విమర్దా-దన్యోన్యం కుచకలశయో-రంతరగతం
తనూభూతం వ్యోమ ప్రవిశదివ నాభిం కుహరిణీమ్ ॥ 77 ॥

తాత్పర్యం:

అమ్మా! శివుని అర్ధాంగీ! సన్నని నీ నడుముపైనున్న నూగారు, యమునా

నదియొక్క చిన్న కెరటంలా ఉంది. అది మేథావులకు ఎలా కనిపిస్తోంది అంటే, నీ కలశములవంటి స్తనాలు ఒకదాన్నొకటి రాసుకోడంవల్ల అక్కడున్న చిన్నదైన ఆకాశము అక్కడుండలేక నీ బొడ్డులో ప్రవేశిస్తున్నట్లు కనిపిస్తోంది.

వ్యాఖ్యానం:

పై శ్లోకంలో క్రిందినించి పైకి వెళుతున్న పొగలా ఉన్న నూగారు, ఈ శ్లోకంలో పైనించి క్రిందకి జారుతున్న ఆకాశంలా, యమునా నదీ తరంగంలా, ఉందంటున్నారు ఆదిశంకరులు. అమ్మవారికి ఇక్కడ రెండు సంబోధనలు, ఒకటి శివే, రెండోది జనని. ఈ వర్ణనలోని రహస్యాలు తెలుసుకునే ముందు ఈ రెండు మాటలు గుర్తుంచుకోవాలి. ఆమె శివుని భార్య, మనకు జనని. ఆమె నడుము సన్నగా ఉంది. ఆమె స్తనములు సమృద్ధిగా ఉండడం వల్ల, వాటి రెండిటి మధ్య అవకాశం లేదు, దానినే ఆకాశం అంటారు. అది అక్కడుండలేక క్రిందకు జారి బొడ్డులో ప్రవేశించింది. నడుము సన్నగా ఉండడం, స్తనములు సమృద్ధిగా ఉండడం, బొడ్డు లోతుగా ఉండడం, నూగారు కలిగియుండడం ఇవన్నీ ఉత్తమ స్త్రీ సాముద్రిక లక్షణాలు. జగమంతా పిల్లలైన తల్లికి ఉండవలసిన లక్షణాలు. ఆమె సృష్టికి మాత్రమే కాదు, సర్వ జగత్తు పోషణకును ఆమెయే కారణము. యోగ దృష్టితో చూస్తే, ఈ రెండు శ్లోకములు 76–77, కుండలినిలో పైకి వ్యాపించే శక్తి, తిరిగి క్రిందకు చేరే పద్ధతిని తెలియజేస్తుంది. యమునానది నల్లని నీరు పవిత్రతను, ముక్తిని సూచిస్తుంది.

స్థిరో గంగా వర్తః స్తనముకుల–రోమావలి–లతా
కలావాలం కుందం కుసుమశర తేజో–హుతభుజః ।
రతే–ర్లీలాగారం కిమపి తవ నాభిర్గిరిసుతే
బిలద్వారం సిద్ధే–ర్గిరిశనయనానాం విజయతే ॥ 78 ॥

తాత్పర్యం:

అమ్మా! పార్వతీ! నీ బొడ్డు స్థిరమైన గంగానది సుడిగుండంలా,

అందుండి వెడలిన నీ రోమావళి అనే తీగకు నీ స్తనాలు తొడిగిన మొగ్గలులా, నీ నాభి మన్మథునికి అగ్నిగుండంలా, రతికి శృంగార వాటికగా శివుని కన్నులకు సిద్ధినిచ్చే గుహలా, వర్ణించడానికి అతీతమై ప్రకాశిస్తోంది.

వ్యాఖ్యానం:

అమ్మవారి నాభిని వర్ణించే శ్లోకం. వర్ణించడానికి అతీతమైన బొడ్డును వర్ణిస్తున్నారు. అది సృష్టిలోని జీవులను తల్లితో ఉండే సంబంధాన్ని కలిపే నాడీ ప్రదేశం, Umbilical cord. అయిదు లక్షణాలతో వర్ణన చేస్తున్నారు. 1. గంగానదిలో కదలని స్థిరమైన సుడిగుండంలా ఉంది. అమ్మవారి జన్మస్థానమూ గంగానది జన్మస్థానమూ రెండూ హిమవత్ పర్వతమే. గంభీరమైన గంగానది అమ్మవారికి తోబుట్టువు. ఆదిశంకరులు భజగోవిందంలో ముక్తికి 'గంగాజల లవకణికా పీతా' అంటారు. ఒక బొట్టు గంగనీరు చాలట. అంతటి పవిత్రమైన గంగానదిలో కదలని సుడిగుండంలా ఉంది అమ్మవారి బొడ్డు. 2. అమ్మవారి బొడ్డు నుంచి పుట్టిన నూగారు అనే లతకు, ఆమె స్తనములు పూచిన మొగ్గలు. 3. మన్మథుని అగ్నికి ఈ స్థానము అగ్నిగుండం. 4. రతీదేవికి మన్మథునితో కలిసే విలాసగృహం. 5. పరమేశ్వరునికి సమాధికి కావలసిన గుహ.

అమ్మవారి సృష్టికి, స్థితికి లయకు నాభిస్తానమే గరిమనాభి!

నిసర్గ-క్షీణస్య స్తనతట-భరేణ క్లమజుషో
నమన్మూర్తే ర్నారీతిలక శనకై-స్త్రుట్యత ఇవ ।
చిరం తే మధ్యస్య త్రుటిత తటినీ-తీర-తరుణా
సమావస్థా-స్థేమ్నో భవతు కుశలం శైలతనయే ॥ 79 ॥

తాత్పర్యం:

ఓ నారీ తిలకమా! పార్వతీ! సహజంగానే కృశించిన నీ నడుము, స్తన భారంచే మరింత అలసి, కొంచెం కొంచెంగా విరిగిపోతోందా అన్నట్టుండి, కట్ట తెగిన నది ఒడ్డున చెట్టులా కొంచెం వంగి ఉంది. అట్టి నీ నడుముకు చిరకాలం క్షేమం కలుగుగాక.

వ్యాఖ్యానం:

ఆదిశంకరులు ఈ శ్లోకంలో అమ్మవారి సన్నని నడుమును వర్ణిస్తున్నారు. నడుమును సాముద్రిక శాస్త్రంలో కృశించినది, సన్ననిది, ఉందో, లేదో అన్నట్టుగా ఉన్నది, ఉత్తమ జాతి స్త్రీల లక్షణం అని చెప్పారు. ఇలా ఉండడం మాతృత్వానికి శుభ లక్షణమని చెప్పారు. ఇక్కడ ఆదిశంకరులు అమ్మవారి నడుమును, నది ఒడ్డున విరగడానికి సిద్ధంగా ఉన్న చెట్టులా ఉందని వర్ణిస్తున్నారు. అంతేకాకుండా పైన ఉన్న సమృద్ధమైన స్తనభారం వల్ల, అలిసిపోయి, నడుము కొంచెం వంగి ఉన్నదిట. అసలే సన్ననిది, దానికితోడు పైన ఉన్న స్తన భారం! ఆదిశంకరుల చమత్కారం ఏమిటంటే, అలాంటి నడుము చిరకాలం క్షేమంగా ఉండుగాక! అని కోరుకుంటున్నారు. విచిత్రంగా లేదూ! అమ్మవారి నడుము క్షేమంగా ఉండాలని ఆకాంక్షా? ఆశీర్వాదమా? ప్రార్థనా? ఆదిశంకరులు వాడిన పదం చూడండి, 'భవతు కుశలం'. కుశలము అగుగాక, అని అర్థం. భక్తుడు అమ్మవారిని ఆశీర్వదించిన ఒక కమనీయమైన సన్నివేశం. ఆ నడుము కుశలంగా ఉండడంవల్లనే అనంతకోటి బ్రహ్మాండంలో సృష్టి స్థితి లయలు జరిగేది. ఇంతకన్నా విచిత్రం ఏమిటంటే, ఆదిశంకరులు ఈ శ్లోకంలో, అమ్మవారికి రెండు పదాలు సంబోధనకు వాడారు. ఒకటి 'నారీ తిలకమా' అని, రెండవది 'శైలతనయే' అని. ఎందుకీ విశేషణాలు ఉపయోగించారో తెలిస్తే ఒళ్ళు పులకరిస్తుంది. నారీతిలకము అంటే ఉత్తమ జాతి స్త్రీ లోకానికే తిలకమైనది. అందుచేత నడుము సాముద్రిక శాస్త్రంలో చెప్పినట్టు కృశించి ఉండాలి. రెండవ విశేషణం, శైల తనయే! కొండ కూతురు! ఏది ఏమైనా కొండ కూతురవడం వల్ల ఘనమైన శరీర సౌందర్యం ఉంటుంది. స్త్రీగా లావణ్యం, కొండ కూతురుగా దార్ఢ్యం. పదప్రయోగంలో నైపుణ్యమే కవిత్వం యొక్క లక్షణం. భక్తిపారవశ్యంలో అమ్మవారి నడుమును వర్ణించారు. అది దర్శించి రచించిన అనుభూతి, చదివినవాళ్ళకి అనిపించి కనిపించాలి.

కుచౌ సద్యః స్విద్య-త్తటఘటిత-కూర్పాసభిదురౌ
కషంతౌ-దౌర్మూలే కనకకలశాభౌ కలయతా।
తవ త్రాతుం భంగాదలమితి వలగ్నం తనుభువా
త్రిధా నద్ధం దేవీ త్రివలి లవలీవల్లిభిరివ ॥ 80 ॥

తాపర్యం:

దేవీ! బంగారు కుండలవంటి స్తనభారంచే బిగిసి, చెమటచే తడిసిన నీ రవిక, చిరుగుతుందేమో అన్నట్లున్నది. అట్టి స్తనాలను నిర్మించిన మన్మథుడు వాటి బరువుకి సన్నని నడుము తెగిపోకుండా ఉండడానికి లవలీ తీగెచే మూడు పేటలుగా త్రాడు కట్టినట్టు నీ పొట్టమీద మూడు మడతలున్నాయి.

వ్యాఖ్యానం:

అమ్మవారి నడుము వర్ణన అయింది. ముందు అమ్మవారి మెడను వర్ణించునపుడు మూడు మడతలు చెప్పియున్నారు. సాముద్రికంలో మూడు చోట్ల మూడు మడతలుండవలెనని శాస్త్రము. నుదురు, మెడ, కడుపు. అమ్మవారి నాభీదేశమున ఉన్న మూడు మడతలను, త్రివళి అందురు. ఈ శ్లోకంలో ఆదిశంకరులు, ఈ మూడు మడతలకు ఒక అందమైన కారణము చెప్పుతున్నారు. మన్మథుడు శక్తి ఉపాసకుడు. అమ్మవారే వానికి ప్రాణమిచ్చి పోషించినది. ఒక విధంగా ఆమె ఉపాసకుడే అయినను బిడ్డడు. ఆమె భక్తుడు. అమ్మవారి స్తనములను మన్మథుడు సృష్టించెనట! భక్తుడు సగుణంగా, విగ్రహ రూపంలో, అమ్మవారిని పూజించాలంటే, అత్యంత సుందరమైన శిల్పం ఉండాలి. శాక్తేయ ఆగమాలలో ఏ ఏ అంగములు ఏ పరిమాణంలో నిర్మించాలో శిల్పశాస్త్రం చెపుతుంది. ప్రతిమాకోశం అనే గ్రంథంలో ఈ వివరాలు ఉన్నాయి. మాతృస్థానంలో ఉన్న అమ్మవారి స్తనములు, జగన్మాతగావున సమృద్ధిగా ఉండాలి. ఆమె రవిక వేసుకుంటే స్తనభారానికి అది చిరుగుతుందేమో అన్నంత సుందరంగా మన్మథుడు అమ్మవారి స్తనాలు నిర్మించాడట. ఈ బరువుకి సన్నని నడుము

విరిగిపోకుండా ఉండడానికి మన్మథుడు ఒక ఉపాయం ఆలోచించాడు. అడవిలో లవలీ తీగె అని ఒక రకమైన సన్ననిది, బహు దృఢమైనది, తీగె దొరుకుతుంది. దానితో, నడుముని మూడు చుట్టలు చుట్టి దృఢపరచాడట. అమ్మవారి కడుపు మీద ఆ మూడు మడతలు, ఆమె నడుము ఈ లవలీ తీగతో చుట్టబడినదా అన్నట్లున్నది అని వర్ణన. దేవీ! అని సంబోధించారు, ఆమె ముమ్మూర్తులను, సకల భువనాలను సృష్టించిన తల్లి. ఆమె సౌందర్యాన్ని శివునికి చూపి ఆమెపై ప్రేమగలిపించినవాడు మన్మథుడు. శ్రీవిద్యా ఉపాసకుడు. వర్ణించినవారు జగద్గురువులు ఆదిశంకరులు.

గురుత్వం విస్తారం క్షితిధరపతిః పార్వతి నిజాత్
నితంబా-దాచ్ఛిద్య త్వయి హరణ రూపేణ నిదధే।
అతస్తే విస్తీర్ణో గురురయమశేషాం వసుమతీం
నితంబ-ప్రాగ్భారః స్థగయతి లఘుత్వం నయతి చ ॥ 81 ॥

తాత్పర్యం:

అమ్మా పార్వతీ! నీ తండ్రి బరువును, విశాలత్వాన్ని తన కొండచరియలలోంచి తీసి నీకు అరణంగా ఇచ్చాడు. అందుచేతనే నీ పిరుదల విశాలత్వము బరువు ఈ అశేషమైన భూమిని కప్పుచున్నది, చులకన చేయుచున్నది కూడా!

వ్యాఖ్యానం:

ఈ శ్లోకమును అర్థము చేసుకొనుటకు ముందు, రెండు మాటలు తిరిగి జ్ఞప్తికి తెచ్చుకొనవలెను. ప్రాచీన కాలమున, కవులు ఏది వర్ణించినను, నిర్మొహమాటముగా, సంపూర్ణముగా వర్ణించిరి. స్త్రీ వర్ణనమునగాని, పురుష వర్ణనమునగాని, ఇది సంప్రదాయము, సదాచారము, శాస్త్రీయము. ఆదికవి అయిన వాల్మీకి మహర్షి, రామాయణములో ఈ సంప్రదాయం నెలకొల్పెను. సుందరకాండలో సీత హనుమంతుని, రావణుడేమో, మారురూపములో వచ్చేనేమో, అని సందేహించి రాముని వర్ణింపుమనును. అప్పుడు హనుమ రాముని అంగాంగ వర్ణన చేస్తాడు. ఒక ఉత్తమ పురుషునిగాని, స్త్రీనిగాని

వర్ణించుట తప్పుకాదు. సాముద్రిక శాస్త్రబద్ధంగా చెప్పటం తప్పుకాదు. రెండవది అమ్మవారి వర్ణనలో ఏదేని వదిలిపెట్టుట దోషము.

ఈ శ్లోకమున, ఆదిశంకరులు అమ్మవారి వెనుక భాగము, అంటే పిరుదులను వర్ణిస్తున్నారు. అమ్మా పార్వతీదేవీ! మీ తండ్రి, పర్వతరాజయిన హిమవంతుడు, నీ పెళ్ళికి అరణముగా, నీకు స్త్రీ ధనంగా, ఆయన దగ్గర ఉన్న కొన్ని సంపదలు ఇచ్చాడు. అవి గురుత్వం, విస్తారం. ఈ రెండూ, ఆయన తన కొండ చరియలలోంచి పెకిలించి ఇచ్చాడు. బరువుగా ఉండడం, విశాలంగా ఉండడం అనే ఈ రెండు సంపదలు నీ పిరుదలకు వచ్చాయి. అందుచే అవి విశాలమయిన ఈ భూమిని మించి ఉన్నాయి. జగన్మాతకు అటువంటి అంగ సౌష్టవం ఉండడం సాముద్రిక శాస్త్ర సమ్మతమైన విషయం. తల్లిదండ్రులు, పిల్లని అత్తవారింటికి పంపే ముందు, వారిని జ్ఞాపకం చేసుకొని, ఆమెకు రక్షణగా ఉండేది ఏదయినా, ఇచ్చి పంపుతారు, దానినే స్త్రీ ధనం అని అరణం అని అంటారు. పవిత్రమైన దృష్టితో, లౌకిక విషయాలకు అతీతంగా అమ్మవారి సౌందర్య వర్ణన తెలుసుకుంటేనే, సౌందర్యలహరి అర్థమవుతుంది, చదివిన ఫలితం దక్కుతుంది.

కరీంద్రాణాం శుండాన్–కనకకదలీ–కాండపటలీం
ఉభాభ్యామూరుభ్యా–ముభయమపి నిర్జిత్య భవతి ।
సువృత్తాభ్యాం పత్యుః ప్రణతికఠినాభ్యాం గిరిసుతే
విధిజ్ఞే జానుభ్యాం విబుధ కరికుంభ ద్వయమసి ॥ 82 ॥

తాత్పర్యం:

అమ్మా పార్వతీ! వేద విదితమైన విధులను తెలిసిన తల్లీ! నీ రెండు తొడలు ఏనుగు తొండాలను, బంగారు అరటి బోదెలను జయించుటయేగాక, నీ పతికి సాగిలబడి మొక్కుట అను కఠినమైన చర్యచే నీ మోకాళ్ళు గుండ్రమై ఐరావతము యొక్క కుంభస్థలాలను జయిస్తున్నవి.

వ్యాఖ్యానం:

అమ్మవారి తొడలు, మోకాళ్లు ఈ శ్లోకంలో వర్ణిస్తున్నారు. కవులు లోకంలో స్త్రీల తొడలను అరటి బోదెలతోను, ఏనుగు తొండములతోను సరిపోల్చి వర్ణిస్తారు. ఆదిశంకరులు, అమ్మా! వైదికమైన విధులను తెలిసిన తల్లీ! అని సంబోధిస్తున్నారు. నీ తొడలు బంగారు అరిటి బోదెలను, ఏనుగు తొండాన్ని రెండింటినీ జయిస్తున్నాయి. ఎందుకు విధిజ్ఞే అని సంబోధించారంటే ఆమె నిత్యం పరమేశ్వరునికి సాష్టాంగంగా నమస్కరిస్తుందట. అది కఠినమైన పని అని వారే చెప్పి, అలా చేస్తే సున్నితమైన ఆమె కాళ్ళు ఏమవుతాయి అని ఊహించి, దానికి సమాధానం తరువాతి పాదంలో చెప్తున్నారు. ఇక్కడ రెండు పదాలు ఉపయోగిస్తారు శంకరులు. ప్రణతికఠినాభ్యాం, అని ఒకటి, సువృత్తాభ్యాం అని ఒకటి. మొదటి పదానికి, సాష్టాంగం కొంచెం కఠినమైనపని అని, రెండోదానికి, మంచి గుండ్రంగా అయినవి అని ఒక అర్థం, మంచి ప్రవర్తన కలిగిన అని ఇంకో అర్థం. ఆమె మోకాళ్లకు ఈ విశేషణాలు. ఈ కఠినమైన పనివల్ల, గుండ్రంగా అయిన నీ మోకాళ్లు ఐరావతం కుంభస్థలాలులా ఉన్నాయి అని అతిశయోక్తి చెప్తున్నారు. అమ్మవారి అందాన్ని వర్ణిస్తూనే ఆమె వైదికమైన శక్తిని, పతిభక్తిని, అలౌకిక జగన్మాతృత్వాన్ని తెలుపుతున్నారు ఆదిశంకరులు.

పరాజేతుం రుద్రం ద్విగుణశరగర్భౌ గిరిసుతే
నిషంగౌ జంఘే తే విషమవిశిఖో బాఢ-మకృత ।
యదగ్రే దృశ్యంతే దశశరఫలాః పాదయుగలీ
నఖాగ్రచ్ఛన్మానః సుర ముకుట-శాణైక-నిశితాః ॥ 83 ॥

తాత్పర్యం:

అమ్మా గిరిజా! మన్మథుడు శివుని జయించడానికి తన ఐదు బాణాలను పది చేసుకున్నాడు. నీ పిక్కలను అమ్ములు పొదులుగాను, నీకు దేవతలు

మొక్కునపుడు వారి కిరీటముల మణులచే సానబెట్టబడిన నీ కాలి పదివేళ్ల గోళ్ళను పదునైన బాణాలుగాను చేసుకున్నాడు.

వ్యాఖ్యానం:

ఈ శ్లోకమున అమ్మవారి పిక్కలు, కాలి వ్రేళ్ళ గోళ్ళు వర్ణిస్తున్నారు. సౌందర్యలహరిలో ఒక్కొక శ్లోకం ఒక సౌందర్య వర్ణన. ఆదిశంకరుల అద్వితీయ కవితా పాటవానికి గీటురాయి.

శివుని ఓడించడానికి మన్మథుని దగ్గర ఏమాత్రం బాణాలున్నాయి, ఐదు. అవి అయిదూ పూలే. కొంచెం పదునైనవి, గట్టివి ఉంటే, బాగుండును అనుకున్నాడు. అమ్మవారి పిక్కలు రెండూ రెండు అమ్ముల పొదులులా అనిపించాయి. మరి బాణాలు అయిదింటిని రెండింతలు చేసే అవకాశం వచ్చింది. ఆమె కాలి పదివ్రేళ్ళ గోళ్ళు. అవి నిత్యం దేవతలు నమస్కారం చేసేటప్పుడు, వారి కిరీటాల మణులతో, సానపెట్టిన ఆమె కాలి పదివ్రేళ్ళ గోళ్ళు. వాడి అయిన ములుకులుగలవి. ఇది మన్మథుడి శక్తి కాదు, అమ్మవారి సౌందర్య రహస్యవే ఆయున శక్తి. అమ్మవారికి సంబంధించినదేదైనా, పరమేశ్వరుని మోహపరచడానికి మంచి ఆయుధం కదా! అమ్మవారిని గిరిసుతే! అని సంబోధిస్తున్నారు. ఎంత కొండ కూతురైనా సున్నితమైన మనసుగల తల్లి.

శ్రుతీనాం మూర్ధానో దధతి తవ యౌ శేఖరతయా
మమాప్యేతౌ మాతః శిరసి దయయా దేహి చరణౌ ।
యయోః పాద్యం పాథః పశుపతి జటాజూట తటినీ
యయో-ర్లాక్షా-లక్ష్మీ-రరుణ హరిచూడామణి రుచిః ॥ 84 ॥

తాత్పర్యం:

తల్లీ! ఏ నీ పాదములు వేదములకు శిఖరములో, ఏ పాదములు కడిగిన నీరు శివుని జటాజూటమున గంగ అయినదో, ఏ పాదముల యొక్క లత్తుక యొక్క అరుణిమ విష్ణును కిరీటమునకు ఎర్రని కాంతినిచ్చునో ఆ పాదములు దయతో నా శిరసుపైనుంచుము.

వ్యాఖ్యానం:

ఆదిశంకరులు, అమ్మ పాదాల దగ్గిరకి వచ్చేసరికి, భక్త్యావేశం పొంగిపొరలుతుంది. ఇదిగో అటువంటి ఒక రసార్ద్రమైన శ్లోకం. అమ్మవారి పాదమహిమ. ఏ విశేషణాలూ లేవు, సంబోధన సరళంగా మాతా! అని చేస్తున్నారు. అమ్మవారి పాదములకు ఎన్ని విశేషణాలు! నీ పాదములు వేదములకు శిఖరాలు. మన వేదములు శృతులు. వేద విద్య రెండు భాగములు. ఒకటి శృతి, వినేది. రెండవది స్మృతి, జ్ఞాపకం పెట్టుకునేది. శృతి అంటే నాలుగు వేదాలు, వాటిలోని భాగాలు, సంహిత, బ్రాహ్మణము, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు. స్మృతులు అంటే వేదాంగాలు, ఉపవేదాలు, దర్శనాలు, ఉపాంగాలు. ఇందులోనే ధర్మశాస్త్రాలు, స్మృతులు వస్తాయి. అమ్మవారి పాదాలు వీటన్నిటికీ శిఖరము.

ఈ నీపాదాలను శివుని జటాజూటంలోనున్న గంగ కడుగుతుంది, గనుక గంగ నీ పాద్యం. అయ్యవారు అమ్మవారిని సేవించేటప్పుడు, ఆయన తలమీదనున్న గంగ, ఆమె పాదాలను కడుగుతుంది. అంతటి పవిత్రమైన గంగ, అమ్మవారి పాదోదకం. అమ్మవారు సృష్టి స్థితి లయలకు కారణమైన తల్లి. విష్ణువు ప్రతి నిత్యం సంధ్యా సమయంలో ఆమె పాదాలకు నమస్కరించడంవల్ల, ఆమె పారాణిచే ఆయన కిరీటకాంతి ఎరుపెక్కినదట. అటువంటి నీ పవిత్రమైన పాదాలను, తల్లీ! నాపై కరుణతో నా శిరస్సున ఉంచుము, అని ప్రార్థన. ఆదిశంకరుల అత్యద్భుతమైన భక్తిసాంద్రమైన శ్లోకం.

నమో వాకం బ్రూమో నయన-రమణీయాయ పదయోః
తవాస్మై ద్వంద్వాయ స్ఫుట-రుచి రసాలక్తకవతే ।
అసూయత్యత్యంతం యదభిహననాయ స్పృహయతే
పశూనా-మీశానః ప్రమదవన-కంకేలితరవే ॥ 85 ॥

తాత్పర్యం:

అమ్మా! నీ పాదములు కనులకింపై, లత్తుకతో ఎర్రనై ప్రకాశించుచున్నవి. ఉద్యాన వనములోని నీ పాద తాడనము పొందిన అశోక వృక్షములను

జూచి పరమ శివుడు అసూయ పొందుచున్నాడు. అట్టి నీ పాద ద్వంద్వమునకు నమస్కారము చేయుచున్నాను.

వ్యాఖ్యానం:

అమ్మవారి పాదాలకు నమస్కరించే మరొక శ్లోకం. శ్లోకం ప్రారంభించడమే అమ్మా! నమస్కారం చేస్తున్నాను అని. ఆ పాదాలెటువంటివో ఇంకా రమణీయంగా వర్ణిస్తున్నారు ఆదిశంకరులు. కనులకింపైన పాదాలు. దానికితోడు ఎర్రని పారాణి, ఇంకా రమణీయంగా ఉన్నాయి అమ్మవారి పాదాలు. ఆమె ఉద్యానవనంలో విహారం చేస్తున్నప్పుడు, ఆ వనంలోని అశోక వృక్షాలు, ఆమె పాదతాడనంవల్ల విరబూస్తాయట! అనూచానంగా, సంప్రదాయంలో, ఒక నానుడి ఉంది. పద్మినీ జాతి స్త్రీల పాదాలు తగిలితేనే కంకేలి అనే వృక్షం, అశోక వృక్షం అన్నది వికసిస్తుందట. అమ్మవారు ఉద్యానవన విహారంలో, ఆమె పాదతాడనం అనే అదృష్టం, అశోక వృక్షాలకు కలిగింది. అది చూసి, పశుపతి అయిన ఈశ్వరునికి అసూయ కలిగిందట. అయ్యో వాటికి కలిగిన అదృష్టం నాకు కలుగలేదే అని! అమ్మవారితో ప్రణయ కలహాలలో ఆమె కాలు తగిలే భాగ్యం నాకంటే ఉద్యానవనంలో అశోక వృక్షాలకే ఎక్కువ, అని ఆయన అసూయ పడుతున్నాడు. అటువంటి నీ పాదాలకు తల్లీ నమస్కారం అని శ్లోకం.

మృషా కృత్వా గోత్రస్ఖలన-మథ వైలక్ష్యనమితం
లలాటే భర్తారం చరణకమలే తాడయతి తే ।
చిరాదంతః శల్యం దహనకృత మున్మూలితవతా
తులాకోటిక్వాణైః కిలికిలిత మీశాన రిపుణా ॥ 86 ॥

తాత్పర్యం:

తల్లీ! పొరబాటున నీ వద్ద నీ సవతి పేరు పలుకుటచే ఏమీ తోచక నీ పాదములకు నమస్కరించుటకై వంగిన శివుని నుదురు నీ కాలితో తాకినపుడు అతని మూడవ కంటిచే దహింపబడిన మన్మథుడు

చాలాకాలముగా తనలోని బాధ పోయినటులు ఆననందిస్తున్నాడా అన్నట్టు నీ కాలి అందియలు కిలకిలారావం చేస్తున్నాయి.

వ్యాఖ్యానం:

ఇదియొక పరమ శృంగార రమణీయమైన శ్లోకము. పై శ్లోకములో, అశోకవృక్షములు అమ్మవారి పాదతాడనంతో, విరబూయడం చూసి, అసూయపడిన ఈశ్వరుడు, ఆ కోరిక ఎలాగో తీర్చుకోవాలనుకున్నాడు. ఈ భూమికను ఊహాచిత్రంలో పెట్టుకుని ఆదిశంకరులు ఈ శ్లోకం వ్రాశారు. ఒకనాడు పార్వతీ పరమేశ్వరులు, ఏకాంతంగా ఉన్నప్పుడు, శివుడు, పార్వతిని సవతి పేరుతో పిలిచాడు. వెంటనే తప్పు గ్రహించి, అమ్మవారి పాదాలపై పడ్డాడు. ఆమె కోపంగా, ఆయన నుదుటిని కాలితో అలవోకగా తోసింది, తన్నింది అనుకోండి. పాపం, మన్మథుడికి ఎన్నో ఏళ్లుగా ఒక ప్రతీకార వాంఛ. తనని బూడిద చేసిన శివుని ఎవరేనా పరాభావిస్తే చూసి ఆనందిద్దామని. ఇపుడు అమ్మవారి పాదతాడనంతో ఆ కోరిక తీరి కిలాకిలా నవ్వాడు. నిజానికి, అది మన్మథుని నవ్వు కాదు, అమ్మవారు, శివుని నుదురు పాదాలతో తాకిన తరువాత, పాదాలు వెనక్కి తీసుకుంది, ఆ సమయంలో ఆమె పదమంజీరాలు ధ్వనిస్తే అది మన్మథుడు కిలకిలా నవ్వినట్టుందట. ఇందులో ఎంత రమణీయమైన భావన ఉందో చూడండి. వ్యాసులవారు అమ్మవారిని లలితా సహస్రనామంలో 'శృంగార రససంపూర్ణా, అని వర్ణించారు. ఆదిశంకరులే పైన ఒకచోట అమ్మవారు నవరసాలకు ఆలవాలమని వర్ణించారు. శివపార్వతులు, జగజ్జనకులు, ప్రకృతీ పురుషులు. సృష్టి, స్థితి, లయలకు కారకులు. శృంగారంలోనైనా, అమ్మవారి పాదాలను తాకిన పులకరింత అనుభవించాలని పరమ శివుడు అనుకోవడం భార్యాభర్తల ప్రేమతత్త్వానికి పరాకాష్ట. ఆజన్మ బ్రహ్మచారులైన ఆదిశంకరులు తాను అనుభవించిన దివ్యభావాన్ని ఈ శ్లోకంలో మనకు అందించారు.

హిమానీ హంతవ్యం హిమగిరినివాసైక-చతురౌ
నిశాయాం నిద్రాణం నిశి-చరమభాగే చ విశదౌ ।
వరం లక్ష్మీపాత్రం శ్రియ-మతిసృహంతో సమయినాం
సరోజం త్వత్పాదౌ జనని జయత-శ్చిత్రమిహ కిమ్ ॥ 87 ॥

తాత్పర్యం:

జననీ! మంచుకొండయందు నివసించుటలో నైపుణ్యముగల నీ పాదములు, రాత్రింబవళ్ళు ప్రకాశించుచూ నీ భక్తులైన సమయాచార తత్పరులకు మిక్కిలి సంపదలను ఇచ్చుచున్నవి. అట్టి నీ పాదములు మంచుచే నశించి రాత్రి నిద్రించు లక్ష్మీదేవికి అధిష్టానమైన తామరలను జయించుటలో చిత్రమేమున్నది?

వ్యాఖ్యానం:

అమ్మవారి చరణములే ఈ జగత్తునకు శరణములు. ఈ శ్లోకం కూడా అమ్మవారి పాదముల మహిమ వర్ణనే. తామరలు పగలు వికసిస్తాయి, రాత్రి ముడుచుకుపోతాయి. వాటితో నీ పాదాలకు పోలికేమిటి? అమ్మవారిని, ఈ శ్లోకంలో ఆదిశంకరులు, జననీ! అని సంబోధిస్తున్నారు. ఆమె పాదాలు, ఆమెను ఆశ్రయించిన భక్తులకు రేయింబవళ్ళను తేడా లేకుండా, ఎల్లవేళలా మిక్కుటంగా సంపదలిచ్చేవి. ఆపాదములకు ఒక విశేషణం ఉపయోగించారు, 'హిమగిరి నివాసైక చతురౌ' అని అంటే మంచుకొండ మీద నివసించే చాతుర్యం, అలవాటు ఉన్నవి. తామరలో, ఇలా మంచు తగిలితే, అలా ముడుచుకుపోతాయి, రాత్రికి, మంచుకు తట్టుకోలేనివి. అలా నీపాదాలతో పోల్చడానికి ఎందుకూ పనికిరావు తామరలు అంటున్నారు ఆదిశంకరులు. అమ్మవారి పాదాలు ఇచ్చే సౌభాగ్యం, అనన్యమైన అమ్మవారి చరణముల మహిమ, సౌందర్యం ఈ శ్లోకంలో వర్ణించారు.

పదం తే కీర్తీనాం ప్రపదమపదం దేవి విపదాం
కథం నీతం సద్భిః కఠిన-కమఠీ-కర్పర-తులామ్ ।
కథం వా బాహుభ్యా-ముపయమనకాలే పురభిదా
యదాదాయ న్యస్తం దృషది దయమానేన మనసా ॥ 88 ॥

తాత్పర్యం:

దేవీ! కీర్తికి నెలవై, ఆపదలకు ఆకరము కాని నీ పదములు కవులచే ఆడు తాబేలు వీపువలె కఠినమైన దానితో ఎందుకు పోల్చబడినవి? అట్టి నీ పాదములు వివాహ సమయంలో ఎటుల దయగలిగిన మనసున్న శివునిచే కఠినమైన సన్నికల్లు రాయిపై ఉంచబడినవి?

వ్యాఖ్యానం:

అమ్మవారి పాదాల పైభాగం ఈ శ్లోకంలో వర్ణిస్తున్నారు. అమ్మవారి పాదాలు కీర్తికి, యశస్సుకు నెలవైనవి. ఆమె పాదాల చెంతకు, దరిదాపులకు కూడా ఆపదలు రావు. సాధారణంగా కవులు ఉత్తమజాతి స్త్రీల పాదాలను తాబేలు పైభాగంతో పోలుస్తారు. అది చాలా గట్టిగా ఉంటుంది. అమ్మవారి పాదాలు చిగురాకులాంటి మార్దవం కలిగినవి. ఆ పోలిక కుదరదు. పరమ శివుడు కూడా వివాహ సమయంలో అమ్మవారి పాదాన్ని చేతితో పట్టుకుని సన్నికల్లు అనే రాయిమీద పెట్టారు. అంత కఠినమైన రాయి మీద పరమ దయాళువు అయిన శివుడు నీ పాదాన్ని ఎలా ఉంచగలిగాడు అని శంకరులు ఆశ్చర్యపోతున్నారు. ఇది ఒక విచిత్రమైన శ్లోకం. వ్యాసుల వారు అమ్మవారి పాదాల పైభాగాన్ని 'కూర్మపృష్ఠా' అని వర్ణించారు. అంటే తాబేలు వీపువలె ఆమె పాదం పై భాగం ఉంది అని. ఇంత మృదువైన పాదం పై భాగాన్ని అంత కఠినమైనదానితో పోల్చడం ఆదిశంకరులకు నచ్చలేదు. పెళ్ళిలో, నాగవల్లిలో, కొన్ని కొన్ని సంప్రదాయాలలో, పెళ్ళికూతురు కాలు, సన్నికల్లు మీద ఉంచి పెళ్లికొడుకు, ఏ సమయంలోను చలించక ధర్మార్థములలో నిన్నే అనుసరిస్తాను, అని చెప్పే కార్యక్రమం ఉంటుంది. అంత కఠినమైన రాయి మీద అమ్మవారి కాలు, ఇంత

దయగలిగిన ఈశ్వరుడు ఎలా ఉంచాడు, అని అమ్మవారి పాదాల మృదుత్వాన్ని ఇనుమడించేలా వర్ణిస్తున్నారు. ఆమెను ఆశ్రయించినవారికి కీర్తినిచ్చి, వారికే ఆపదలు రాకుండా చూసుకునే తల్లి అమ్మవారు అని మొదటి పాదంలోనే చెప్పారు.

నఖై-ర్నాకస్త్రీణాం కరకమల-సంకోచ-శశిభిః
తరూణాం దివ్యానాం హసత ఇవ తే చండి చరణౌ ।
ఫలాని స్వఃస్థేభ్యః కిసలయ-కరాగ్రేణ దదతాం
దరిద్రేభ్యో భద్రాం శ్రియమనిశ-మహ్నాయ దదతౌ ॥ 89 ॥

తాత్పర్యం:

ఓ చండీ దేవీ! దేవతా స్త్రీలకు మాత్రమే కోర్కెలు తీర్చు కల్పవృక్షము తన చిగురుటాకులనెడి హస్తములతో వారి కోర్కెలను తీర్చును. కాని అహర్నిశలు దరిద్రులకు కూడా వెంట వెంటనే భద్రమునొసగు, వెన్నెలలను పరిహసించు నీ పాదముల గోళ్ళ కాంతి, దేవతా స్త్రీల కమలములవంటి చేతులు నీకు వారు నమస్కరించునపుడు వారి హస్త కమలములను ముకుళింపజేయుచున్నవి.

వ్యాఖ్యానం:

ఈ శ్లోకంలో అమ్మవారి కాలి గోళ్ళను వర్ణిస్తున్నారు. ఇంతకు ముందు ఒక శ్లోకంలో అవి మన్మథుని బాణాలుగా వర్ణించారు. ఇక్కడ అవి ఒక్కొక్కటి ఒక చంద్రవంకవలె ఉండి, అమ్మవారికి నమస్కరించడానికి వచ్చిన, దేవతా స్త్రీల కరకమలాలను ముకుళింపజేస్తున్నాయట! అంటే, వారికి గర్వభంగం చేస్తున్నాయి. ఇది ఒక భాగం. రెండవ భాగం ఇంకా రమణీయమైన వర్ణన. దేవలోకంలో కల్పవృక్షం ఉంటుంది అది చిగురుటాకులవంటి తన చేతులతో, వారి కోర్కెలు తీరుస్తుంది. కల్పవృక్షం ఎవరి కోర్కెలు తీరుస్తుంది? ఇక్కడ సంస్కృతంలో ఆదిశంకరులు ఒక పదం వాడారు, స్వఃస్థేభ్యః, అని. ఈ పదానికి రెండర్థాలు; ఒకటి ఏ కోరికలు లేనివారు, రెండు స్వర్గలోకంలో ఉండేవారు. వాళ్ళకుండే కోరికలేముంటాయి?

అలాంటివారి కోరికలు తీరుస్తుంది కల్పవృక్షం. మరి అమ్మవారు? దరిద్రులకు వెంటవెంటనే అహర్నిశలు శుభప్రదంగా భోగభాగ్యాలు ఇస్తూనే ఉంటుంది. కల్పవృక్షం చేతులు చెయ్యని పని అమ్మవారి కాలిగోళ్ళు చేస్తాయి. ఇందులో శ్లేషాలంకారం, సమాసోక్తి అలంకారం. ఆదిశంకరులకు అమ్మవారి పాదపద్మములయందున్న భక్తిసాంద్రతను తెలియజేసే శ్లోకం.

దదానే దీనేభ్యః శ్రియమనిశ-మాశానుసదృశీం
అమందం సౌందర్యం ప్రకర-మకరందం వికిరతి ।
తవాస్మిన్ మందార-స్తబక-సుభగే యాతు చరణే
నిమజ్జన్ మజ్జీవః కరణచరణః -షట్ చరణతామ్ ॥ 90 ॥

తాత్పర్యం:

అమ్మా! దీనులకు ఎల్లవేళలా, వారివారి కోరికలను అనుగుణంగా తీర్చేది, అత్యంతమైన సౌందర్యముగలది, మందార పుష్పగుచ్ఛంలా, అవిరళంగా మకరందాన్నిచ్చేది అయిన, ఈ నీ పాదమున నేను నా జ్ఞానమును అయిదు ఇంద్రియములను ఆరింటిని తీనేటీగవలె సమర్పించు భావమును పొందెదనుగాక!

వ్యాఖ్యానం:

అమ్మవారి పాదపద్మాలకు జీవితం అంకితం చేయ్యాలనే కోరిక ఆదిశంకరులు ఈ శ్లోకంలో వెలిబుచ్చుతున్నారు. ఎందుకంటే ఆమె చరణకమలాలు ఎటువంటివి; మొదటి లక్షణం, దీనులకు వారివారి కోరికలకు అనుగుణంగా ఫలమును ఇవ్వడం, రెండోది అత్యంతమైన సౌందర్యంతో కూడిన గుణాలనే తేనియను వెదజల్లడం, మూడోది కల్పవృక్షపు పుష్పగుచ్ఛంలా ఎల్లవేళలా సౌభాగ్యమనే తేనెను స్రవించడం. ఇవి మూడు పాదాలలో చెప్పి, నాలుగో పాదంలో, అమ్మవారికి అత్యంత భక్తిభావ సంభరితమైన ఒక విన్నపం, చేస్తున్నారు ఆదిశంకరులు. తల్లీ! అటువంటి నీ చరణములయందు, ఈ జీవుడు అనే నేను, నా అయిదు ఇంద్రియాలు మనస్సును చేర్చి, ఆరు కాళ్ళున్న తుమ్మెదవలె

నీ పాదపద్మములయందు భ్రమర భావము కలిగి, మునిగిపోయే వరాన్నియ్యి తల్లీ! అంటున్నారు శంకరులు. ఒక పాదంలో అమ్మపాదలలో ఐక్యమవ్వాలనే తపనను, ఇంతకన్నా గొప్పగా ఏ కవి, ఏ విద్వాంసుడు, ఏ ఉపాసకుడు, చెప్పియుండలేదు, చెప్పలేరు.

పదన్యాస-క్రీడా పరిచయ-మివారబ్ధు-మనసః
స్ఖలంతస్తే ఖేలం భవనకలహంసా న జహతి ।
అతస్తేషాం శిక్షాం సుభగమణి-మంజీర-రణిత-
చ్ఛలాదాచక్షాణం చరణకమలం చారుచరితే ॥ 91 ॥

తాత్పర్యం:

తల్లీ మంచి నడతగలదానా! నీ విలాసమైన నడకను నేర్చుకోవాలనే కుతూహలంతో రాజహంసలు ప్రయత్నం చేసి తొట్రుబడుతూ ఉంటే నిన్ను వదలని వాటికి నడకలో శిక్షణ ఇస్తూన్నట్లు నీ కాలి అందియ సవ్వడులు వినిపిస్తున్నాయి.

వ్యాఖ్యానం:

అమ్మవారి నడక, నడత, ఈ శ్లోకములో ఆదిశంకరులు అతి సుందరముగా వర్ణిస్తున్నారు. అమ్మవారిని సంబోధించుటలోనే 'చారు చరితే' అని, సుందరమైన నడకగలదానా, అని ఒక అర్థం, రమ్యమైన ప్రవర్తన, శీలముగలదానా, అని ఇంకొక అర్థం. ఈ రెండు అర్థాలకు అనుగుణంగానే, శ్లోకం రచించారు. ముందు మొదటి అర్థం చూద్దాం. అమ్మా! నీ ఇంటనున్న రాజహంసలు నీ పదవిన్యాసం, అంటే నడిచే విధానం నేర్చుకోవాలని, నిన్ననుసరించి నడుస్తూ, తొట్రుబడుతున్నాయి. అందువలన నీ చరణకమలాలనున్న, మణులు పొదగబడిన, అందియలు నువ్వు నడుస్తున్నప్పుడు సవ్వడి చేస్తూ, వాటికి నడకలో శిక్షణనిస్తూన్నట్లున్నది. ఇది, అమ్మవారి సుందరమైన నడకకు సంబంధించినది. ఆ నడక నేర్చుకోనేవరకు అవి వదిలిపెట్టవట!

ఇక రెండవది ఆమె చారు చరిత, అంటే మంచి శీలము, ప్రవర్తన కలిగినది. ఆమె లోకమాత. దానినీ నేర్పుతున్నట్లు ఉన్నది. ఎలా? మనం ఇంతకుముందు, ఒకసారి హంస శబ్దం గురించి చెప్పుకున్నాం. మనం గాలి పీల్చడంలో ఏర్పడే, శబ్దం హం -స. ఇది ప్రయత్నపూర్వకంగా ధ్యానం చేసినవారు హంసలు. ఏకాగ్రతతో సాధన చేసి ఒక స్థాయికి చేరినవారు పరమహంసలు. అది ప్రాణాయామం. ఊపిరి గబగబా పీల్చకూడదు. అందుకే అమ్మ నడక హంస నడక, మందగమన. ఉపాసకులనేవారు, ఆమె వద్దనే ఉండే హంసలు. ఆమె చరిత నేర్చుకోవాలని ఉపాసన చేస్తూ తొట్రుపడుతూ ఉంటారు. అయినా వదిలిపెట్టరు. అమ్మవారి గుణగణాలనే మాణిక్యాలు, (ఆమె అందియలు) అవి సాధకునికి ఉపదేశం చేస్తున్నట్టు సవ్వడి చేస్తున్నాయి.

నడక, నడత రెండింటిని ఒక శ్లోకంలో చెప్పి మార్గదర్శనం చేస్తున్నారు ఆదిశంకరులు.

గతాస్తే మంచత్వం ద్రుహిణ హరి రుద్రేశ్వర భృతః
శివః స్వచ్ఛ-చ్ఛాయా-ఘటిత-కపట-ప్రచ్ఛదపటః ।
త్వదీయానాం భాసాం ప్రతిఫలన రాగారుణతయా
శరీరీ శృంగారో రస ఇవ దృశాం దోగ్ధి కుతుకమ్ ॥ 92 ॥

తాత్పర్యం:

అమ్మా! నీ శయ్యకు బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, ఈశ్వరుడు నాలుగు కోళ్లుగా ఉన్నారు. నీ శయ్యను కప్పే నెపంతో శివుడు తెల్లని దుప్పటివలెనుండగా నీ ఎర్రని కాంతి ప్రతిబింబించుటవలన ఎర్రగా అయి శృంగార మూర్తివలె చూడముచ్చటగా ఉన్నాడు!

వ్యాఖ్యానం:

ఆదిశంకరులు 42వ శ్లోకము నుండి ఇంతవరకు, అమ్మవారిని కేశముల నుండి పాదములవరకు వర్ణించిరి. ఈ శ్లోకంలో అమ్మవారి వైభవాన్ని, మాహాత్మ్యాన్ని చెప్తున్నారు. అమ్మా! నీ సేవకులైన, బ్రహ్మ, విష్ణు, రుద్రుడు,

ఈశ్వరుడు నీ మంచానికి నాలుగు కోళ్ళుగా ఉన్నారు. ముందు ఈ పాదం ఒక్కటే అర్థం చేసుకుందాం. రుద్రుడు అంటే ఎవరు, ఈశ్వరుడు అంటే ఎవరు, సదాశివుడు అంటే ఎవరు అనేది ముందు తెలుసుకోవలసిన విషయం. సాధారణంగా ఇవి మనం పర్యాయ పదాలుగా వాడుతూ ఉంటాం.

రుద్రుడు వేదకాలం నాటి దేవుడు. ఋగ్వేదంలో రుద్రునికి 3 మంత్రాలున్నాయి, 77 సార్లు రుద్రుని పేర్కొంది వేదం. రుద్రుడు ఒక భయంకరమైన దేవుడు, పెనుతుఫానుకు సంబంధించినవాడు. మరుత్తులనే దేవతలకు తండ్రి. ఆరోగ్యానికి అధిపతి అని పేర్కొంది, వైద్యనాథుడు.

'జగతాం పతయేనమః' అని 'దేవానాం హృదయభ్యోనమః' అని యజుర్వేదం చెపుతోంది. రుద్రులు 11 మంది ఏకాదశ రుద్రులని యాజ్ఞవల్క్యుడు చెప్పాడు. రుద్రుడు సదాశివుని అంశ అని కొన్ని గ్రంథాలు పేర్కొన్నాయి.

ఇంక ఈశ్వరుడు అంటే ప్రభువు. మనం వాడుకునే మాటలలో కూడా ఈశ్వరుడు ఆ అర్థంలో వాడుతూ ఉంటాం. ప్రాణేశ్వరుడు, జీవితేశ్వరుడు ఇలాంటి మాటలు, భర్తకు ఉపయోగిస్తాం. ఈయన కూడా శివుని అంశయే. దక్షిణామూర్తి, కూడా అలాగే ఒక శివుని అంశ. ఇవన్నీ పర్యాయ పదాలుగా వాడడంలో తప్పులేదు.

లక్ష్మీధరులవారు ఈ శ్లోకానికి వ్యాఖ్యానం వ్రాస్తూ ద్రుహిణ అంటే బ్రహ్మ, హరి అంటే విష్ణువు, రుద్రుడు, ఈశ్వరుడు వీళ్ళు అధికార పురుషులని, వారి వారి విభాగాలకు అధికారులు, అమ్మవారి ఆజ్ఞానుసారం ఆయా కార్యాలను చేసే సేవకులు అని చెప్పారు. అంటే వరుసగా సృష్టి, స్థితి, లయ, తిరోధానములు చేస్తారు. తిరోధానం అంటే మాయమవడం, లేదా కనిపించకుండా పోవడం. అమ్మవారు అయిదు పనులు చేస్తుందని 'పంచకృత్య పరాయణా' అని ముందే చెప్పుకున్నాం, పై నాలుగుకాక, అనుగ్రహం ఐదవది. సదాశివుడు ఈ అనుగ్రహాన్ని ఆమె ఆజ్ఞానుసారం

నిర్వహిస్తాడు. ఈ శ్లోకంలో ఈ ఒక్కపాదం అమ్మవారి శక్తిస్వరూపం. మిగిలిన శ్లోకంలో తెల్లనైన, స్వచ్ఛమైన సదాశివుడు, ఆమె శయ్యపై జేరి, ఆమె ఎరుపుదనంవల్ల అరుణ కాంతితో ప్రకాశిస్తూ, మూర్తీభవించిన శృంగారంలా ఉన్నాడని వర్ణన. ఎరుపు శృంగారిని సంకేతం. వారిరువురి శృంగారమే సృష్టి స్థితి లయ, తిరోధాన అనుగ్రహాలకు మూలం.

అరాలా కేశేషు ప్రకృతి సరలా మందహసితే
శిరీషాభా చిత్తే దృషదుపలశోభా కుచతటే ।
భృశం తన్వీ మధ్యే పృథు-రురసిజారోహ విషయే
జగత్త్రాతుం శంభో-ర్జయతి కరుణా కాచిదరుణా ॥ 93 ॥

తాత్పర్యం:

తల్లీ! వంకర అయిన కురులతో, సరళమైన చిరునవ్వుతో, దిరిశెనపూవువంటి మృదువైన మనసుతో, కఠినమైన కుచములతో, సన్నని నడుముతో, విశాలమైన పిరుదులతో, శివుని 'అరుణా' అను శక్తి స్వరూపము (కామేశ్వరి) జగములను రక్షించుటకు శోభిల్లుచున్నది.

వ్యాఖ్యానం:

అమ్మవారిని సంపూర్ణముగా వర్ణించి, ఆదిశంకరులు ఆమెయే జగద్రక్షకి అని, ఈ శ్లోకంలో చెప్తున్నారు. మరొకసారి, తనివి తీరక, ఆమె సౌందర్యాన్ని వర్ణిస్తున్నారు. తల్లీ! నీ కురులు వంకరగా ఉన్నాయి. స్వభావం చేతనే సరళమై ఉంది నీ మందస్మిత వదనం. మృదువుగా శిరీషపుష్పంలాంటిది నీ మనసు. కఠినమైన కుచములు, కృశించిన నడుము, విశాలమైన పిరుదులు కలిగి, సదాశివుని ఒకానొక కరుణాపూరితమైన నీ 'అరుణ' అనే రూపం ఈ జగత్తును రక్షించడానికే ప్రకాశిస్తోంది. అరుణా అని అమ్మవారికి పేరు. ఆమెనే కామేశ్వరి అంటారు. కామేశ్వరి కరుణాస్వరూపిణి. సౌందర్యంలో ఎంత మార్దవమో కరుణలో అంత సౌజన్యం కలిగి జగత్తును రక్షించే అమ్మవారి రూపాన్ని ఇందులో వర్ణిస్తున్నారు.

కలంకః కస్తూరీ రజనికర బింబం జలమయం
కలాభిః కర్పూరై-ర్మరకతకరండం నిబిడితమ్ ।
అతస్త్వద్భోగేన ప్రతిదినమిదం రిక్తకుహరం
విధి-ర్భూయో భూయో నిబిడయతి నూనం తవ కృతే ॥ 94 ॥

తాత్పర్యం:

అమ్మా! కస్తూరిలో మచ్చ. చంద్రబింబము జలమయమైనది. అవి కళలనెడు పచ్చకర్పూరపు ముక్కలతో నింపబడిన గరుడ పచ్చల భరిణ. ఆ భరిణె నుండి, కస్తూరి, పన్నీటి జలము, పచ్చకర్పూరము నీవు దినదినము వాడుటచే ఖాళీ అగుటవలన, బ్రహ్మ నీ ఆజ్ఞచే తిరిగి తిరిగి వాటిని నింపుచున్నాడు.

వ్యాఖ్యానం:

ఆదిశంకరులవారి *సౌందర్యలహరి*లో, అత్యద్భుతమైన శ్లోకాలలో ఇది ఒకటి. పరమ రమణీయమైన కవిత్వం. ఆదిశంకరులంటారు, మనకి కనిపిస్తున్న ఈ చంద్రబింబం, అమ్మవారి మాణిక్యాల భరిణెట. అందులో మనకి కనిపించే మచ్చ, ఆవిడ నిత్యం నుదట ధరించే కస్తూరియట. ఆయన ప్రసరించే వెన్నెలలు, ఆమె జలకమాడే పన్నీరుట. చంద్రుని కళలు, ఆమె తాంబూలంలో వేసుకునే పచ్చకర్పూరపు ముక్కలట. మరి ఈ చంద్రుడు తరిగోపోతూ ఉంటాడు, పెరుగుతూ ఉంటాడు కదా, అంటే అది ఈవిడ ఆ భరిణెలో వస్తువులు ఉపయోగించడంవల్ల, ఖాళీ అయిపోతూ ఉంటే, బ్రహ్మగారు దానిని మాటిమాటికీ నింపుతూ ఉంటాడట. అసలు శాస్త్రంలో అమ్మవారు ఒక్కొక్క చంద్రకళలో ఒక్కొక పేరుతో ఉంటుంది. కామేశ్వరి, భగమాలిని, నిత్యక్లిన్న, భేరుండ, వహ్నివాసిని, వజ్రేశ్వరి, శివదూతి, త్వరిత, కులసుందరి, నిత్య, నీలపతాక, విజయ, సర్వమంగళ, జ్వాలమాలిని, చిత్ర, అని పేర్లు. ఆగమ రహస్యాలను అలంకారంలో బంధించి రమ్యమైన కవిత్వంగా చెప్పడం ఆదిశంకరులు మనకందించిన భిక్ష.

పురారంతే-రంతః పురమసి తత-స్త్వచ్చరణయో
సపర్యా-మర్యాదా తరలకరణానా-మసులభా ।
తథా హ్యేతే నీతాః శతమఖముఖాః సిద్ధిమతులాం
తవ ద్వారోపాంతః స్థితిభి-రణిమాద్యాభి-రమరాః ॥ 95 ॥

తాత్పర్యం:

అమ్మా! నీవు పురహరుడైన శివుని అంతఃపురమునందువు, నీ పాదముల సేవించు భాగ్యము చపల చిత్తులకు అలభ్యము. అంతేకదా! అందువలన ఇంద్రాది దేవతలు అణిమాది సిద్ధులతో సమముగా నీ ద్వారమున వేచియుందురు.

వ్యాఖ్యానం:

ఈ శ్లోకంలో అమ్మవారి దర్శనభాగ్యం, ఇంద్రాది దేవతలకు కూడా దొరకనటువంటిది, అని చెప్తూ ఉపాసకులకు, సాధకులకు, ఒక మంచి ఉపదేశం చేస్తున్నారు ఆదిశంకరులు. మొదటి రెండు పాదాలలోనే సర్వ ఉపాసకులకు, మంచి సందేశం ఇచ్చి, దానికి ఉదాహరణ మిగిలిన రెండు పాదాలలో చెపుతున్నారు. అమ్మా! నువ్వు త్రిపురాంతకుడైన సదాశివుని పట్టమహిషివి. నీ పాదాల దర్శనంగాని, సేవాభాగ్యంగాని చపలచిత్తులకు దుర్లభం, అని చెపుతున్నారు. ముందు ఎన్నో శ్లోకాలలో వశీకరణం గురించి, సంపదల గురుంచి, స్త్రీలు అప్సరసలు ఉపాసకుల వెంట పరుగులిడతారని చెప్పి, వాటికి ఇక్కడ సమాధానం చెప్తున్నారు. చపలచిత్తులు, ఇంద్రియనిగ్రహం లేనివారు, కామ క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను జయించలేనివారికి, ఎంతటి సాధకులైనా, ఇంద్రాది దేవతలైనా, వారికి ఆమె దర్శనం దొరకదు అని చెప్తున్నారు. 3-4 పాదాలలో వారుపయోగించిన పదాలు చెప్పిన విషయం గమనిద్దాం. ఇంద్రాది దేవతలు ఆమె ద్వారం దగ్గిరకు వస్తారట, అక్కడ ఉన్న అణిమాది సిద్ధులతో సంతృప్తి పడి వెళిపోతారట. ఇక్కడ ఇంద్రునికి ఒక విశేషణం వాడారు, అదేమిటంటే ఇంద్ర పదవి పొందడానికి ఎవరైనా వంద యజ్ఞాలు

చేయాలి. వారిని శతమఖులు అంటే నూరు మఖాలు అంటే యజ్ఞయాగాదులు చేసినవాళ్ళు అంటారు. తపస్సు చేసినా, వందలగొలది యజ్ఞయాగాదులు చేసినా చపల చిత్తులకు ఆమె పాదసేవా భాగ్యమో, దర్శనమో దుర్లభం అంటున్నారు. దానివల్ల మిగిలిన ఫలితాలు, సిద్ధులు లభిస్తాయి, కాని ఆమె చరణ సందర్శన సేవాభాగ్యాలు దొరకవు అని చెప్తున్నారు.

కలత్రం వైధాత్రం కతికతి భజంతే న కవయః
శ్రియో దేవ్యాః కో వా న భవతి పతిః కైరపి ధనైః ।
మహాదేవం హిత్వా తవ సతి సతీనా-మచరమే
కుచాభ్యా-మాసంగః కురవక-తరో-రప్యసులభః ॥ 96 ॥

తాత్పర్యం:

తల్లీ సతీదేవీ! ఎందరెందరో కవులు విధాత భార్య అయిన సరస్వతిని సేవించుచున్నారు. ఏంతో కొంత ధనము కలిగి ఎందఱో శ్రీమంతులు అగుచున్నారు. కానీ పతివ్రతలలో అగ్రగణ్యురాలవైన దేవీ! మహాదేవునికి తప్ప నీ స్తనముల ఆలింగనము గోరంట మొక్కకునూ దుర్లభము కదా!

వ్యాఖ్యానం:

ఇది అమ్మవారి పాతివ్రత్యానికి సంబంధించిన శ్లోకం. అమ్మవారిని సతీమతల్లీ! అని సంబోధిస్తున్నారు. లోకంలో కవిత్వం చెప్పేవాళ్ళు, పండితులు, విద్వాంసులు, బ్రహ్మ భార్య అయిన సరస్వతిని సేవిస్తున్నారు. కొంచెం పేరు రాగానే వారిని లోకం వాచస్పతి అని, వశ్యవాక్కు అని పిలవడమో, లేదా వారే 'వాణి నా రాణి' అనో పుంభావసరస్వతిని అనుకోడమో జరుగుతుంది. అలాగే విష్ణుమూర్తి భార్య, లక్ష్మీదేవి. నాలుగు డబ్బులు సంపాదించేసరికి లోకం వారిని, శ్రీమంతుడనో, ధనపతి అనో అంటారు. పతివ్రతామణులలో అగ్రగణ్యురాలైన పార్వతిని అలా ఎవరూ అనలేరు. సామాన్యంగా, గోరింటకు ఉత్తమ జాతి స్త్రీ స్పర్శ తగిలితే, అది బాగా పూస్తుందట. అమ్మవారి స్తనముల ఆలింగనము ఒక్క శివునికే, చివరకు గోరింటకూ దొరకదు అని, ఆదిశంకరులు, అమ్మవారి పాతివ్రత్యాన్ని

స్తోత్రం చేస్తున్నారు. ఇందులో శంకరులు అమ్మవారిని సతీ అని సంబోధించడం విశేషం, సతి అంటే పరమ శివుని భార్య అని ఒక అర్థం, పతివ్రత అని ఇంకొక అర్థం. పేరులోనే పాతివ్రత్యం ఉన్న తల్లి అమ్మవారు.

గిరామాహు-ర్దేవీం ద్రుహిణగృహిణీ-మాగమవిదో
హరేః పత్నీం పద్మాం హరసహచరీ-మద్రితనయామ్ ।
తురీయా కాపి త్వం దురధిగమ-నిస్సీమ-మహిమా
మహామాయా విశ్వం భ్రమయసి పరబ్రహ్మమహిషి ॥ 97 ॥

తాత్పర్యం:

ఓ పరబ్రహ్మ మహిషీ! వేద రహస్యముల నెరిగినవారు నిన్నే బ్రహ్మ భార్య అయిన సరస్వతివని చెప్పుదురు. నిన్నే విష్ణు పత్ని అయిన పద్మములయందు ఉండెడు లక్షీదేవివి అని చెప్పుదురు. నిన్నే శివుని భార్య అయిన పార్వతివి అందురు. కాని, నీవు ఇంకొక నాల్గవది అయిన, మిగుల దుస్సాధ్యమైన, అంతులేని మహిమగలిగిన, మహామాయవై విశ్వమును భ్రమింపజేయుచున్నావు.

వ్యాఖ్యానం:

పై శ్లోకంలో బ్రహ్మపత్ని సరస్వతిని వేరుగా చెప్పి, విష్ణుపత్ని లక్ష్మీదేవిని వేరుగా చెప్పి, ఈ శ్లోకంలో అమ్మవారే అన్ని రూపములు అని చెప్తున్నారు. వేదరహస్యములు తెలిసినవాళ్ళు నువ్వే బ్రహ్మ గృహిణి అయిన సర్స్వతివని, నువ్వే విష్ణుపత్ని అయిన లక్ష్మీదేవివి అని, నువ్వే శివుని భార్య అయిన పార్వతివని చెపుతున్నారు. అయితే నువ్వు నిజానికి వారు ముప్పురుకంటే వేరైన, అంత సులభంగా అర్థం చేసుకోలేని, అనంత మహిమాన్వితమైన, మహామాయవై విశ్వాన్ని భ్రమింపజేస్తున్నావు. ఈ శ్లోకంలో అమ్మవారు ముగురమ్మల మూలపుటమ్మ. ఆమెను శంకరులు పరబ్రహ్మ మహిషి అని సంబోధిస్తున్నారు. పరబ్రహ్మము అన్నది త్రిమూర్తులకన్న, సకలదేవతలకన్న వేరైనది, దానికి గుణము, ఆకారము ఉండవు అది అన్నిటికిమించిన సత్యము. అమ్మవారే జగత్తు, జగత్తే అమ్మవారి సృష్టి, ఇందులో ప్రతిప్రాణి ఆమె కనుసన్నలలోనే పుట్టి, పెరిగి, నశిస్తున్నాయి. కొన్ని మూల ప్రకృతులు

స్వయముగా ఆమెయే అని చెప్పే శ్లోకం ఇది. ఆమె అన్నీ అయినా నిజానికి ఆమె అన్నిటికీ అతీతురాలైన ఒక తత్త్వము.

కదా కాలే మాతః కథయ కలితాలక్తకరసం
పిబేయం విద్యార్థీ తవ చరణ-నిర్ణేజనజలమ్ ।
ప్రకృత్యా మూకానామపి చ కవితాకారణతయా
కదా ధత్తే వాణీముఖకమల-తాంబూల-రసతామ్ ॥ 98 ॥

తాత్పర్యం:

మాతా! స్వభావముచే చెవిటి, మూగవారికి సైతము కవిత్వ సామర్థ్యమునొసగు సరస్వతీదేవి తాంబూల రసమువంటి నీ పాదములను కడిగిన పారాణి జలము విద్యార్థినైన నేను ఎన్నడు త్రాగుదునో తెలుపుము.

వ్యాఖ్యానం:

ఆదిశంకరులు ఒక విద్యార్థిగా అమ్మవారిని ప్రార్థించే శ్లోకం. మాతా! అని సంబోధిస్తున్నారు. తల్లీ! నీ పాదాలు కడిగిన నీరు, నేనెప్పుడు తాగే అవకాశం వస్తుందో చెప్పు. నువ్వు తలుచుకుంటే చెవిటి, మూగివారికి కూడా కవితా శక్తిని ఇస్తావు కదా. ఆ జలం సరస్వతి తాంబూలంలాంటిది. నీ పాదాలపారాణి కడిగిన పాద్యం. పూర్వం మూక కవి అనే ఒక మూగి, చెవిటివాడు, అమ్మవారి కటాక్షంతో మూక పంచశతి అని అయిదువందల పద్యాలు వ్రాయగలిగాడు. కాళిదాసును అమ్మవారు ఎలా కరుణించిందో మనకందరకూ తెలిసిన విషయమే. అటువంటి నీ కరుణ, నాపై, ఈ విద్యార్థిపై, ఎప్పుడు చూపిస్తావమ్మా. అని ఆర్తిగా కోరుతున్నారు ఆదిశంకరులు.

సరస్వత్యా లక్ష్మ్యా విధి హరి సపత్నో విహరతే
రతేః పాతివ్రత్యం శిథిలయతి రమ్యేణ వపుషా ।
చిరం జీవన్నేవ క్షపిత-పశుపాశ-వ్యతికరః
పరానందాభిఖ్యం రసయతి రసం త్వద్భజనవాన్ ॥ 99 ॥

తాత్పర్యం:

జననీ! నిన్ను సేవించు భక్తుడు, సరస్వతీ కటాక్షముగలవాడై, లక్ష్మీ సంపన్నుడై బ్రహ్మ విష్ణువులకు ప్రత్యర్థివలె విహరించును. అందమైనవాడై రతీదేవి పాతివ్రత్యమును భంగము చేయగలడు. చిరకాలము జీవించుచునే బంధముల నుండి ముక్తుడై బ్రహ్మానందమను రసమును అనుభవించును.

వ్యాఖ్యానం:

ఆదిశంకరులు ఈ శ్లోకంలో సౌందర్యలహరికి ఫలశ్రుతి చెప్తున్నారు. అమ్మా! నిన్ను భజించువాడు సరస్వతీ కటాక్షం పొందుతాడు, లక్ష్మీదేవి అనుగ్రహం పొందుతాడు. ఎంతవరకు అంటే, అటు బ్రహ్మగారు, ఇటు విష్ణుమూర్తి, నీ భక్తుల యందు అసూయగలిగి, వారికి ఈ భక్తుడు పోటీ అనుకునేంతగా. అంతేకాకుండా, రతీదేవికి మన్మథుడికన్న అందంగా కనిపించి ఆమె పాతివ్రత్యం భంగం చేయగలిగే సమర్థుడు అవుతాడు. ఇది మాత్రమేకాక నీ భక్తుడు చిరకాలం జీవిస్తాడు, ఇంకా అన్ని బంధాల నుంచి ముక్తుడై, జీవన్ముక్తుడుగా జీవిస్తాడు. బ్రహ్మానందాన్ని పొందుతాడు.

ఈ శ్లోకంలో అమ్మవారి ఉపాసకుడు, సౌందర్యలహరి చదివినవాడు, వినినవాడు, ఈ ఆరు ఫలితాలను పొందుతాడు, అని ఆదిశంకరులు చెపుతున్నారు. లక్ష్మీధర పండితులవంటి కొందరు వ్యాఖ్యాతలు, ఈ ఆరు అసలు ఏమిటంటే, మన శరీరంలోని ఆరు చక్రాలను ఛేదించి, భక్తుడు సహస్రారాన్ని చేరుకుంటాడు అని చెప్తున్నారు. బంధముక్తుడైనా, చిరంజీవిగా ఉండడం, అంటే జీవన్ముక్తుడవడం. అంటే బ్రతికి ఉండగానే, మోక్షం పొంది కూడా, ఇంకా శరీరంతో ఆయుష్షు కలిగి ఉండడం. దీనికి విద్యారణ్యులవారు చెప్పిన ఉదాహరణనే లక్ష్మీధరులు ఉటంకించారు. ముక్తి పొందినా శరీరంతో ఉండడం, అంటే ఎలా అంటే, ఒక కుమ్మరివాని చక్రం, కుండ పూర్తయినా ఇంకా ఎలా తిరుగుతూ ఉంటుందో, అలా ముక్తి పొంది, సంసార బంధాలను పరిత్యజించినా, ఇంకా శరీరంతో ఉండడం అలాంటిది. బొందితోనే బ్రహ్మానందం పొందే స్థితి అది.

ప్రదీప జ్వాలాభి-ర్దివసకర-నీరాజనవిధిః
సుధాసూతే-శ్చంద్రోపల-జలలవై-రర్ఘ్యరచనా ।
స్వకీయైరంభోభిః సలిల-నిధి-సౌహిత్యకరణం
త్వదీయాభి-ర్వాగ్భి-స్తవ జనని వాచాం స్తుతిరియమ్ ॥ 100 ॥

తాత్పర్యం:

జననీ! సూర్యునికి దివిటీతో నీరాజనమిచ్చినట్లు, చంద్రకాంత శిలా బిందువులతో చంద్రునికి అర్ఘ్యం ఇచ్చినట్లు, సముద్రపు నీటితోనే సముద్రుడికి తర్పణం ఇచ్చినట్లు, నీవొసగిన నీ వాక్కులతోనే నీకు వాక్కులతో చేసిన స్తుతి ఇది!

వ్యాఖ్యానం:

సౌందర్యలహరిలో ఆఖరి శ్లోకం. ఆదిశంకరులు ఆమెకు మోకరిల్లి, చేస్తున్న అంకితం. అమ్మా! వాక్కులతల్లీ! సూర్యుని తేజస్సువలననే ఏర్పడిన ఒక దివిటీతో, ఆ సూర్యునికే నీరాజనం ఇచ్చినట్టు, చంద్రకిరణాలు చంద్రకాంత శిలపైబడి వెన్నెల స్రవించిన నీటితోనే, చంద్రుడికి అర్ఘ్యం ఇచ్చినట్టు, సముద్రంలో నించుని స్నానం చేస్తూ, ఆ నీటినే దోసిలిలో తీసుకుని, ఆ సముద్రునికే తర్పణం ఇచ్చినట్టు, నువ్వు ఇచ్చిన మాటలతోనే, నీకు చేసిన స్తుతి ఇది. పలుకులతల్లీ! ఇందులో నాదేమీ లేదు, ఇందులో అక్షరమైనా నాది కాదు. నీవే కర్తవు తల్లీ. నిరహంకారంగా అమ్మవారి ఎదుట ఈ స్తోత్రాన్ని ప్రస్తుతించి ఆమె చరణాలకు మోకరిల్లి ఆదిశంకరులు సమర్పించినది ఈ సౌందర్యలహరి.

* * *

ఇది జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్య కృతంబైన సౌందర్యలహరి యందు ద్వితీయ భాగమునకు శ్రీవిద్యా ఉపాసక పప్పు వంశోద్భవ, వేంకటరత్నమ్మ, సోమయాజి పుత్ర, వేణుగోపాలరావుచే విరచితంబైన అమృతలహరి యను వ్యాఖ్యానము సంపూర్ణము.

ఇతి శమ్